


# ఈనాడు




కరీంనగర్ 8-7-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 329
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



అదిగదిగో..

## మామ ఇంటిని చూసివద్దామా!



ఆకాశం ఓ ప్రహేళిక!

విశ్వం.. ఓ విస్మయాల పుట్ట!!

సుదూర వినీలాకాశంలో చంద్రనిప్పులు కురిపించే ఆ సూర్యుడేమిటి?

నిగూఢ నిశిరాత్రి సైతం పండు వెన్నెలలు కురిపించే ఆ చంద్రుడేమిటి?

ఈ విశ్వాంతరాళంలో మనిషిని కొన్ని యుగాల పాటు వేధించిన ప్రశ్నలివి. ఎంతో ఉత్సుకత రేకెత్తించిన విశ్వ సందేహాలివి.

..అందుకే ఈ సుదీర్ఘ మానవ ప్రస్థానంలో మనిషి వీటి గురించి పలు విధాల ఆలోచనలు చేశాడు. రకరకాల సమాధానాలు వెతుక్కున్నాడు.

చల్లదనాల చంద్రబింబంలో ఆత్మీయతను పంచే మేన'మామ'ను చూసుకున్నాం. అందులోనే ఆశ్చర్యాన్ని పెంచే పేదరాసి పెద్దమ్మను గుర్తించాం. పసిప్రాయంలో 'చందమామ రావే..' అని పాడుకుంటే.. యవ్వనంలో 'ఓ నెలరాజా.. వెన్నెల రాజా..' అని వేడుకున్నాం. అయితే.. మన మనసులకు ఎంత దగ్గరైనా నేటికీ మన 'మామ' గురించి మనకు తెలిసింది తక్కువే. నిన్న మొన్నటి వరకూ మనకు కనీసం అక్కడ నీళ్లున్నాయో లేదో కూడా అయోమయమే. మనిషి అక్కడకు వెళితే ఆదరణ ఉంటుందో లేదో తెలీదు. అందుకే మన అన్వేషణ నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో వేస్తున్న మరో అడుగే చంద్రయాన్-2.

భారత గగన పతాకను వినువీధిలో ఎగరేస్తూ.. ఈ నెల 14 అర్ధరాత్రి దాటాక (15 తెల్లవారుజామున) మబ్బులను చీల్చుకుంటూ పైకి లేవనున్న జీఎస్ఎల్వీ మార్క్-3, అది మోసుకుపోనున్న ఆర్బిటర్, ల్యాండర్, రోవర్లు చందమామకు సంబంధించిన ఎన్నో వింతలూవిశేషాల మూటవిప్పనున్నాయి. అసలీ చంద్రయానం అడుగడుగూ ఓ సంభ్రమమే. దీన్ని దృష్టిలో ఉంచుకునే నేటి నుంచి 'ఈనాడు' ప్రత్యేక కథనాలు అందిస్తోంది.

'జాబిల్లి కోసం'... 5లో!



శ్రీహరికోటలో సిద్ధంగా ఉన్న చంద్రయాన్ 2 వ్యోమనౌక

# పల్లెల్లో ఆకస్మిక తనిఖీలు

- 100 సంచార నిఘా బృందాల ఏర్పాటు
- పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి
- నిర్లక్ష్యం బయటపడితే వెంటనే కఠిన చర్యలు
- త్వరలో పంచాయతీరాజ్ సమ్మేళనాలు
- 3 రోజుల్లోనే పురపాలక, నగర పాలక, హైదరాబాద్ నగర చట్టంపై ముసాయిదా
- జలమండలికి ప్రత్యేక చట్టం
- ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం కేసీఆర్



అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రణాళికాబద్ధ అభివృద్ధి.. అవినీతికి ఆస్కారం లేని విధానాలు... ప్రజలకు పారదర్శక సేవలు లక్ష్యంగా కొత్త విధానాలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలిపారు. నగర, గ్రామీణ, రెవెన్యూ విధానాలను అమలులోకి తెస్తామని చెప్పారు. అధికారులతో కూడిన 100 సంచార నిఘా బృందాలను (ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను) ఏర్పాటు చేస్తున్నామని అవి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయని చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రత విషయంలో అలసత్వం ప్రదర్శించినట్లు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే వెంటనే కఠిన చర్యలుంటాయన్నారు. పంచాయతీరాజ్ చట్టం అమలుపై త్వరలోనే హైదరాబాద్‌లో కలెక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ పల్లెలు పచ్చదనంతో, పరిశుభ్రతతో (మిగతా 2లో)

> తెలంగాణ ఏర్పడిన వెంటనే, రాష్ట్ర ప్రాథమ్యాలు గుర్తించాం. సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇచ్చాం. మంచినీళ్ల సమస్య పరిష్కరించుకున్నాం. విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించాం. సాగునీటి ప్రాజెక్టులు కడుతున్నాం. పారిశ్రామికాభివృద్ధి కోసం టీఎస్ఐపాస్ చట్టం చేసుకున్నాం. ఇప్పుడు తెలంగాణ మరో మెట్టు ఎక్కాలి. అందుకోసం మంచి విధానాలు రావాలి.
>
> \- ముఖ్యమంత్రి కేసీఆర్



# 15,16 తేదీల్లో మున్సిపల్ నోటిఫికేషన్



- నెలాఖరున పోలింగ్
- 14వ తేదీ నాటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ,
- మహిళా ఓటర్ల గుర్తింపు
- కొత్త షెడ్యూల్ ఇచ్చిన పురపాలకశాఖ
- వేగవంతంగా ఎన్నికల ప్రక్రియ

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ క్రమంలో అవసరమైన ముందస్తు ప్రక్రియను మరింత ముందుకు తీసుకువచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 14వ తేదీ లోపు పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గతంలో ఈ గడువు 18వ తేదీ వరకు ఉండగా దీన్ని నాలుగు రోజులు ముందుకు తీసుకువచ్చారు. వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను 14న ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ రెండు పరిణామాల నేపథ్యంలో ఈ నెల 15న పురపాలక శాఖ రిజర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ వెంటనే అంటే ఈ నెల 15న లేదా 16న రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేయనుందని తెలిసింది. జులై 30 లేదా 31న రాష్ట్రంలోని 131 పురపాలక సంఘాలు, మూడు నగరపాలక సంస్థల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీనికి (మిగతా 2లో)



ఎమ్మార్పీఎస్ సభలో ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో విమలక్క, ఆకుల విజయ

## ఊపిరున్నంతవరకు పోరాడతా

- ఎస్సీ వర్గీకరణే నా లక్ష్యం
- భాజపా మా కల నెరవేరుస్తుంది
- మాదిగల ఆత్మగౌరవ జాతర సభలో మంద కృష్ణ మాదిగ
- ఎమ్మార్పీఎస్ పాతికేళ్ల ప్రస్థానం సందర్భంగా భారీ సభ
- ఎస్సీ వర్గీకరణకు మోదీని ఒప్పిస్తాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

6లో

10వ తేదీనే ఎంసెట్

## సీట్ల కేటాయింపు

**ఆప్షన్లు ఇచ్చుకున్న 38,495 మంది**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎంసెట్ సీట్లను ఈ నెల 10వ తేదీన కేటాయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 53,890 మంది విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాగా, ఆదివారం నాటికి 38,495 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఆప్షన్ల ఎంపికకు నేటితో గడువు ముగియనుంది. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా 783 ఆప్షన్లు ఇచ్చుకునే వీలుంటుంది. పదో తేదీన సీట్ల కేటాయింపు వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. సీటు వచ్చిన విద్యార్థులు 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. త్వరగా సీటు రావాలంటే విద్యార్థులు, వారి (మిగతా 2లో)



బెంగళూరు విమానాశ్రయంలో పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులతో సీఎం కుమారస్వామి

## రాజీలేని కర్ణాటకం

- సంకీర్ణ నేతలతో కుమారస్వామి చర్చలు
- తాను వైదొలిగేది లేదని ప్రకటన
- ముంబయి హోటల్లో అసమ్మతి నేతలు
- రాజీనామాల ఉపసంహరణకు ససేమిరా

3లో

నేడు జాతీయ బీసీ కమిషన్

## తొలి పర్యటన

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించిన తరువాత జాతీయ బీసీ కమిషన్ దేశవ్యాప్త పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు రానుంది. ఛైర్మన్ భగవాన్‌లాల్ సహాని, వైస్‌ఛైర్మన్ డా.లోకేష్ కుమార్ ప్రజాపతి, సభ్యులు తల్లోజు ఆచారి, కౌశలేంద్ర పటేల్, సుధాయాదవ్ తదితరులతో కూడిన కమిషన్ బృందం నగరంలోని రవీంద్రభారతిలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటలకు సమావేశం కానుంది. ఇటీవల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ తదితరుల బృందం దిల్లీకి వెళ్లి కమిషన్‌ను కలిసి (మిగతా 2లో)

# ఊరి పంట పండునులే!

### పల్లెల్లోనే పంట సేకరణ కేంద్రాలు

- తొలి దశలో కూరగాయల సేకరణ
- రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు
- పైలెట్ ప్రాజెక్టుగా ఎనిమిది జిల్లాల్లో ఏర్పాటు
- సెర్ప్‌కు నిర్వహణ బాధ్యతలు



లక్ష్మీనాయక్ తండాలో సాగు చేస్తున్న పాలకూర తోట

చివ్వెంల - న్యూస్‌టుడే

రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో ఆహార శుద్ధి కేంద్రాల(ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల)ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తొలి దశలో కూరగాయల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా సంఘాల రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అప్పగించింది. గ్రామీణ ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద సూర్యాపేట, సిద్దిపేట, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని కూరగాయల సేకరణ చేపడతారు. దీనివల్ల అక్కడి రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను సొంత గ్రామంలోనే అమ్ముకునే అవకాశం ఏర్పడుతుందని, ఇవి విజయవంతమైతే కేంద్రాలను మిగతా ప్రాంతాలకు విస్తరిస్తామని డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.

### రైతులకు ప్రయోజనాలెన్నో..

- సేకరణ కేంద్రాల ఏర్పాటుతో రైతులకు మధ్యవర్తుల బెడద, కమీషన్‌దారుల ఇబ్బందులు తప్పుతాయి.
- రవాణా ఖర్చులు తగ్గుతాయి.
- పంట కొన్న 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది.
- పంట ఉత్పత్తులు అమ్మగా వచ్చిన లాభాల్లో నిర్వహణ ఖర్చులు పోను మిగిలిన మొత్తంలోనూ రైతులకు వాటా లభిస్తుంది.
- ఉద్యానశాఖ ద్వారా ఈ కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, నారు తదితరాలను రాయితీతో అందిస్తారు.
- రైతులు అధిక దిగుబడులు సాధించేలా యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇప్పిస్తారు.

### సూర్యాపేట జిల్లాలో లక్ష్మీనాయక్ తండా ఎంపిక

సూర్యాపేట జిల్లాలోనే అత్యధికంగా కూరగాయలు పండిస్తున్న చివ్వెంల మండలం లక్ష్మీనాయక్‌తండాలో కూరగాయల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ గ్రామం పరిధిలో గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో కూరగాయలనే (మిగతా 2లో)




Eenadu epaper

# రెండేళ్లలో రాజకీయ ప్రకంపనలు

- తెలుగు రాష్ట్రాల్లో భాజపా బలోపేతం
- 2023లో తెలంగాణలో పార్టీకి అధికారం
- ఏపీలోనూ బలపడతాం
- చంద్రబాబుపై కక్ష సాధింపు ఉండదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు - అమరావతి

'రానున్న రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు వస్తాయి. భాజపా రెండు చోట్లా ప్రధాన పార్టీగా ఆవిర్భవిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో భాజపాను బలోపేతం చేయటమే లక్ష్యం' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2023 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని.. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సంఘటన పర్వ్‌లో భాగంగా ఆదివారం విజయవాడలో వేర్వేరు చోట్ల జరిగిన కార్యకర్తల, ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మార్పు కోరుకున్నట్లు స్పష్టంగా కనిపించింది. సీఎం కేసీఆర్ గుణాత్మక మార్పు తెస్తామని చెప్పి.. అయిదేళ్ల అధికారంలో ఉన్నా సచివాలయానికి పదిసార్లు కూడా రాలేదు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆవిర్భవించిన తెదేపా.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీతోనే జతకట్టింది. చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలు తిప్పికొట్టారు. ఆయనపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడేది లేదు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో 11 కోట్ల మంది కార్యకర్తలు సభ్యులుగా ఉన్న అతి పెద్ద పార్టీగా భాజపా ఆవిర్భవించింది. మోదీ నేతృత్వంలో రానున్న అయిదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను అయిదు ట్రిలియన్ డాలర్లకు చేర్చటమే లక్ష్యం. భాజపా పాలనలో దేశంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి" అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.


భాజపా సభ్యత్వం స్వీకరించిన వ్యక్తితో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో పార్టీ సీనియర్ నేతలు పైడికొండల మాణిక్యాలరావు, కృష్ణంరాజు

### సహకారంతో సమగ్రాభివృద్ధి సాధించాలి

తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారంతో సమగ్రాభివృద్ధి సాధించాలని కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్‌లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మన్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ దృష్టికి సెక్షన్-8

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

**ఈనాడు, హైదరాబాద్:** సచివాలయ భవనాల కూల్చివేత, అసెంబ్లీని ఎర్రమంజిల్‌లో కట్టాలన్న నిర్ణయాల్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సెక్షన్-8 ప్రకారం ఉమ్మడి రాజధాని హైదరాబాద్ పరిధిలోని అంశాల్లో గవర్నర్‌పై బాధ్యత ఉందని.. అసెంబ్లీ తరలింపు, సచివాలయ భవనాల కూల్చివేతను ఆయన దృష్టికి తీసుకెళతామన్నారు. పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్ ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సచివాలయ భవనాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినవని.. విలువైన కట్టడాలను కూల్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు తెరాస ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల మధ్య హైదరాబాద్‌లో ఉమ్మడి ఆస్తుల పంపకాల్లో చొరవ తీసుకున్న గవర్నర్.. వాటిని కాపాడటంలోనూ అదేవిధంగా వ్యవహరించాలన్నారు. ఆయన స్పందించకపోతే కేంద్ర హోంశాఖమంత్రి దృష్టికి, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

### తెరాస ప్రభుత్వంపై నిఘా పెడతాం

"అమిత్‌షా తెలంగాణలో ప్రారంభించిన భాజపా సభ్యత్వ నమోదుతో తెరాస గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తెలంగాణపై అమిత్‌షా గురిపెట్టారు. నెలకు ఇద్దరు కేంద్ర మంత్రులు వచ్చి రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షిస్తారు. పార్టీ విస్తరణకూ కృషి చేస్తారు. కేంద్ర నిధులు దారి మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వంపై నిఘా పెడతారు." అని లక్ష్మణ్ చెప్పారు.

### కేటీఆర్‌కు లెక్కలు రావా?

"తెలంగాణలో మిషన్ భగీరథ పథకాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం జల పథకాన్ని ప్రవేశపెట్టిందంటూ కేటీఆర్ చేసిన ట్వీట్ అవాస్తవం. 2014 అక్టోబరులో మంత్రిగా కేటీఆర్ గుజరాత్‌కు వెళ్లి అక్కడ వాటర్‌గ్రిడ్ పథకాన్ని అధ్యయనం చేసి వచ్చింది నిజంకాదా? తర్వాత తెలంగాణలో మిషన్ భగీరథ అమలుచేసి రూ.కోట్లు దండుకున్నారు. 13వ ఆర్థిక సంఘం ద్వారా యూపీఏ హయాంలో కేంద్రం నుంచి తెలంగాణకు రూ.16,597 వేల కోట్ల నిధులు వస్తే.. ఎన్డీయే వచ్చాక 14వ ఆర్థికసంఘం నుంచి 2014-19 వరకు 1,15,605 లక్షల కోట్లు వచ్చాయి. కేటీఆర్‌కు లెక్కలు రావా?" అంటూ నిప్పులు చెరిగారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టేందుకు ముఖ్యనేతలతో ఐదు బృందాలను భాజపా ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మల్లారెడ్డి, ఎన్వీ సుభాష్, సుధాకర్‌శర్మ ఉన్నారు.

# సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలి

- మరో మూడు రోజులే గడువు
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ఆన్‌లైన్‌లో సభ్యత్వాల నమోదుకు నిర్ణయం



**ఈనాడు, హైదరాబాద్:** పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శాసన సభ్యులు, పార్టీ ఇన్‌ఛార్జులకు సూచించారు. ఈ నెల పదో తేదీ వరకు గడువును నిర్దేశించినందున అప్పటివరకు పూర్తి లక్ష్యాలను చేరాలని కోరారు. మరోవైపు ఆన్‌లైన్ సభ్యత్వాలు చేపట్టాలని కేటీఆర్ నిర్ణయించారు. గత నెల 27 నుంచి తెరాస సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో ఎమ్మెల్యేకు 50 వేల నుంచి లక్ష వరకు సభ్యులను చేర్చాలనే లక్ష్యాన్ని అధిష్ఠానం నిర్దేశించింది. దాదాపు కోటికి పైగా సభ్యత్వ పుస్తకాలు జిల్లాలకు చేరాయి. సభ్యత్వ నమోదు ప్రక్రియను కేటీఆర్ ఆదివారం సమీక్షించారు. మంత్రుల నియోజకవర్గాలు, సీఎం నియోజకవర్గం గజ్వేల్, కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్ల, హరీశ్‌రావు నియోజకవర్గం సిద్దిపేట తదితర 80కి పైగా ప్రాంతాల్లో 10వ తేదీ వరకు లక్ష్యాన్ని చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

సభ్యత్వం బాగా చేస్తున్న ఎమ్మెల్యేలను కేటీఆర్ అభినందించారు. వీలైనంత ఎక్కువ మందిని పార్టీలో చేర్చాలని సూచించారు. మిగిలిన ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులతోనూ ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వాన్ని భారీగా పెంచాలని సూచించారు. 10న సభ్యత్వ నమోదు పూర్తయ్యాక పార్టీ గ్రామ, డివిజన్, మండల కమిటీలు, అనుబంధ సంఘాల నియామకాలు చేపట్టాలని కేటీఆర్ చెప్పారు. సభ్యత్వ నమోదు డిజిటలీకరణను పరిశీలించారు. వచ్చే మూడు రోజులు సభ్యత్వ నమోదుపై రోజువారీగా వివరాలను సమీకరించాలని ఆయన సూచించారని తెలిసింది.

### ఆన్‌లైన్‌లో..

పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ద్వారా సభ్యత్వ నమోదుతో పాటు అదనంగా ఆన్‌లైన్ సభ్యత్వాలను ప్రారంభించారు. 'తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వంలోని తెరాస సభ్యులుగా చేరండి' అంటూ కేటీఆర్ ఆదివారం ట్విటర్‌లో కోరారు. ఆన్‌లైన్ లింక్‌ను, సభ్యత్వ నమోదు పత్రాన్ని జత చేశారు. పలు ప్రాంతాల నుంచి అభిమానులు తెరాసలో చేరతామంటూ ట్విటర్‌లో కేటీఆర్‌ను కోరారు. సభ్యత్వ నమోదు పత్రాలు అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. దీనిపై కేటీఆర్ స్పందించి ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు పై దృష్టి సారించారు.

## హుజూర్‌నగర్ టికెట్ కోసం యత్నాలు

### కేటీఆర్ వద్దకు నేతలు

హుజూర్‌నగర్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికలలో పోటీకి తెరాస టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. పలువురు నేతలు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి టికెట్‌ను కోరుతున్నట్లు తెలిసింది. తాజాగా ఒక ఎన్ఆర్ఐ కేటీఆర్‌ను కలిసి టికెట్‌ను కోరినట్లు సమాచారం. సభ్యత్వ నమోదు అనంతరం చర్చిస్తామంటూ కేటీఆర్ ఆయనతో చెప్పారు.

# తెలంగాణకు భాజపా ద్రోహం

- తెరాస నేతలు బాల్క సుమన్, యెగ్గె మల్లేశం ధ్వజం

**ఈనాడు, హైదరాబాద్:** భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీరని ద్రోహం చేస్తోందని, రాష్ట్రంపై వివక్ష చూపుతోందని తెరాస ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తున్నా ఇక్కడి విపక్షాలు నోరు మెదపడం లేదని, అవి రాజకీయంగా దిగజారి వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆదివారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో బాల్క సుమన్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం విలేకర్లతో మాట్లాడారు. "కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించింది. దీనిపై తెరాస ఎలుగెత్తి చాటింది. కాంగ్రెస్ సహా విపక్షాల్లో ఏ మాత్రం చలనం లేదు. తెలంగాణ నుంచి నలుగురు భాజపా ఎంపీలు, అందులో ఒక కేంద్ర సహాయ మంత్రి ఉన్నా బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లలేక పోయారు. విపక్ష నేతలు ఆ విషయాన్ని పట్టించుకోకుండా కొత్త సచివాలయం, శాసనసభల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. మా పార్టీలో ఉండి బయటకెళ్లిన ఒక నేత రౌండ్‌టేబుల్ అంటూ కొత్త నాటకాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్, భాజపా నేతలు వేదికను పంచుకున్నారు. సచివాలయ నిర్మాణాన్ని ప్రతిపక్ష నేతలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు తప్ప ఉద్యోగులు వ్యతిరేకించడం లేదు. ఇకనైనా కాంగ్రెస్, భాజపాలు బుద్ధి తెచ్చుకోవాలి' అని అన్నారు.

# చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించనున్న రాష్ట్రపతి

## 14న తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం శ్రీహరికోటకు పయనం

**శ్రీహరికోట, న్యూస్‌టుడే:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనకు సంబంధించిన ప్రాథమిక షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 13న రామ్‌నాథ్ కోవింద్ దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి వస్తారు. అనంతరం తిరుమల చేరుకుని శ్రీ పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు. 14వ తేదీ ఉదయం 9.20 గంటలకు శ్రీ వారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4.25 గంటలకు శ్రీహరికోట చేరుకుంటారు. ఇక్కడ నక్షత్ర అతిథి భవనంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తరువాత రెండో ప్రయోగ వేదికకు వెళ్లి, జీఎస్ఎల్‌వీ-మార్క్3 వాహనాన్ని వీక్షిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 15వ తేదీ వేకువజామున మిషన్ కంట్రోల్ సెంటర్ (ఎంసీసీ)కి వెళతారు. 2.51 గంటలకు చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తారు.

# రాజీలేని కర్ణాటకం

ఈనాడు డిజిటల్ - బెంగళూరు

కర్ణాటక రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. కాంగ్రెస్, జనతాదళ్‌కు చెందిన 14 మంది ఎమ్మెల్యేల రాజీనామాతో ఒక్కసారిగా కుదుపునకు లోనైన సంకీర్ణ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కుమారస్వామి ఆగమేఘాలమీద బెంగళూరు చేరుకున్నారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు నగరానికి వచ్చిన ఆయన జనతాదళ్ శాసనసభాపక్ష సమావేశంలోనూ, అనంతరం కాంగ్రెస్ నాయకులతోనూ సమావేశమయ్యారు. కేవలం 14 మంది ఎమ్మెల్యేల కోసం రాజీనామా చేయనని ఆయన తేల్చిచెప్పారు. అదే సమయంలో నష్టనివారణ చర్యలను ప్రతిపాదించారు. "అసమ్మతుల్లో అత్యధికులు రామలింగారెడ్డి సన్నిహితులే. ఆయనను సముదాయించాలి. రాజీనామా చేసిన దళ్ ఎమ్మెల్యేల బాధ్యత మాదే. బెంగళూరు నగర ఇన్‌ఛార్జి మంత్రి బాధ్యతల నుంచి ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర్‌ను తప్పిస్తే అసమ్మతివాదులు కొంత శాంతిస్తారు. సోమవారం ఉదయం వరకు ఎమ్మెల్యేలు మనసు మార్చుకోకపోతే నా నిర్ణయం చెబుతా. భాజపా నుంచి పది మంది ఎమ్మెల్యేలను మనం నేరుగా ఆకర్షిద్దాం. కొందరు నాతో టచ్‌లో ఉన్నారు. వారిని మనవైపు రప్పిద్దాం" అంటూ ముఖ్యమంత్రి ప్రతిపాదించారని సమాచారం. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు కె.సి.వేణుగోపాల్, సిద్ధరామయ్య, డి.కె.శివకుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

### చర్చల్లో కాంగ్రెస్, దళ్ నేతలు

ఎమ్మెల్యేల రాజీనామాల నేపథ్యంలో శనివారమే బెంగళూరుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కె.సి.వేణుగోపాల్ ఆదివారం చర్చలు కొనసాగించారు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, మంత్రి డి.కె.శివకుమార్‌తో నిరంతర చర్చల్లో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ అసమ్మతిదారులను దారికి తెచ్చే బాధ్యతను వారికే అప్పగించినట్లు సమాచారం. రాజీనామా చేసిన ఎమ్మెల్యేలలో పలువురు సిద్ధరామయ్య సన్నిహితులున్నారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిని చేస్తే రాజీనామా వెనక్కు తీసుకుంటామంటూ సందేశాలు పంపారు. ఇదే అంశాన్ని మంత్రి డి.కె.శివకుమార్ ఆదివారం దళపతి దేవేగౌడకు వివరించారు. ఆ మాటలతో గౌడ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. 'సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో ఎలాంటి షరతులు లేకుండా మద్దతిస్తామని చెప్పి- ఇలా మాట మార్చడం ఏమిటి?' అంటూ అభ్యంతరం చెప్పారు. ఒక వేళ ముఖ్యమంత్రిని మార్చాల్సి వస్తే మల్లికార్జున ఖర్గేకు మేము మద్దతిస్తామని, సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అవుతారంటే మేము అసెంబ్లీ త్యాగానికైనా సిద్ధమన్న హెచ్చరిక చేశారు. ఇదే సమయంలో నేనేమీ ముఖ్యమంత్రి రేసులో లేనంటూ మల్లికార్జున ఖర్గే కొట్టిపారేయటం గమనార్హం.

### ముంబయి హోటల్లో ఇద్దరు భాజపా నేతలు

రాజీనామా చేసిన సభ్యుల్లో రామలింగారెడ్డి, సౌమ్యారెడ్డి, మునిరత్న, ఆనంద్‌సింగ్ మినహా మిగిలిన పది మంది ఎమ్మెల్యేలు ముంబయిలోని ఒక హోటల్లో బస చేశారు. వీరంతా ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బృందానికి నేతృత్వం వహించిన యశ్వంతపురం ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ స్పందిస్తూ ముఖ్యమంత్రిని మార్చాలని మేమెక్కడా డిమాండు చేయలేదన్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామాలను వెనక్కు తీసుకోబోమని తేల్చి చెప్పారు. ఈ హోటల్లో ఆదివారం భాజపాకు చెందిన ఇద్దరు నేతలు కనిపించడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నేత మహేంద్ర సింఘీ, మహారాష్ట్ర భాజపా ఎమ్మెల్సీ ప్రసాద్ లాడ్‌లు ఆదివారం ఉదయం అదే హోటల్ వద్ద కనిపించారు. తాజా పరిణామాలపై తమ పార్టీ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళీని కలిసేందుకే తాను హోటల్‌కు వెళ్లినట్లు సింఘీ అనంతరం విలేకరులకు తెలిపారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు ఉండదన్నారు. ఆయన వ్యక్తం చేశారు. ప్రసాద్ లాడ్ మాత్రం తాను హోటల్‌కు వెళ్లడంపై మాట్లాడేందుకు నిరాకరించారు. భాజపా సభ్యత్వ నమోదులో తీరిక లేకుండా ఉన్నానని కర్ణాటక వ్యవహారంపై తనకేమీ తెలియదని తెలిపారు. అదే హోటల్ వద్ద భాజపా యువ మోర్చా ముంబయి అధ్యక్షుడు మోహిత్ కాంబోజ్ కూడా ఆదివారం కనిపించారు. తాను హోటల్‌కు సమీపంలోనే ఉంటున్నానని, ఆదివారం కావడంతో 'స్పా' కోసం హోటల్‌కు వెళ్లినట్లు ఆయన వివరణ ఇచ్చారు. నేతలు బస చేసిన హోటల్ వెలుపల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్నాకు దిగడంతో మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడ భద్రతను రెట్టింపు చేసింది.

### యడ్యూరప్పకు అనుకూలంగా..

ముఖ్యమంత్రి పదవి అంశంపై భాజపా సీనియర్ నేత, కేంద్ర మంత్రి సదానందగౌడ స్పందించారు. 'కర్ణాటక శాసనసభలో భాజపాకు 105 మంది సభ్యుల బలం ఉంది. ఎమ్మెల్యేల రాజీనామాల ప్రక్రియ కొనసాగితే, సంఖ్యా బలం భాజపాకే పెరిగినట్లవుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న నమ్మకం ఉంది. మధ్యంతరానికి వెళ్లం. అవసరమైతే ముఖ్యమంత్రిగా యడ్యూరప్పే బాధ్యతలు చేపట్టడానికి ఊతమిచ్చేలా ముందడుగు వేస్తాం' అంటూ వివరించారు.

## ఆ విమానం భాజపా ఎంపీది

అసమ్మతి ఎమ్మెల్యేలు బెంగళూరు నుంచి ముంబయి వెళ్లిన ప్రత్యేక చార్టెడ్ విమానం వాహనం జుపిటర్ కేపిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందింది. ఈ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ భాజపా రాజ్యసభ సభ్యుడు రాజీవ్ చంద్రశేఖర్ కావటం గమనార్హం. ఈ నేపథ్యంలో... కాంగ్రెస్ నేతలు భాజపాపై ధ్వజమెత్తారు. దళ్‌నేతలతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని కూల్చటానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆ విమానం భాజపా నేతదని అంగీకరిస్తూనే.. "మేం వ్యాపారం చేస్తున్నాం. విమానం అవసరం ఉన్న వారెవరైనా దాన్ని ఉపయోగించుకోవచ్చు"ంటూ కంపెనీ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ఈ విమానం ఎవరు బుక్ చేశారు? ఎవరి కోసం చేశారు లాంటి ప్రశ్నలపై సమాధానం ఇవ్వటానికి నిరాకరించారు.

## చారిత్రక వారసత్వ ప్రాంతంగా సర్వాయిపేట గుట్ట: శ్రీనివాస్‌గౌడ్

**ఈనాడు, హైదరాబాద్:** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వాయిపేటలోని సర్దార్ పాపన్న గౌడ్ కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖల మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. త్వరలోనే అధికారుల బృందంతో ఆ ప్రాంతాన్ని సందర్శిస్తామన్నారు. సర్వాయిపేటకు చెందిన నేతలు ఆదివారం మంత్రిని కలిశారు. ప్రభుత్వ నిర్ణయంపై వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ, పాపన్నగౌడ్ నివాస ప్రాంతాన్ని చారిత్రక వారసత్వ సంపదగా అభివృద్ధి చేయాలని, పాపన్న గుట్టను శాశ్వత మైనింగ్ రహిత ప్రాంతంగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిపై పర్యాటక, పురావస్తు, గనుల శాఖలు చర్యలు చేపడతాయన్నారు.

### కాలినడకన తిరుమలకు టీజీవోలు

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నేతలు రవీంద్రకుమార్, కృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు, సుజాత తదితరులు ఆదివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కాలినడకన వెళ్లి తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌కు మంత్రి పదవి వచ్చినందున మొక్కు తీర్చుకున్నట్లు వారు తెలిపారు.

# తహసీల్దార్ల ఆందోళన బాట

- తిరుగు బదిలీలు చేయకపోవడంపై అసంతృప్తి
- నేడు ఉన్నతాధికారులకు నోటీసులు
- రేపటి నుంచి పని గంటల వరకే కార్యాలయాల్లో విధులు
- ప్రభుత్వం స్పందించకుంటే 15 నుంచి సామూహిక సెలవు
- టీజీటీఏ అధ్యక్షుడు గౌతంకుమార్


మాట్లాడుతున్న టీజీటీఏ అధ్యక్షుడు గౌతంకుమార్

**ఈనాడు, హైదరాబాద్, నాంపల్లి, న్యూస్‌టుడే:** ఎన్నికల అనంతరం చేపట్టాల్సిన తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్ల తిరుగు బదిలీలను చేపట్టకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందంటూ తెలంగాణ తహసీల్దార్ల సంఘం ఆందోళన కార్యక్రమాలకు కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 15 లోపు బదిలీలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లంతా సామూహిక సెలవు (మాస్ క్యాజువల్ లీవ్) పెడతారని ప్రకటించింది. ఇకపై పని గంటలకు మించి అదనంగా విధులు నిర్వర్తించబోమని తేల్చి చెప్పింది. ఆదివారం భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలోని టీజీటీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.గౌతంకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, పథకాల అమల్లో ఆటంకాలు ఎదురవుతాయని ఇన్నాళ్లు ఆందోళనలు చేపట్టలేదన్నారు. గతంలో ఎన్నికల సందర్భంగా తహసీల్దార్ల బదిలీలు చేపట్టి ఎన్నికలయ్యాక యథావిధిగా పాతస్థానాలకు మార్చేవారన్నారు. ఇదే రీతిలో ఏపీలో కూడా ఆ ప్రక్రియ పూర్తిచేశారని, తెలంగాణలో మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వానికి ఎన్నిమార్లు నివేదించినా ఫలితం కనిపించడం లేదని, అందుకే ఆందోళనలకు కార్యాచరణ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుస్తామన్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏను కలిసి నోటీసులు ఇస్తామని ప్రకటించారు. పలువురు తహసీల్దార్లు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా కుటుంబాలకు దూరంగా ఉంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఫూల్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర కార్యదర్శులు రాజేశ్వర్, ముంతాజ్, వెంకట్‌రెడ్డి, అన్వర్, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ కుమార్, మల్లేశం, శ్రీనివాస్, సుభాష్ చందర్, జయంత్, మంగీలాల్, అమీనొసింగ్, సలహాదారులు సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యాచరణ ఇలా..

◆ **8వ తేదీ:** రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులకు నోటీసులు, వినతిపత్రాలు.
◆ **9వ తేదీ నుంచి 14 వరకు:** వర్క్ టూ రూల్‌లో భాగంగా పనిగంటల వరకే విధులు.
◆ **15వ తేదీ:** ప్రభుత్వ స్పందన లేకపోతే తహసీల్దార్ల సామూహిక సెలవు.

VASAVI COLLEGE OF ENGINEERING
(AUTONOMOUS)
(Private Un-aided Non-minority Institution)
(Sponsored by Vasavi Academy of Education)
(Affiliated to Osmania University & Approved by AICTE)
9-5-81, Ibrahimbagh, Hyderabad-500 031, TS. www.vce.ac.in. Ph: 040-23146122

ADMISSION NOTIFICATION

Admission to B.E. 1st year under Category "B" seats for 2019-20

Candidates seeking admission into B.E. 1st year in the following courses under **Category "B"** seats for the academic year 2019-20 should apply online in the prescribed application form which is available along with detailed instructions on the college website **www.vce.ac.in**:

| Course | ECE | CSE | IT | Mech. | Civil | EEE |
|---|---|---|---|---|---|---|
| Intake | 180 | 180 | 120 | 120 | 60 | 60 |
| Category-B: | 54 | 54 | 36 | 36 | 18 | 18 |

The application registration fee of Rs.2,000/- (Non-refundable) also is to be paid online. The last date for online submission of filled-in application along with copies of relevant certificates, documents, receipt for payment of registration fee is on or before 14th July, 2019. The seats will be filled as per the Rules of the Govt. of Telangana and Guidelines of the Competent Authority. The tuition fee payable is Rs.1,30,000/- per annum. For updates on the admission process the applicants are advised to visit the college website regularly.

Dated : 08.07.2019 Secretary

LOVELY PROFESSIONAL UNIVERSITY
Transforming Education Transforming India
Think BIG

UNBEATABLE PLACEMENTS
From Google to Microsoft, LPU Students are working with top brands at packages of over ₹1 crore

APPLICATIONS OPEN FOR PROGRAMMES AFTER 10TH, 12TH, GRADUATION & POST GRADUATION

B.Tech./ B.Tech. (Hons.)
Integrated B.Tech.-M.Tech.
Integrated B.Tech.-MBA
• Electronics & Communications Engg. (ECE)
• Computer Science & Engg. (CSE)
• Information Technology (IT)
• Mechanical Engineering (ME)
• ME- Mechatronics
• Aerospace Engineering
• Automobile Engineering (AE)
• Civil Engineering (CE)
• Electrical Engineering (EE)
• Electrical & Electronics Engg. (EEE)
• Biotechnology (BT)
• Food Technology
• Biomedical Engineering (BE)
• Chemical Engineering (CHE)
• Petroleum Engineering
M.Tech. [Full Time]
B.Pharm./ M. Pharma.
BPT/ B.Sc. (MLT)
B.Pharma./ M.Pharm. (Ayurveda)
B.Sc./M.Sc. (Forensic Sciences)
B.Sc./ M.Sc. (Film & TV Prod.)
B.Design (Interior & Furniture)
B.Sc./ M.Sc. (Hons.) Chem./ Phy./ Maths
B.Sc. (Hons.) Food Tech.
MBA/ MBA (Hons.)
BCA/ MCA
BBA/ B.Com./ M.Com.
B.Sc. / M.Sc.(Hons.) Economics
B.Sc. (Hons.) Biotech/ Microbio.
M.Sc. (Hons.) Biotech./ Microbio.
B.Sc./ M.Sc. (Hotel Mgmt.)
B.Sc. (Hons.) Agriculture
B.Sc/ M.Sc. (Botany/ Zoology)
B.A., LL.B. (Hons.)/ LL.M.
B.Sc. (Design - Multimedia)
B.Arch./ B.Plan.
B.Sc. (Design - Fashion)
BFA/ MFA
M.Sc. (Hons.) Biochemistry
M.Sc. (Enviornmental Sciences)
BPA (Music Vocal/ Theatre)
B.A. (Hons.)/ M.A. (Psychology / History/ English/ Sociology / Pol. Sci. / Hindi/ Pub. Ad.)
B.Ed./ B.P.Ed.
M.Ed./ M.P.Ed.
M.Sc. Geography
B.Sc. (Nutrition & Dietetics)
M.Sc. (Nutrition & Dietetics)

Scholarships SCHOLARSHIP OF UPTO ₹1.8 LAKH PER STUDENT
For details, refer university website www.lpu.in

Meet our Counsellors in Telangana Time: 10 AM to 7 PM Toll Free: 1800-102-4428

| | | |
|---|---|---|
| WARANGAL | City Grand Hotel, S.V.P. Road, Rangampet | 08-10 July |
| HYDERABAD | #2/2A, Ameer Estate, Near S.R. Nagar, Bus Stand | 08-31 July |

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU) SUNDAY OPEN
Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab | SMS LPU to 53030
admissions@lpu.co.in | Toll Free: 1800-102-4428

# ఈనాడు

## జనస్వామ్యానికి రాజీ'నామాలు'

పచ్చగా ఉన్న చోట తిని వెచ్చగా ఉన్న చోట పడుకొనే శీలహీన రాజకీయం కర్ణాటకలో మళ్ళీ శిరసెత్తింది. పద్నాలుగుమంది పాలక సంకీర్ణ శాసన సభ్యుల రాజీనామాలతో జేడీ (ఎస్‌)- కాంగ్రెస్‌ సర్కారు నడిసంద్రంలో మునిగే నావను తలపిస్తోంది. ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదం పొందితే, అధికార కూటమి బలం ప్రధాన విపక్షం భాజపా కన్నా ఒకటి తరుగుపడి 104కు చేరనుందని రాజకీయ అంకగణితం వెల్లడిస్తోంది. తమ కూటమి ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి భాజపా 'ఆపరేషన్‌ కమలం' చేపట్టిందని కాంగ్రెస్‌ జేడీ(ఎస్‌)లు గుర్రుమంటుంటే, రాజీనామాల్ని వారి అంతర్గత గొడవగా కమలనాథులు పేర్కొంటున్నారు- వడ్లగింజలోనిది బియ్యపుగింజ అన్న వాస్తవం కళ్లకు కడుతూనే ఉంది. ఫిరాయింపు రాజకీయాల్లో కొత్త కోణం- రాజీనామాల పర్వం! పాలకపక్షం ఎమ్మెల్యేలతో రాజీనామాల ద్వారా అధికార కూటమిని మైనారిటీగా మార్చి, విశ్వాస పరీక్షలో ఓడించి తాము అందలం ఎక్కిన దరిమిలా, తమ కోసం రాజీనామాల 'త్యాగం' చేసిన వాళ్లను తిరిగి చట్టసభకు రప్పించే ధోరణి- ప్రజాస్వామ్య మౌలిక స్ఫూర్తికే శరాఘాతం! 2008లో సాధారణ మెజారిటీకి స్వల్పంగా తరుగుపడిన యెడ్డీ ప్రభుత్వం ఆ తరహా 'ఆపరేషన్‌'తోనే అనంతరకాలంలో సుస్థిరత సాధించగలిగింది. 'అధికారంలో కొనసాగడానికి అవినీతిని ఆశ్రయించం, అనైతిక పద్ధతులు అవలంబించం' అంటూ ప్రధాని పీఠాన్నే తోసిరాజన్న వాజ్‌పేయీ సచ్ఛీల విలువల ఆదర్శం కమలం పార్టీ శ్రేణుల్లో నేడు కొల్లబోయింది. ఒకనాడు యూపీలో ఫిరాయింపుదారులకు అంబారీలు కట్టి రాత్రికి రాత్రి కల్యాణ్‌సింగ్‌ సర్కారును కూల్చి జగదంబికాపాల్‌కు కిరీట ధారణ చేసినప్పుడు వాజ్‌పేయీ చేసిన సత్యాగ్రహ దీక్ష- ప్రజాస్వామ్య హంతకుల మెడలు వంచి భాజపా ప్రభుత్వ పునరుద్ధరణకు బాటలుపరచింది. నేడు తరతమ భేదాలతో అంతా ఆ తాను ముక్కలే అయిన నేపథ్యంలో- ప్రజా తీర్పునకు చట్టసభల్లోనే నిప్పుగా గోరీకట్టే అవకాశవాద నికృష్ట రాజకీయం దేశవ్యాప్తంగా ప్రస్ఫుటమవుతోంది!

ఫిరాయింపుల బెడ దేశ ప్రజాస్వామ్యాన్ని నలుచుకు తింటోందన్నది నిజమే అయినా, దానికదే ప్రధాన రోగం కాదు, అది రోగ లక్షణమే. ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు అంటున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో- విశాల జనహిత పరిరక్ష సైద్ధాంతిక పునాదులతో పుట్టుకొచ్చి, చెరువులో చేపల్లా ప్రజలతో మమేకమైన కార్యకర్తల శ్రేణులతో పరిపుష్టమై, అంతర్గత ప్రజాస్వామ్యమే శ్వాసగా మనగలిగిన పార్టీలు ఏవంటే- కలికాలంలో కలికిరి వెతకాల్సిందే! ఈ నేపథ్యంలో వైఖరిని నిర్మించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న భాజపాను మినహాయిస్తే- అధినేతల ఆకర్షణ శక్తే ఆలంబనగా నెట్టుకొస్తున్న పార్టీలదే మెజారిటీ. ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ శక్తులూ ఏక వ్యక్తి కేంద్రకంగా మారడం, వామపక్షాల ప్రభ మసకేసిపోవడం, స్వయంకృతాపరాధాలతో కాంగ్రెస్‌ అస్తిత్వమే ప్రమాదంలో పడటంతో దివాలాకోరు రాజకీయమే ఎల్లెడలా గజ్జెకట్టి ఆడుతోంది. ధనశక్తి యావత్‌ ప్రజాతంత్ర వ్యవస్థనూ కబళించక ముందే సరైన సంస్కరణలు ప్రజాస్వామ్య హితోద్ధరణకు మన్నన దక్కించుకోవడంపట్ల- ఎన్నికల వేళ ధనస్వామ్య దాడాగిరిని, దరిమిలా గోడ దూకుడు గాళ్ల అవకాశవాద రాజకీయాన్నీ ప్రజలు విస్తుపోయి చూడాల్సి వస్తోంది! ఎన్నికలప్పుడు పార్టీల టిక్కెట్లు అనుగ్రహిస్తోంది- పార్టీ సిద్ధాంతాలపట్ల నిబద్ధత, ప్రజాసేవానురక్తి, నాయకత్వ లక్షణాలున్న క్రియాశీల కార్యకర్తలకు కానే కాదు! కడ నిమిషంలో పార్టీ ఫిరాయించి వచ్చినా, కుల సమీకరణాలు సరిపోయి ధనబల సంపన్నులైతే చాలు- గెలుపు గుర్రాలుగా పార్టీలు వారికే తగలిస్తున్నాయి అభ్యర్థిత్వాల జీనులు! పదుల కోట్ల రూపాయలు వెదజల్లి నెగ్గుకొచ్చిన వాళ్లు ప్రతిపక్షంలో ఉండి గోళ్లు గిల్లుకొనే కన్నా పాలక పార్టీలో చేరి 'జాక్‌పాట్‌' కొట్టాలనుకోవడం ఫిరాయింపులకు ఊతమవుతోంది. 'ఆయారామ్‌'లను సాదరంగా స్వాగతించే పక్షాలు, 'గయారామ్‌'లపట్ల గుస్సాపడటమే కుటిల రాజకీయ వైచిత్రి!

'రాజకీయ ఫిరాయింపుల జాడ్యాన్ని రూపుమాపకపోతే, అది దేశ ప్రజాస్వామ్య పునాదుల్నే కాదు, మౌలిక సూత్రాల్నీ దెబ్బతీస్తుంద'ని 1985నాటి ఫిరాయింపుల నిషేధ చట్టం ప్రకటించింది. 1967లో కాంగ్రెస్‌ క్షీణ దశ ఆరంభమైనప్పుడు మొదలైన ఫిరాయింపులు- ప్రత్యేక చట్టం అమలులోకి వచ్చాక ప్రజా తీర్పును అపహసించేలా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వాల్ని కూల్చడానికే ఫిరాయింపుల్ని ఎగదోసే దుర్నీతి దోరణులను ఎంచి, విపక్షమన్నదే లేకుండా చేసే అప్రజాస్వామ్య పోకడల దాకా బహువిధ లక్ష్యాల సాధనే ఎజెండాగా ఆ జాడ్యం అన్ని చోట్లా కొత్త పిలకలు వేస్తూనే ఉంది. నిరుడు కర్ణాటకకు సంబంధించిన వ్యాజ్యంలోనే- అక్కడి శాసనసభ్యులు ఇంకా (అప్పటికి) ప్రమాణ స్వీకారం చెయ్యనందున వారికి ఫిరాయింపుల నిషేధ చట్ట అనర్హత నిబంధనలు వర్తించబోవంటూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులోనే వాదనలు వినిపించింది. చట్టం స్ఫూర్తికి నిలువునా తూట్లు పొడిచే దుర్రాజకీయ ధోరణుల్లో అన్ని పార్టీలదీ తిలాపాపం తలా పిడికెడు! బ్రిటన్‌లో జాన్‌ మేజర్‌ ప్రభుత్వం ఒక్క ఓటు మెజారిటీతో దీర్ఘకాలం మనగలిగిందంటే- ప్రజాస్వామ్య సంస్కృతి పార్టీల్లో వ్యవస్థీకృతమైనందువల్లనే. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఫిరాయింపు రాజకీయాల రంకుల రాట్నం యథేచ్ఛగా తిరుగుతున్న తీరు ఆలోచనాపరులకు హృదయశల్యమే! అవినీతి, అవకాశవాదాలతో పుచ్చిన వ్యవస్థను భూస్థాపితం చేసి, ఆరోగ్యకర రాజకీయానికి మళ్ళీ నారూ నీరూ పోయాల్సిన తరుణమిది. అతి పెద్ద పార్టీగానే కాదు. అసలైన జాతీయపక్షంగానూ భాజపాయే అందుకు చొరవ చూపాలి. వ్యవస్థాగత ప్రక్షాళనకు తక్కిన పక్షాలూ కూడివస్తేనే ప్రజాస్వామ్యం కోలుకొంటుంది.

# వ్యవసాయానికి ఊతమేదీ?



దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రాణాధారమైన వ్యవసాయ రంగంలో వృద్ధి క్రమంగా తగ్గుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం నూతన సంస్కరణలతో ముందుకొస్తుందని ఆశించిన వారికి కేంద్ర బడ్జెట్‌ నిరాశనే మిగిల్చింది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా ఏటా తగ్గుతూ ఇప్పుడు 14.4 శాతానికి చేరింది. మున్ముందు ఈ వాటా మరింత క్షీణించే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగిస్తోంది. కిందటి ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగంలో వృద్ధి 2.9 శాతం పెరిగింది. ఈ వృద్ధి అంతకు ముందు రెండేళ్లతో పోలిస్తే చాలా తక్కువన్నది చేదునిజం. యాభై శాతానికి పైగా జనాభా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న భారతావనిలో జీడీపీలో సేద్యం వాటా భారీగా కోసుకుపోతుండటం ఆందోళన కలిగిస్తున్న పరిణామం. దేశంలోని దాదాపు 14.4 కోట్లమంది రైతుల్లో 86.2 శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. కానీ వీరి చేతిలో ఉన్న సాగుభూమి చాలా తక్కువ. దేశవ్యాప్తంగా ఉన్న సాగు భూమిలో వీరు కేవలం 47.4 శాతం విస్తీర్ణంలో మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. మిగతా 13.8 శాతం రైతుల చేతిలో 52.6 శాతం భూమి ఉంది. అత్యధిక సంఖ్యలో రైతులు అతి తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడం కలవరపరిచే విషయం. మరోవంక రైతుల్లో మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఆ సంఖ్య ప్రస్తుతం 13.9 శాతానికి చేరడం ఆసక్తికరమైన విషయం. ఇది సానుకూల పరిణామం. సేద్య రంగంలో వస్తున్న ఈ కీలక మార్పులపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ సమర్పించిన బడ్జెట్లో కనీస ప్రస్తావన సైతం లేకపోవడం గమనార్హం.

### సాగునీటి వృథాతో సమస్యలు

తక్కువ వనరులతో అధిక దిగుబడి సాధించే పంటలపైనే రైతులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే నొక్కి చెబుతోంది. ఎకరం నేలలో ఎంత ఎక్కువ పండిస్తున్నాం అనే కాకుండా, ఒక లీటరు నీటితో ఎంత దిగుబడి సాధిస్తున్నామన్నదీ ముఖ్యమే! దిగుబడి సాధనలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ నాలుగో స్థానంలో ఉండగా- సాగునీటి వినియోగం విషయంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఉభయ రాష్ట్రాలు అట్టడుగున ఉండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఈ లోపాన్ని సరిదిద్దుకోకపోతే భవిష్యత్తులో సాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. సాగునీరు అందుబాటులో లేకపోవడం ఒక సమస్య అయితే- ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించుకోలేకపోవడం ప్రస్తుతం తెలుగు రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. ముఖ్యంగా ప్రాజెక్టుల కింద సాగుతున్న సేద్యంలో నీటి వృథా ఎక్కువగా ఉంటోంది. రైతులు సైతం అత్యధిక నీరు అవసరపడే పంటలవైపే మొగ్గుచూపుతుండటం గమనార్హం. చాలా సందర్భాల్లో సాగు నీటిని వృథా పోనిస్తున్న దాఖలాలూ ఉన్నాయి. దేశంలో అందుబాటులో ఉన్న నీటిలో 89 శాతాన్ని మాత్రమే సేద్యానికి ఉపయోగిస్తున్నారు. అందులో 60 శాతాన్ని వరి, చెరకు పండించేందుకే వినియోగిస్తున్నారు. ఈ పంటలను పండించడానికి ఎక్కువ నీరు అవసరం. పొలాలకు నిండా నీరు పెట్టే విధానానికి స్వస్తి పలికి, సాగునీటిని ఆచితూచి వినియోగించే తుంపర సేద్యం లేదా 'హోస్‌ రీల్‌' విధానాలను అందిపుచ్చుకుంటే 60 శాతానికి పైగా నీటిని ఆదా చేయవచ్చు. తుంపర సేద్యం వల్ల చీడపీడల బెడద తగ్గుతుంది.

పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. దానివల్ల వ్యవసాయంలో రసాయనాల వాడకం ఉండదని, సహజ వనరుల రక్షణ సాధ్యపడుతుందన్నది ప్రభుత్వ వాదన. ప్రస్తుతం దేశంలో 1.60 లక్షల మంది రైతులు ఈ పద్ధతిలో వ్యవసాయం సాగిస్తున్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. రైతులకు సరైన సలహాలు ఇచ్చేందుకు అనువుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, మార్కెట్లో ధరలు, ఇతర విషయాలను రైతులకు సకాలంలో మొబైల్‌ ద్వారా అందించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఇది ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ ఏ మేరకు సమర్థంగా ఆచరించగలరన్నది ప్రశ్నార్థకమే! రైతుల పంటకు మంచి

### కర్షకుడికి నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్‌

ధర దొరకడానికి అవసరమైన సదుపాయాలు సమకూర్చాలని ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్ఠంగా తీర్చిదిద్ది- పాడి, కోళ్ళు, మేకలు, చేపల పెంపకం వంటి రంగాలకు దన్నుగా నిలవాలని స్పష్టం చేశారు. ఇవన్నీ ఆచరణలో అందిపుచ్చుకోవాల్సిన ఆదర్శాలే. అయితే ఆ దిశగా వేగంగా అడుగులు పడినప్పుడే సత్ఫలితాలు సాకారమవుతాయి.



రైతులకు ప్రత్యక్షంగా అక్కరకొచ్చే అంశాలేవీ బడ్జెట్లో ప్రస్తావనకు రాలేదు. గడచిన రెండేళ్లలో పప్పుదినుసుల ఉత్పత్తి పెంచినందుకు రైతులకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు రైతులు నూనెగింజల ఉత్పత్తిని పెంచాలని, దీనివల్ల దిగుమతుల భారం తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు. గతానుభవాలను తరచి చూస్తే- పప్పుదినుసులు అధికంగా పండించిన రైతులు ధరలు పడిపోవడంవల్ల నష్టపోయిన విషయం తెలిసిందే. నూనెగింజలకు సంబంధించి దిగుబడులను పెంచినప్పటికీ, వాటి ధరలు పడిపోతే రైతులకు దిక్కెవరన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదు. తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతోంది. ఫిబ్రవరిలో సమర్పించిన మధ్యంతర బడ్జెట్లో ఆరు వేల రూపాయల సాయం ప్రకటించడం ఒక్కటే రైతులకు ప్రభుత్వం నేరుగా చేకూర్చిన లబ్ధి. ఇందుకోసం ప్రధానమంత్రి కిసాన్‌ సమ్మాన్‌ పథకం ప్రారంభించి రూ.75,000 కోట్లు కేటాయించారు. నిజానికి వ్యవసాయ రంగం మౌలిక మార్పుల కోసం ఎదురు చూస్తోంది. కంటితుడుపు చర్యలతో కర్షకుల కష్టాలను తీర్చలేమన్నది పాలకులకు తెలియనిది కాదు. పునాది స్థాయిలో మార్పులు సాకారం కానంతకాలం రైతు పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పులు రావన్నది చేదునిజం!

పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్నదాతలు తమ ఆదాయం రెట్టింపు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. దీని సాధ్యాసాధ్యాలు, లాభనష్టాలను శాస్త్రీయంగా మదింపు వేయాల్సిన అవసరం ఉంది. కేవలం ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక రాష్ట్రాల్లో అక్కడక్కడ మాత్రమే ఈ విధానం అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రైతులంతా ఈ పద్ధతికి మారాలని సలహా ఇవ్వడానికంటే ముందు ప్రభుత్వం దీనిపై శాస్త్రీయ విశ్లేషణ చేయించడం అవసరం. విశ్లేషణలో వెల్లడైన ఫలితాల మేరకు ముందుకు సాగాలి తప్ప హడావిడిగా ముందుకు వెళితే సానుకూల ఫలితాలు సమకూరవు.

### ప్రధాని సారథ్యంలో 'మండలి'తో మేలు

గ్రామీణ ప్రాంతాల్లో 1.25 లక్షల కిలోమీటర్ల రహదారుల కోసం రూ.80,250 కోట్లను మంత్రి నిర్మలా సీతారామన్‌ బడ్జెట్లో ప్రతిపాదించారు. ఇది ఆహ్వానించదగ్గ ప్రతిపాదన. పల్లెలను నగరాలు, పట్టణాలతో అనుసంధానించే రహదారులు రైతులోకానికి ఎనలేని మేలు చేస్తాయనడంలో సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో 75,000 మందికి శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలు పెంచి, చిన్న వ్యాపారాల నిర్వహణకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని సర్కారు ప్రకటించింది. ఈ వ్యాపారులు రైతులు పండించే పంటలను గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాసెసింగ్‌ చేసినట్లయితే- ఆ మేరకు పన్నులను తగ్గించే ప్రతిపాదన ముందుకు తీసుకురావడం ముదావహం. దీనివల్ల రైతులు పండించిన పంటకు అధిక ధర లభించే అవకాశాలు మెరుగుపడతాయి. దేశవ్యాప్తంగా పదివేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. వీటివల్ల రైతుల సంఘటిత శక్తి పెరిగి లాభాలు పొందే అవకాశం ఉంటుంది. 'ఈనామ్‌' పద్ధతిని మెరుగ్గా ఉపయోగించుకుని రైతులు అధిక ధరలు పొందాలన్న ప్రభుత్వ సూచన స్వాగతించదగినదే. దేశంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈ విధానం అందుబాటులో ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా 'ఈనామ్‌' విస్తరణపై ప్రభుత్వం నోరుమెదపలేదు. రైతుకు మంచి ధరలు రావాలంటే అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయోత్పత్తి మార్కెటింగ్‌ కమిటీ చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా బడ్జెట్లో ఒక్క ప్రతిపాదనా లేకపోవడం నిరాశ కలిగించిన పరిణామం. ఒక వైపు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఆర్థిక సర్వే పేర్కొంటుండగా- బడ్జెట్లో ఎరువులపై రాయితీని 14 శాతం పెంచి ఇందు కోసం రూ.79,996 కోట్లు కేటాయించడం గమనార్హం. కేంద్ర బడ్జెట్‌ను సమీక్షిస్తే వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం దక్కలేదని అనిపిస్తోంది. ఉదాహరణకు జీఎస్టీ (వస్తు సేవల పన్ను) మండలి తరహాలో జాతీయ స్థాయిలో 'వ్యవసాయ మండలి'ని ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లయితే సేద్యానికి తిరుగులేని ప్రోత్సాహంగా ఉండేది. వ్యవసాయానికి సంబంధించి కేంద్రం పాత్ర పరిమితమే. అందువల్ల రాష్ట్రాలు, కేంద్రం కలిసి ఉమ్మడిగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక వేదికను ఏర్పాటు చేయడం అవసరం. ముఖ్యంగా విత్తన రంగ అభివృద్ధికి అవసరమైన పరిశోధనల కోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో మరింత చొరవ ప్రదర్శించాల్సి ఉంది.

– విన్నకోట రామచంద్ర కౌండిన్య

(రచయిత– వ్యవసాయరంగ నిపుణులు)

### అందని రుణాలు... అన్నదాతల అగచాట్లు



పరపతి... రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో కీలకమైనది. బ్యాంకుల నుంచి వారికి తగిన మేరకు రుణాలు ఇప్పటికీ అందడం లేదు. ఈ పరిస్థితిని మార్చే ప్రయత్నాలేవీ బడ్జెట్లో కనిపించలేదు. ఏటా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కార్యాచరణ ప్రణాళికలు ఘనంగా ఉంటున్నా ఆచరణలోకి వచ్చేసరికి అన్నదాతకు అరకొర సాయమే అందుతోంది. మొత్తానికి బడ్జెట్లో రైతులకు మేలు కలిగించే ప్రతిపాదనలు పరిమితంగానే కనిపించాయి. దేశ వ్యవసాయ విధానాల్లో సమూల క్షాళనను లక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం కొందరు ముఖ్యమంత్రులతో ఇటీవల ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ కమిటీని మరింత విస్తరించి- రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు నిర్మాణాత్మక పరిష్కారాలు అన్వేషించడం తక్షణావసరం!

# నష్టాల ఊబిలో డిస్కమ్‌లు

ఒకప్పుడు దేశంలో విద్యుత్‌ కొరతతో కటకటలాడిన పలు ప్రాంతాలు నేడు మిగులు స్థాయికి చేరుకున్నాయి. తరచూ విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలగడం తగ్గిపోయింది. 2014-19 మధ్య కాలంలో సరఫరా కన్నా గిరాకీ ఎక్కువగానే ఉన్నా, చివరకు ఈ వ్యత్యాసాన్ని సగటున 1.54 శాతానికి పరిమితం చేయగలిగారు. 2018-19లో గిరాకీ-సరఫరాల మధ్య వ్యత్యాసాన్ని 0.6 శాతానికి కుదించారు. 2014 తరవాత ఉత్పాదన సామర్థ్యాన్ని 235 గిగావాట్ల నుంచి 344 గిగావాట్లకు పెంచారు. ఈ ఘనత విద్యుత్కేంద్రాలకు, ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్‌ పంపిణీ సంస్థలకు (డిస్కమ్‌లకు) దక్కుతుంది.

### పేరుకుపోతున్న బకాయిలు

ఈ విజయం వెనుక కొన్ని చేదు వాస్తవాలు దాగిఉన్నాయి. విద్యుదుత్పాదన కేంద్రాలు, డిస్కమ్‌లు భారీ రుణభారంతో సతమతమవుతూ, నిర్వహణ ఖర్చులను సైతం రాబట్టలేని స్థితికి చేరుకుంటున్నాయి. కొన్ని సంస్థలు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలను తిరిగి కట్టలేక ఎగవేతదారులుగా మారాయి. ఒక అధ్యయనం ప్రకారం దేశంలో 34 విద్యుదుత్పాదన కేంద్రాలు రూ.1.8 లక్షల కోట్ల రుణ భారం మోస్తున్నాయి. వీటి నుంచి విద్యుత్తు కొని వినియోగదారులకు పంపిణీ చేసే డిస్కమ్‌లు బిల్లులను సకాలంలో చెల్లించకపోవడం, ఆలస్యంగా చెల్లించడం, చాలా సందర్భాల్లో ఎగవేయడం వల్ల విద్యుత్కేంద్రాల నష్టాలు కొండలా పెరిగిపోయాయి.

దేశం మొత్తం మీద డిస్కమ్‌లపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందనే కారణాన్ని చూపి, కేంద్రం ఉదయ్‌ పథకం విజయవంతమైందని చెప్పుకొంటోంది. అయితే విద్యుత్‌ పంపిణీ సంస్థలపై ఆర్థికేతర ఒత్తిళ్లు ఉన్నాయనే సంగతిని విస్మరించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్యుత్‌ వంటి పథకాలతో డిస్కమ్‌లను విషమ స్థితిలోకి నెట్టేస్తున్నాయి. ఉదయ్‌ పథకాన్ని ప్రారంభించడానికి ముందు డిస్కమ్‌ల స్థూల సాంకేతిక, వాణిజ్య (ఏటీఅండ్‌సీ) నష్టాలు 22 శాతం ఉండగా, గత ఆర్థిక సంవత్సరాంతానికి అవి 19.72 శాతానికి తగ్గాయి. ఇంతా చేసి ఈ తగ్గుదల కేవలం 2.3 శాతమే. ఈ తరహా నష్టాలను గణనీయంగా తగ్గించడంలో ఉదయ్‌ విజయవంతం కాలేదు. ప్రసార లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లలో లోపాల వల్ల సాంకేతిక నష్టాలు సంభవిస్తాయి. వీటిని 15 శాతానికి పరిమితం చేయాలని ఉజ్వల పథకం లక్షించినా వాస్తవంలో అంతకన్నా ఎక్కువ నష్టం వస్తోంది. గత పదేళ్లలో ఏటీఅండ్‌సీ (సాంకేతిక, వాణిజ్య) నష్టాలు సగటున 20-30 శాతంగా లెక్కతేలతాయి. వీటిని తగ్గించాలని ఎన్నో పథకాలు వేసినా అవన్నీ కాగితాల మీదే మిగిలిపోయాయి.

రాజకీయ అనివార్యతలు, జనాకర్షణ పథకాలు డిస్కమ్‌లకు శాపంగా మారుతున్నాయి. రాయితీపై విద్యుత్‌ సరఫరా, ఉచిత విద్యుత్‌ సరఫరా వంటి జనాకర్షక విధానాలు డిస్కమ్‌ల ఆర్థిక



### రుణభారంతో సతమతం

స్తోమతను దెబ్బతీస్తున్నాయి. తెలంగాణలో ఉచిత విద్యుత్‌ సరఫరా వల్ల డిస్కమ్‌లకు సుమారు రూ.7,100 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.6,000 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. నష్టాల బారి నుంచి డిస్కమ్‌లను ఒడ్డెక్కించాలని ఉజ్వల్‌ పథకం ఆశించింది. డిస్కమ్‌లు సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించుకోవడంతోపాటు సబ్సిడీలను 20 శాతానికి పరిమితం చేయాలని అది సిఫార్సు చేసింది. అంతకు మించి ఛార్జీలను పెంచితే తప్ప డిస్కమ్‌లు ఆర్థికంగా కుదుటపడవని తేల్చింది. కానీ, ఛార్జీలు పెంచినంత మాత్రాన అవి ఒడ్డున పడబోవని మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అనుభవం చెబుతోంది. మహారాష్ట్రలో అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నా, అక్కడి డిస్కమ్‌లు మరే రాష్ట్రంలోనూ లేనంత ఎక్కువ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఆంధ్ర, తెలంగాణలలో గరిష్ఠ వినియోగానికి ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నా, సాంకేతిక, వాణిజ్య నష్టాలూ తక్కువగానే ఉన్నా డిస్కమ్‌లు నష్టాల పాలయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్‌ కొనుగోలుకు ఎక్కువ ఛార్జీలు చెల్లించడం ఇందుకు కారణం. గుజరాత్‌, హిమాచల్‌ప్రదేశ్‌ వంటి రాష్ట్రాల్లో ఛార్జీలు తక్కువే అయినా డిస్కమ్‌లు లాభాల్లో ఉన్నాయి. గుజరాత్‌లో గ్రామాలకు ప్రత్యేక ఫీడర్‌ లైన్లు వేయడం, వ్యవసాయంలో విద్యుత్‌ చౌర్యాన్ని అరికట్టడం, గ్రామాలకు మీటర్లపై సరఫరా చేయడం, డిస్కమ్‌లను విభజించి స్వయంప్రతిపత్తి కల్పించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం వల్ల అవి లాభాలు పొందుతున్నాయి.

### నిరంతర సరఫరాతో నష్టాలు తగ్గుదల

విద్యుదుత్పాదనలో దేశం క్రమంగా స్వయం సమృద్ధమై మిగులు సాధించబోతోంది. గిరాకీ-సరఫరాల మధ్య వ్యత్యాసం క్రమంగా తగ్గిపోవడం దీనికి నిదర్శనం. మిగులును సమర్థంగా వినియోగించుకుంటే డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ప్రస్తుతం గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్‌ నిరాటంకంగా సరఫరా కావడం లేదు. ఇలా అరకొరగా సరఫరా చేయడం వల్ల డిస్కమ్‌లు నష్టాల బారిన పడుతున్నాయి. ఇటీవలి కాలంలో విద్యుదుత్పాదన, స్థాపిత సామర్థ్యం మెరుగుపడినందున గిరాకీ-సరఫరాల మధ్య తేడా తగ్గుతోంది. పెద్దగా అంతరాయాలు లేకుండా సరఫరా చేయగలుగుతున్నారు. నిరంతరాయ సరఫరా చేసినప్పుడల్లా డిస్కమ్‌ల నష్టాలూ తగ్గాయి. గడచిన రెండేళ్లలో ఉజ్వల్‌ పథకం డిస్కమ్‌ల వార్షిక నష్టాలను 70 శాతం (రూ.17,350 కోట్లు) మేరకు తగ్గించింది. నిరాటంక సరఫరా వల్ల గృహ, పారిశ్రామిక వినియోగదారుల నుంచి ఎక్కువ ఆదాయం రావడం దీనికి ప్రధాన కారణం. విద్యుదుత్పాదన సంస్థలు ఉత్పత్తి పెంచుకోవడం వల్ల నిరంతరాయ సరఫరా సాధ్యపడింది. ఇందుకు వాటిని అభినందించాల్సిందే. ఇప్పుడు పరిస్థితి అనుకూలంగా ఉన్నందున విద్యుదుత్పాదన సంస్థలు, డిస్కమ్‌లు ఆర్థికంగా బలోపేతం కావడానికి తగు వ్యూహాలను రూపొందించి, అమలు చేయాలి. సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించుకోవాలి. విద్యుదుత్పాదన, సరఫరా పరిస్థితి ఏమాత్రం దెబ్బతిన్నా విద్యుత్‌ రంగం మళ్ళీ సంక్షోభంలో కూరుకుపోతుంది. భారత్‌లో తయారీ (మేకిన్‌ ఇండియా) పథకం పురోగమిస్తున్న కొద్దీ విద్యుత్తుకు గిరాకీ పెరుగుతుంది. దేశం పారిశ్రామికంగా పురోగతి సాధించాలంటే గిట్టుబాటు ధరలకు నిరాటంకంగా విద్యుత్‌ సరఫరా జరగాలి!

– సత్యపాల్‌ మెనన్‌

### ఉపయోగపడని 'ఉదయ్‌'




నష్టాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర సర్కారు 2015లో చేపట్టిన ఉజ్వల్‌ డిస్కమ్‌ భరోసా పథకం (ఉదయ్‌) వల్ల ఇంకా ఆశించిన ఫలితాలు రాలేదు. 2018 జనవరి నుంచి డిసెంబరు వరకు డిస్కమ్‌లు ప్రభుత్వ, స్వతంత్ర విద్యుదుత్పత్తిదారులకు రూ. 26,306 కోట్ల మేరకు బకాయి పడ్డాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ డిస్కమ్‌లు చెల్లించాల్సిన బిల్లులు రూ.3,239 కోట్లు కాగా, తెలంగాణలో రూ.3,999 కోట్ల బకాయిలు ఉన్నాయి.

## సాధుసాంగత్యం

సూర్యోదయం చీకట్లను పారదోలినట్లుగా సాధుపురుషుల సాంగత్యోపదేశాలు మనిషిలోని అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తాయి. సాధుసత్సంగం వల్ల మనిషి మాయామోహం నుంచి విముక్తుడవుతాడు. శాంతి పొందుతాడు. ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడు.

'యోగం, విచక్షణ, పవిత్రత, వేదాధ్యయనం, తపస్సు, వైరాగ్యం, సమాజ సేవ, దానం, వ్రతాలు, యజ్ఞాలు, మంత్రాలు, తీర్థయాత్రలు... వ్యక్తులకు, సమాజానికి ఉద్దేశించిన నీతినియమాలు... ఇవేవీ సాధుసాంగత్యం కన్నా ఎక్కువగా నాకు ప్రీతికరమైనవి కావు!' అని శ్రీకృష్ణుడు బోధించాడు.

జగద్గురువులు ఆదిశంకరాచార్యులు భజగోవిందంలో సాధుసాంగత్యం గురించి వివరిస్తూ 'సత్సంగం ద్వారా మానవుడు జ్ఞానవంతుడు, వివేకవంతుడు, నిస్సంగుడు, నిర్లిప్తుడు అవుతాడు. ప్రపంచంలోని విషయవాసనలకు చిక్కుకోకుండా విచక్షణా జ్ఞానాన్ని కలిగి ఉంటాడు. సంసార సాగరంలో పడి దుఃఖాల పాలు కాకుండా మోహాన్ని త్యజించి మనసును నిర్మలంగా నిశ్చలంగా చేసుకుంటాడు. మనసును పరమాత్మలో లగ్నం చేసి ఆనందాన్ని అనుభవిస్తాడు!' అన్నారు.

సాధుసాంగత్యం ద్వారా మాత్రమే మనిషి తన మనసును స్వాధీనపరచుకోవడం సాధ్యపడుతుంది. ఈ సత్సంగం వల్ల మనిషిలో



వివేకజ్ఞానం ఉదయిస్తుంది. అతడు ఇతరుల పట్ల సభ్యతతో సంస్కారంతో వ్యవహరిస్తాడు. విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, జటాయువు, కుబ్జ, ధర్మవ్యాధుడు మొదలైనవారెందరో సాధుసత్సంగం వల్లనే తరించారని భాగవతం తెలిపింది.

'సత్పురుషుల సాంగత్యం బుద్ధిజాడ్యాన్ని

అంతర్యామి

హరిస్తుంది. సత్యవాక్‌ పరిపాలకులను చేస్తుంది. పాపాన్ని నశింపజేస్తుంది. చిత్తప్రసన్నతను కలిగిస్తుంది. కీర్తిని వ్యాపింపజేస్తుంది!' అన్నది భర్తృహరి మాట.

ఒక వ్యక్తి ఔన్నత్యానికి, అధోగతికి కారణం సాంగత్య ప్రభావమే. అందుకే ప్రతి మనిషి సర్వదా సాధుపురుషుల స్నేహాన్నే కోరుకోవాలి. వారి సన్నిధిలోనే జ్ఞానాన్ని ఆర్జించాలి.

సువర్ణంతో కూడిన గాజుముక్క మరకతమణిలా శోభించినట్లు సత్పురుషుల సాన్నిధ్యంలో మూర్ఖులైనా, బుద్ధిమంతులై శోభిల్లుతారని హితోపదేశం చాటుతుంది.

చారుడు, క్రూరుడు అయిన రత్నాకరుడు నారదమహాముని సద్బోధతో మహోపదేశంతో వాల్మీకిగా మారి మహాకావ్యమైన రామాయణాన్ని లోకానికి అందించాడు. అందుకే సజ్జన సాంగత్యం ఓ పెన్నిధిలాంటిదంటారు పెద్దలు.

కాకుదంతుడు తాను గొప్ప విద్వాంసుణ్నని మహాగర్వంగా ఉండేవాడు. బుద్ధుడిని శాస్త్రార్థంలో ఓడించాలనే కోరికతో తన శిష్యులతో కలిసి ఏనుగుమీద ఎక్కి ఆడంబరంగా బయలుదేరాడు. బుద్ధుడి సన్నిధికి వెళ్ళాడు. బుద్ధుడి నిరాడంబర జీవితాన్ని చూసి శాస్త్రార్థం మాట మరచి శిష్యుడిగా మారిపోయాడు. సాధుపురుషులతో సంభాషించడం, వారిని దర్శించడం మొదలైన సుగుణాలవల్ల అల్పుడైనా ఔన్నత్యాన్ని పొందుతాడు.

సాధుసాంగత్యం అన్ని రకాల రాగానుబంధాలనూ కూకటివేళ్లతో పెకలించి వేస్తుంది. సమదృష్టిని కలిగిస్తుంది. సత్త్వగుణాన్ని పటిష్ఠం చేస్తుంది. అందుకే ప్రాపంచికుడైన మనిషి నిరంతరం సాధుసాంగత్యం చేయాలి. ఆ సాంగత్యం మనిషి మనసును భగవన్ముఖం చేస్తుంది. ఆధ్యాత్మికత మార్గంవైపు క్రమక్రమంగా పురోగమింపజేస్తుంది!

– విశ్వనాథ రమ



గ్రావిటీ కాలువలోకి నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

## వేగంగా నీటి ఎత్తిపోత

- అన్నారం బ్యారేజీకి చేరుకున్న 1.5 టీఎంసీల నీరు
- గోదావరిలో 80 వేల క్యూసెక్కుల ప్రవాహం

**కాళేశ్వరం, మహదేవపూర్, న్యూస్‌టుడే:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటుచేసిన కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా గ్రావిటీ కాలువలోకి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వెంటనే పంపుల నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఒకటో నంబరు పంపు శనివారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి నిరంతరంగా నడుస్తుండగా ఇటీవల సీఎం కేసీఆర్ ప్రారంభించిన 6వ పంపును ఆదివారం అప్పుడప్పుడూ నడిపారు. ఆదివారం రాత్రి నుంచి 3వ పంపును కూడా నడిపి జలాలను ఎత్తిపోసే విధంగా ఇంజినీర్లు సిద్ధం చేస్తున్నారు. అన్నారం బ్యారేజీకి ఇప్పటి వరకు 1.5 టీఎంసీల నీరు చేరుకున్నట్లు ఇంజినీర్ల అంచనా. కాళేశ్వరం వద్ద 80 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదవుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి 35 గేట్లను మూసివేశారు. రోజురోజుకూ నదిలో ప్రవాహం పెరుగుతున్నందున మరి కొన్నిగేట్లను మూసివేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యాలను ముఖ్యమంత్రి తిలకించినట్లు ఇంజినీర్లు తెలిపారు. గోదావరిలో నీరు పెరుగుతున్నందున మేడిగడ్డ వద్ద వరద కంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. ఒక డీఈ, ఇద్దరు జేఈఈలు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ ప్రవాహ వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. నీటిని ఎత్తిపోసే ప్రక్రియను చూసేందుకు ఆదివారం సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## పంటల బకాయిలకు రూ.150 కోట్లు విడుదల

### వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి

**ఈనాడు, హైదరాబాద్:** మద్దతు ధరకు కొన్న పంటలకు సంబంధించిన బకాయిలను రైతులకు చెల్లించడానికి రూ.150.17 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి తెలిపారు. గత యాసంగి(రబీ) సీజన్‌లో పండించిన సెనగలు, మినుములు, జొన్న, పొద్దుతిరుగుడు పంటలకు ఈ సొమ్ము చెల్లించాల్సి ఉంది. మద్దతు ధరకు పంటలను కేంద్రం కొంత పరిమితి మేరకే కొంటోందని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన పంటలను కొనుగోలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వస్తున్న దిగుబడులకు కేంద్రం కొంటున్న దానికి పొంతనే ఉండటం లేదన్నారు.

## సాంకేతిక లోపంతో రన్‌వేపై నిలిచిన స్పైస్‌జెట్ విమానం

### ఐదు గంటలు ఆలస్యంగా షిర్డీకి పయనం

**శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే:** షిర్డీకి వెళ్లేందుకు టేకాఫ్ తీసుకుంటున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం చోటుచేసుకుంది. విమానాశ్రయం అధికారుల కథనం ప్రకారం... స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఎస్‌జీ-3576 విమానం ఉదయం 9.25 గంటలకు ప్రయాణికులతో షిర్డీకి వెళ్లేందుకు రన్‌వే పై నుంచి టేకాఫ్ తీసుకుంటుండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గమనించిన పైలట్ వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రయాణికులను కిందకు దించి విమానాన్ని మరమ్మతుకు తరలించారు. మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు విమానం షిర్డీకి బయల్దేరి వెళ్లింది.

## తల్లిని పట్టించుకోని తనయులు

### కుమారుడి ఆస్తి స్వాధీనానికి నోటీసులు



ఇంటికి నోటీస్ అంటిస్తున్న ఆర్ఐ

**పెద్దపల్లి, న్యూస్‌టుడే:** తల్లిని పోషించని కుమారుడి ఆస్తి స్వాధీనానికి కోర్టు ఆదేశాల అమలుకు అధికారులు చర్యలు మొదలుపెట్టడం పెద్దపల్లి జిల్లాలో సంచలనం కలిగించింది. పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన కొప్పుల ముత్తయ్య సింగరేణిలో ఉద్యోగ విరమణ తర్వాత మరణించాడు. ఆయన పెద్ద కుమారుడు శంకరయ్య గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగిస్తుండగా చిన్నకుమారుడు హైదరాబాద్‌లో ఉన్నారు. తండ్రి మరణం తర్వాత తల్లి పోషణను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో మాతృమూర్తి లక్ష్మీ కోర్టును ఆశ్రయించారు. విచారణ నిర్వహించిన న్యాయమూర్తి వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ చట్టం ప్రకారం కుమారుల ఇళ్లు, ఆస్తి స్వాధీనానికి గతంలో ఉత్తర్వులు ఇచ్చారు. తర్వాత పెద్దపల్లి ఆర్డీవో చేపట్టిన విచారణకు కుమారులు హాజరు కాలేదు. దీంతో కోర్టు ఉత్తర్వులను అమలుపరిచేందుకు ఆదివారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. పెద్దపల్లి ఆర్ఐ-1 మోజెస్ గ్రామంలో విచారణ నిర్వహించారు. అధికారులు వచ్చిన సమయంలో శంకరయ్య, అతడి భార్య కూలి పనికి వెళ్లడంతో ఇంటి తలుపునకు నోటీస్ అంటించారు. కుమారుడికి చెందిన ఇంటితోపాటు అదే గ్రామంలోని 2.09 గుంటల భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో వంగపల్లి శ్రీనివాస్, సండ్రపల్లి వెంకటయ్య, సుభద్ర, రాజు తదితరులు

## ఎస్సీ వర్గీకరణ ఇక దిల్లీ చేతుల్లోనే

### మంత్రి ఈటల రాజేందర్

**బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ తేలాల్సింది ఇక దిల్లీలోనే అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. వర్గీకరణ చేయాలని ఇప్పటికే సీఎం కేసీఆర్ నేతృత్వంలో శాసనసభలో తీర్మానం చేసి దిల్లీకి పంపినట్టు గుర్తు చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన దండోరా రజతోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదిగలు ఆత్మగౌరవంతో బతికే రోజులు వచ్చాయన్నారు. త్వరలో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ, ప్రాథమిక ఆసుపత్రులలో వైద్య సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ కల్పించిన హక్కులను పొందాలని సూచించారు. గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డా. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. జ్ఞానం, స్వేచ్ఛ, ధైర్యంతో పిల్లలను ప్రోత్సహించి చదివించాలని సూచించారు. అనంతరం మంత్రి ఈటల ఉద్యమకారులను సత్కరించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, గౌరవ అధ్యక్షుడు సండ్రపల్లి వెంకటయ్య, ఎన్జీఓ ప్రతినిధి సుభద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కూల్చివేతలను అడ్డుకుంటాం

- సచివాలయం, అసెంబ్లీ నూతన నిర్మాణాల అవసరమేమొచ్చింది
- ప్రజలను కూడగట్టి ఉద్యమిస్తాం
- ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు వదిలేది లేదు
- అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న అనురాధారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, విశ్వేశ్వరరావు, రేవంత్‌రెడ్డి, కోదండరాం, సత్యంరెడ్డి, వివేక్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, ఎల్.రమణ, ఆర్.కృష్ణయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** ప్రస్తుత సచివాలయాలన్ని కూలగొడతామంటే చూస్తూ ఊరుకోం.. అడ్డుకుంటాం అని అఖిల పక్షాలు హెచ్చరించాయి. కొత్తగా భవనాలను కట్టాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని కూడగట్టి ఉద్యమించాలని నిర్ణయించాయి. కూల్చివేతపై ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు వదిలేది లేదని స్పష్టం చేశాయి. జి.వెంకటస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో "సచివాలయం కూల్చివేత - కొత్త అసెంబ్లీ నిర్మాణం"పై అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ జి.వివేక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్, భాజపా, తెదేపా, సీపీఐ, తెజస పార్టీల నాయకులు, వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సచివాలయం, ఎర్రమంజిల్ భవనాలను కూల్చొద్దని సోమవారం గవర్నర్ నరసింహన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు. అన్ని పార్టీల నాయకులు గవర్నర్‌ను కలిసి, ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చి చారిత్రక కట్టడాల విధ్వంసాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. ప్రజాసమస్యలు, వారి అవసరాలను తీర్చడానికి ఐక్య పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా నాయకులు ప్రకటించారు.

### ప్రజాధనం దుర్వినియోగ పర్చడమే

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సచివాలయాన్ని ఎందుకు కూల్చివేస్తున్నారో, కొత్తగా అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించడం ఎందుకో ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ఉన్నవాటిని కూల్చేసి, కొత్తవి కట్టడమంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడ్డారు. పునర్విభజన చట్టం సెక్షన్ 8 ప్రకారం రాజధాని పరిధిలోని ప్రభుత్వ, చారిత్రక భవనాలపై గవర్నర్‌కే పూర్తి అధికారం ఉంటుందని, వాటిని రక్షించే బాధ్యత ఆయనదే అని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక వ్యక్తి మూఢ నమ్మకాల కోసం పటిష్ఠమైన భవనాలను కూల్చుతుంటే కోర్టు ప్రేక్షకపాత్ర వహించడం.. బాధ్యతల నుంచి తప్పుకోవడమే అవుతుందన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాస్తు దోషం ఉంటే సరిదిద్దుకోవాలి తప్ప కట్టడాలను కూలుస్తారా? అని ప్రశ్నించారు. తెజస అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. ఏ ముఖ్యమంత్రి అయినా రాజ్యాంగ ప్రకారం నడుచుకోవాలని, సొంత మూఢ నమ్మకాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయొద్దని అన్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల వాస్తవ పరిస్థితులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. డబ్బు, అధికార మత్తులో సీఎం కేసీఆర్ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ వివేక్ విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ అలీ, బలరాం నాయక్, భాజపా ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, తెజస ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, తెదేపా సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ అనురాధారెడ్డి, సామాజిక వేత్త సి.రాంచంద్రయ్య, న్యాయవాది సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలు

- సచివాలయం, ఎర్రమంజిల్ భవనాలను కూల్చొద్దు.
- ప్రస్తుత భవనాల్లోనే సచివాలయం, అసెంబ్లీలను కొనసాగించాలి.
- చారిత్రక వారసత్వ కట్టాల విధ్వంసాన్ని అడ్డుకొని, ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ ఉనికిని కాపాడాలి.
- పై డిమాండ్లపై గవర్నర్‌ను కలిసి మెమోరాండం ఇవ్వాలి.
- ఈ అంశంపై హైదరాబాద్‌లో మాదిరిగానే జిల్లా కేంద్రాల్లో అన్ని పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలి.
- అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి.
- నూతన నిర్మాణాలు, భవనాల పేరుతో ప్రభుత్వం చేస్తున్న ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి.
- ప్రజలకు జవాబుదారీగా ఉండేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

# రాష్ట్ర అవసరాలు తీరాకే గోదావరి తరలింపు

- భవిష్యత్తు తాగు.. సాగు.. పారిశ్రామిక అవసరాలను గుర్తించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో విశ్రాంత ఇంజినీర్ల సూచన




రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న సాగు నీటిపారుదల శాఖ మాజీ కార్యదర్శి సానా మారుతి. వేదికపై విశ్రాంత ఇంజినీర్లు అనంతరాములు, రామేశ్వర్‌రావు, అంజయ్య

**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టుల కింద సాగునీటి అవసరాలు తీరాకే ఇతర బేసిన్లకు గోదావరి జలాలను తరలించే ఆలోచన చేయాలని విశ్రాంత ఇంజినీర్లు పేర్కొన్నారు. 'ఇతర బేసిన్లకు గోదావరి జలాల తరలింపు' అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఛైర్మన్ రామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు విశ్రాంత ఇంజినీర్లు మాట్లాడారు. సమావేశానికి సంధానకర్తగా సాగు నీటిపారుదలశాఖ మాజీ కార్యదర్శి సానా మారుతి వ్యవహరించారు. వృధాగా పోతున్న మూడు వేల టీఎంసీల గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం మంచి నిర్ణయమని విశ్రాంత ఇంజినీర్లు స్వాగతిస్తూనే పలు సూచనలు చేశారు.

### భవిష్యత్తు అవసరాలకు మించి నీరుంటేనే: సానా మారుతి

ఒక బేసిన్‌లోని ప్రజలను సంతృప్తిపరచకుండా మరో బేసిన్‌కు నీటిని తీసుకెళ్లడం అన్యాయమవుతుంది. దస్త్రాల్లో ఉన్న లెక్కలకు క్షేత్రస్థాయిలో నీటి ప్రవాహానికి తేడా ఉంటుంది. ట్రైబ్యునళ్లు, బోర్డుల కేటాయింపులకన్నా ఏపీ కృష్ణానదిపై ఎక్కువ ప్రాజెక్టులు నిర్మించింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టులకు గోదావరి నీటి మళ్లింపు అంటే లోతైన చర్చ జరగాలి. భవిష్యత్తు తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు మించి జలాలు ఉంటేనే తరలించాలి.

### శ్రీశైలానికి కృష్ణాను పరిమితం చేయాలి: శ్యాంప్రసాద్ రెడ్డి

శ్రీశైలం, సాగర్‌లకు గోదావరి జలాల తరలింపుపై అధ్యయనం చేస్తున్నాం. మొత్తం 400 కిలోమీటర్ల మార్గంలో 150 కిలోమీటర్లు సొరంగం తవ్వాల్సి ఉంది. ఇది కష్టసాధ్యంగానే కనిపిస్తోంది. దీనికన్నా కృష్ణాను శ్రీశైలం ప్రాజెక్టుకు పరిమితం చేసి రెండు రాష్ట్రాల్లోని పథకాలకు 500 టీఎంసీలు నీరు ఇస్తే బాగుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు శ్రీశైలం నుంచి ఒక లిఫ్టు ఏర్పాటుచేసి జూరాలకు ఎత్తిపోయాలి. రాంపూర్ నుంచి ఎస్సారెస్పీ ఒకటి, రెండు దశలు, ఏఎంఆర్‌పీ, దేవులపల్లి కాలువలకు గోదావరి నీరు ఇస్తూనే సాగర్‌కు తరలిస్తే మధ్యలో ఆయకట్టుకు లాభం చేకూరుతుంది. ఏపీ ప్రభుత్వం పోలవరం నుంచి కృష్ణా లింక్, మున్నేరుల ద్వారా దశల వారీగా సాగర్‌కు మళ్లించాలి.

### లక్ష్మీదేవిపల్లికి చేర్చితే రాష్ట్రం సస్యశ్యామలం

కృష్ణా జలాల లభ్యత తగ్గిపోతున్నందున గోదావరి జలాలే తెలంగాణకు దిక్కు అని విశ్రాంత ఇంజినీర్లు, ప్రొఫెసర్లు పేర్కొన్నారు. గోదావరి నుంచి తెలంగాణ ప్రత్యేకంగా నీటిని తోడుకోవాలని, ఏపీకి పోలవరం ఉందని రంగారెడ్డి అన్నారు. కాళేశ్వరం కింద స్థిరీకరణ తేలాక రాంపూర్ నుంచి ప్రభుత్వమే రంగారెడ్డి జిల్లా లక్ష్మీదేవిపల్లికి నీటిని తరలిస్తే గ్రావిటీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తరలించుకోవచ్చని కొందరు సూచించారు. సమావేశంలో విశ్రాంత ఇంజినీర్లు అంజయ్య, అనంతరాములు, బాబూరావు, భాగ్యలతారెడ్డి, రామలింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎంవీరావు, సాంబయ్య, పుల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

## ఆంధ్రా ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటే.. ఉద్యమిస్తాం

### టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్‌రావు

**కరీంనగర్, న్యూస్‌టుడే:** ఆంధ్రా ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటే మరోమారు ఉద్యమించక తప్పదని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్‌రావు పేర్కొన్నారు. దీనికి విద్యుత్తు సంస్థల్లోని ఇంజినీర్లు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని టీఎస్‌పీఈఏ అతిథి గృహంలో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రా నేపథ్యం ఉన్న 1157 మంది ఉద్యోగులను తెలంగాణ విద్యుత్తు సంస్థల నుంచి రిలీవ్ చేశారని గుర్తుచేశారు. ఆంధ్రా విద్యుత్తు సంస్థల మొండి వైఖరితో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఉద్యోగులను వారి సొంత రాష్ట్రంలో చేర్చుకోవడం లేదని చెప్పారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన 612 మంది తమ సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు ఆప్షన్ పెట్టుకున్నా ఇప్పటివరకు తీసుకోలేదన్నారు. వారిని తెలంగాణలోని విద్యుత్తు సంస్థల్లో సర్దుబాటు చేసే ప్రయత్నం చేయాలన్న ఆలోచనతో ఉన్నారని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకిస్తూ మరోమారు ఉద్యమం చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. విద్యుత్తు సంస్థల్లోని వివిధ సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఏఈ నుంచి ఏడీఈ పదోన్నతులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలన్నారు. విద్యుత్తు సంస్థను ప్రైవేటీకరించాలన్న కేంద్రం నిర్ణయానికి తలొగ్గవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.సదానందం, టీఎస్ఎన్‌పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బి.సామ్యానాయక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.అంజయ్య ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఊపిరున్నంతవరకు పోరాడతా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- ఎమ్మార్పీఎస్ పాతికేళ్ల ప్రస్థానం సందర్భంగా భారీ సభ
- ఎస్సీ వర్గీకరణకు మోదీని ఒప్పిస్తాం
- అందుకోసం నా శాయశక్తులా కృషి చేస్తా
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



ప్రకాశం జిల్లా ఈదుముడిలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ జాతర సభావేదిక నుంచి అభివాదం చేస్తున్న మందకృష్ణ మాదిగ, కిషన్‌రెడ్డి, రావెల కిషోర్‌బాబు, విమలక్క, ఆకుల విజయ, ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, సంపత్‌కుమార్, అద్దంకి దయాకర్, ఇతర నాయకులు

**ఒంగోలు, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణే తన జీవిత ధ్యేయమని, దానికోసం తన ఊపిరి ఉన్నంత వరకు పోరాడతానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడిలో ఆదివారం రాత్రి నిర్వహించిన మాదిగల ఆత్మగౌరవ జాతర సభలో ఆయన మాట్లాడారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వర్గీకరణ ఉద్యమానికి దన్నుగా ఉన్నారని మంద కృష్ణ చెప్పారు. ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హోదాలో కిషన్‌రెడ్డి కూడా వర్గీకరణ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. భాజపా వర్గీకరణ చేసి తీరుతుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. ఈదుముడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, పాతికేళ్ల ప్రస్థానంలో ఒడిదొడుకులను ప్రస్తావిస్తూ మంద కృష్ణ ఉద్వేగానికి లోనయ్యారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వర్గీకరణ పోరుకు కట్టుబడి ముందుకు సాగుదామని శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీని ఒప్పించి, మెప్పించి ఎస్సీ వర్గీకరణ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఎమ్మార్పీఎస్ రజతోత్సవ సభ నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. పాతికేళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎమ్మార్పీఎస్ ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులను ఎదుర్కొని ముందుకు సాగిందన్నారు. గుండె జబ్బుల పిల్లలు, వికలాంగుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిందని కొనియాడారు. గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారుల కోసం మందకృష్ణ ఉద్యమించిన సమయంలో అప్పటి సీఎం ఆయన్ను బెదిరించే ప్రయత్నం చేసినా ఆందోళన నుంచి తప్పుకొనేందుకు మంద కృష్ణ ససేమిరా అన్నారని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వమే గుండె జబ్బులున్న పిల్లలకు వైద్యం ఖర్చు భరించేందుకు జీవో జారీ చేసిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

### కుట్రలను ఛేదించిన మంద కృష్ణ

"ఎమ్మార్పీఎస్‌ను చీల్చేందుకు పలు కుట్రలు జరిగాయి. మంద కృష్ణను లేకుండా చేసేందుకూ ప్రయత్నాలు జరిగాయి. నిబద్ధత, నీతి నిజాయతీలే ఈ ఉద్యమాన్ని నడిపించాయి. మంద కృష్ణను ప్రముఖ నాయకుడిగా నిలిపాయి. నేను ఎస్సీ వర్గీకరణ కోసం శాసనసభలో ఎన్నోసార్లు మాట్లాడాను. ఇప్పుడు కేంద్ర మంత్రి హోదాలో పార్లమెంటులోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తాను. ఇప్పటికే మంద కృష్ణతో పాటు పలువురు జాతీయ నాయకులను కలిసి వర్గీకరణకు మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుణ్నీ కలిశాం. ఆయన వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారు. ప్రధాని మోదీకి పేదల కష్టాలు పూర్తిగా తెలుసు. అందుకే కేంద్ర ప్రభుత్వ పథకాల్లో అధిక శాతం ఎస్సీ, ఎస్టీలకే కేటాయిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణకు భాజపా పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంది. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల భాజపా శాఖలూ సుముఖంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం బీసీ వర్గీకరణ కోసం కమిషన్ ఏర్పాటు చేసింది. ఎస్సీ వర్గీకరణ కూడా జరిగి తీరుతుంది. ఎమ్మార్పీస్ నాకు నేస్తం. మంద కృష్ణ నా సోదరుడు. ఆయన ద్వారానే వర్గీకరణ సాధ్యపడుతుంది. ఆయన్ను వ్యతిరేకించి పక్కదారి పట్టినవాళ్లు క్షమాపణ కోరి వెనుదిరిగి రావాలి' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### వర్గీకరణ జరగాల్సిందే: దయాకర్

తెలంగాణ మాలమహానాడు నాయకుడు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. గతంలో తాము వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడామని, ఇప్పుడు తమ ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని చెప్పారు. అరుణోదయ విమలక్క తన గీతాలతో సభికులను ఆకట్టుకున్నారు. సభలో మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, భాజపా నాయకురాలు ఆకుల విజయ, ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, మాజీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

Eenadu epaper

# మంచు కొండల్లో... మంచి మనిషి!

పుర్పాది అరుణాచల్‌ప్రదేశ్, తవాంగ్ జిల్లాలోని మారుమూల గ్రామం. డిగ్రీ తరువాత జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సహాయకుడిగా శిక్షణ తీసుకున్నాడు. విధుల్లో భాగంగా మేగో గ్రామానికి వ్యాక్సిన్లు అందించడానికి వెళ్లిన ఫుర్పాకు అక్కడి చిన్నారులు, మహిళల ఆరోగ్య పరిస్థితి అర్థమైంది. 75 కుటుంబాలున్న ఆ గ్రామానికి సరైన మార్గం లేదు. కనీస సౌకర్యాలు కూడా అక్కడ లేవు. ఎవరైనా అక్కడికి వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణం చేయాలి. అక్కడివారు నిత్యావసరాలు, కూరగాయల వంటి వాటి కోసం 36 కి.మీ దూరంలోని జంగ్ పట్టణానికి నడిచి వెళ్లాలి. ఇంత దారుణ పరిస్థితులున్న ఈ గ్రామం నుంచే తన విధులు మొదలు పెట్టాలనుకున్నారాయన. తవాంగ్‌లో ఉండే జిల్లా ఆరోగ్య కేంద్రం నుంచి వ్యాక్సిన్లను, మందులను తీసుకుని బయలుదేరే ఆయన బహుదూరపు బాటసారిలా కనిపిస్తారు. మేగో, ఆ తరువాత చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ కాలినడకన ప్రయాణిస్తారు. ఈ క్రమంలో ప్రమాదకరమైన పర్వత శ్రేణులను దాటతారు. ఆ గ్రామాలకు వెళ్లాలంటే ఏడాదిలో మూడొంతుల కాలం మంచులో ప్రయాణించాల్సిందే. ఇతర సిబ్బంది రామంటే రామనే ఆ గ్రామాలకు నడుం వరకు ఉండే మంచులో కర్రల సాయంతో నడుస్తూ వెళతారాయన. 'నా ధ్యేయమంతా అక్కడి చిన్నారులకు ఆరోగ్యాన్ని అందించడమే. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకుని సాధించా. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం రోగుల శాతం చాలా తగ్గిపోయింది. ఇదెంతో సంతోషకరమైన విషయం' అని వివరిస్తారాయన. మిసెల్స్, రుబెల్లా, కాంజినిటల్ రుబెల్లా సిండ్రోమ్ (సీఆర్ఎస్) వల్ల కలిగే తీవ్ర అనారోగ్యాలు, మరణాలను నియంత్రించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో ఆరోగ్య, మహిళాశిశు సంక్షేమ శాఖ చేపట్టిన ప్రాజెక్టులో కూడా ఆయన భాగస్వామి. 'లుక్తమ్ ప్రాంత చిన్నారులకు కూడా వ్యాక్సిన్లను అందించే బాధ్యతలను నిర్వహిస్తున్నా. సాధారణంగా అటువంటి ప్రాంతాలకు వెళ్లడానికి ప్రభుత్వం హెలికాప్టర్ సౌకర్యాన్ని అందిస్తుంది. నేను అంగీకరించలేదు. ప్రస్తుతం నేను వెళ్లే గ్రామాల్లోని గర్భిణులకు సరైన సమయంలో టెటానస్ ఇంజెక్షన్ అందించడం కూడా మొదలుపెట్టా' అని చెబుతారు.

**భారత్, చైనా సరిహద్దు ప్రాంతమది. ఏడాదంతా దాదాపు మంచుతో నిండి ఉండే పర్వతాలు. అక్కడ భుజానికి మెడికల్ కిట్ తగిలించుకుని మోకాళ్లలోతు మంచులో ఎవరైనా ఓ వ్యక్తి నడుస్తూ కనిపిస్తే.... ఆయన కచ్చితంగా శ్రీ ఫుర్పా అయ్యుంటాడు.**

**ఆరేళ్లగా మంచుకొండల్లో మారుమూల గ్రామాలకు మెడికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. అక్కడి ప్రజలకు ప్రాణదాత. కాలమేదైనా, వాతావరణం ఎలా ఉన్నా ఆయన తన విధులను నిర్వహించే తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. అతన్ని అభినందించి తీరాలనిపిస్తుంది. .**



**వాతావరణం అనుకూలించని సందర్భాల్లో కూడా మంచులో గంటల తరబడి నడిచి వెళ్లి, తనదైన సేవలను అందిస్తున్న ఫుర్పాను ఆ రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది అవార్డునందించి గౌరవించింది. అంతేకాదు, మేగో సమీపంలో విధులు నిర్వహించే సైనికకుటుంబాలకు అందిస్తున్న సేవలకు సైనిక విభాగం తరఫున కూడా సత్కారాన్ని అందుకున్నారు.**

# వాడని పూలే వికసించెలే!



**ఇప్ప పువ్వంటే
భద్రాచలంలో ప్రసాదం కదూ...
ఠక్కున చెప్పేస్తాం...
అంతేనా
గిరిపుత్రులను అడిగితే ఇంకా ఎన్నో
ఇప్ప రుచుల గురించి
కథలు కథలుగా చెబుతారు...
అయితే ఇప్పపువ్వు మార్చిన జీవితాలు
మనకు ఇక్కడ కనిపిస్తాయి...**



ఆదివాసీలకు ఇప్పపువ్వు అందాలను, ఆనందాలనే కాదు ఆర్థిక స్వావలంబన కూడా ఇస్తోంది. దేవతగా భావించే గిరిజనం పాలిట అక్షరాలా అమ్మలా ఆదుకుంటోందా చెట్టు. అదే చెట్టును ఆదాయమార్గంగా మార్చితే... ఈ ఆలోచనతో ఆ జిల్లా పాలనాధికారి దివ్య దేవరాజన్ చేపట్టిన కార్యక్రమాలు ఆదివాసీల జీవితానికో కొత్తదారి చూపాయనే చెప్పాలి. ఇప్పపువ్వు, ఇప్ప పరక నుంచి ప్రతి భాగాన్నీ ఉపయోగించడం మొదలుపెట్టారు. ఇప్పపువ్వును పౌష్టికాహారంగా మార్చుతూ మంచి మార్కెట్ కల్పిస్తున్నారు. దీనికోసం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్‌లోని 20 మంది మహిళలకు ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణనిచ్చారు. దీంతో తినుబండరాల తయారీకి ఈ ఏడాది మే నెలలో శ్రీకారం చుట్టారు. లడ్డూలు, కరములరలు, పట్టీలు ఇతర తిను బండరాలను తయారు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. దీంతో ఒకప్పుడు పెద్దగా ఉపయోగ పడని ఈ పువ్వుకు ఇప్పుడు తిరుగులేని డిమాండ్ ఏర్పడింది. గ్రామాల్లో ఆదివాసీల ఇళ్లకు వెళ్లి కిలో రూ.20 చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు దీంతో తయారు చేసే పదార్థాలకు డిమాండ్ పెరగడంతో వచ్చే లాభాలూ పెరిగాయి. ఈ ఏడాది మే నెలలో ఉట్నూర్ లో ఇప్పపువ్వు వంటకాల పండగ కూడా నిర్వహించారు. అదే రోజు నుంచి పువ్వు తయారు చేసిన వంటకాలను విపణిలో అమ్మడం ప్రారంభించారు. ఇప్పుడా వంటకాలను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– బండారి లక్ష్మీ నరసయ్య, ఇంద్రవెల్లి



పొలంలో వర్షం నీటి క్యాచ్‌మెంట్ ఏరియాను గుర్తిస్తారు



అక్కడి నుంచి నీటిని పైపులు, కందకాల ద్వారా క్రమపద్ధతిలో పారిస్తారు



పారుతున్న నీటిని బావుల్లోకి మళ్లించి, భూమిలో ఇంకిస్తారు.

**ఓ నది సముద్రుడిలో కలిసేలోగా ఏంచేస్తాం?
ప్రాజెక్టులు కడతాం...
రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసుకుంటాం...
మన స్థలంలోనో, పొలంలోనో వాన పడింది...
పల్లమెరిగిన నీరు శరవేగంగా ఎక్కడికో వెళ్లిపోతుంది.
ఎందుకూ కొరగాకుండా పోతుంది.
అయ్యో... అనుకుంటాం...
అలా అనొద్దు...
మేం చేసిన ఈ పనిని మీరూ చేయొచ్చు...
మీ పొలాల్లో ప్రాజెక్టులు కట్టండి...
మీ భూమి అంతర్భాగాన్ని సహజ జలాశయంగా మార్చండి...
అంటున్నారు వారు...**



బావులు నిండిన తర్వాత మిగిలిన నీటిని రెండెకరాల చెరువులోకి మళ్లించి నిల్వ చేస్తున్నారు

# మీ పొలంలో ప్రాజెక్టులు కట్టండి!



మనం కోరుకున్నామని వాన కురవదు. మనకు అవసరం ఉందని నీరు మన దరిచేరదు. వానపడ్డప్పుడు ఆ నీళ్లను ఒడిసిపట్టుకోవడం ప్రాప్తకాలజ్ఞత. వర్షం కురుస్తోంది. నీళ్లు పారుతున్నాయి. కానీ కాసేపటికే అవి మనకు సుదూరంగా వెళ్లిపోతాయి... ఇదే మన ప్రధాన సమస్య.

ప్రభుత్వం ఆధ్వర్యంలో, ఇతర సంస్థల ఆధ్వర్యంలోనో చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతల వంటి వాటి నిర్మాణం జరుగుతున్నా వాటి ప్రయోజనాలు 90 శాతం మంది రైతులకు అందడం లేదు. నిజానికి నీరు పుష్కలంగా నిల్వ చేయడానికి పెద్దపెద్ద స్థలాలో, పెద్ద ఎత్తున ఖర్చో అవసరం లేదు. రైతు తన పొలంలోనే, అతి తక్కువ ఖర్చుతోనే రిజర్వాయర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇవి మాటలు కాదు. నీటి మూటలు అసలే కాదు. కళ్ల ముందు కనిపించే నిజాలు. మీకు సంకల్పముంటే మీ పొలం అంతర్భాగమే ఓ పెద్ద జలాశయమవుతుంది. వానల్లోనే కాదు మండుటెండల్లోనూ పుష్కలంగా నీరు మీకందుతుంది. అని నిరూపిస్తున్నారు కాస్మోస్ గ్రీన్ కిసాన్ మైత్రీ క్షేత్రం సభ్యులు. హైదరాబాద్‌కి 50 కిలోమీటర్ల దూరంలో మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ మండలంలో వీరి ఆధ్వర్యంలో జరుగుతున్న జలయజ్ఞం వినూత్నమైంది. పొలాల్లో ప్రాజెక్టులు కడుతూ నయా పంథాలో నీటి నిల్వకు శ్రీకారం చుట్టిన వీరి ప్రయత్నం ప్రతి రైతూ ఆచరించదగింది. కాలంతో, వాతావరణంతో సంబంధం లేకుండా మంచి ఉత్పాదకత సాధించడం... తక్కువ ఖర్చుతో మంచి రాబడిని రైతు పొందేలా చూడడం... అనే రెండు లక్ష్యాలతో పనిచేస్తున్న ఈ సంస్థ సభ్యులు నీటి వనరుల నిర్వహణపై కూడా విశేష కృషి చేస్తున్నారు.

కాస్మోస్ గ్రీన్ కిసాన్ మైత్రీ క్షేత్రం సంస్థ స్థాపకులు సత్య రఘు, ఆయుష్‌శర్మ. వీరు మొదట కర్ణాటకలోని రాయచూర్‌లో ఉండేవారు. అక్కడ రైతుల పరిస్థితిని అతి సమీపం నుంచి కొన్ని సంవత్సరాల పాటు గమనించారు. దక్కన్ పీఠభూమిలోనే ఉన్న కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతంలో తరచూ నీటి కొరత ఏర్పడేది. రైతులు వ్యవసాయం చేయలేక కొన్ని వేల ఎకరాలు బీడుగా వదిలేశారు. వర్షం కురిసినా ఆ నీటి ప్రయోజనం తాత్కాలికమే. నిల్వ ఉండే అవకాశం లేకపోవడంతో అన్ని జీవజలాలు కాసేపటికే కనుమరుగయ్యేవి. కొన్నేళ్ల తర్వాత 'కాస్మోస్ క్షేత్రం' సంస్థ కార్యకలాపాల కోసం షాద్‌నగర్ మండలం దేపల్లి గ్రామానికి వచ్చిన సత్య రఘు, ఆయుష్ శర్మలకు ఇంచుమించు రాయచూర్ పరిస్థితులే ఇక్కడ కూడా కనిపించాయి. దీంతో ఇక్కడ పడే ప్రతి నీటి బొట్టునూ నిల్వ చేయాలని వారు సంకల్పించుకున్నారు. క్షేత్రం ఆధ్వర్యంలో 20 మంది రైతులకు చెందిన 110 ఎకరాల భూమి ఉంది. ఇక్కడే వారి జల ఆశయాలకు రూపమిచ్చారు.

**మూడు లక్ష్యాలు...**

నీటి నిల్వకు వీరు త్రిసూత్రావళిని పాటించారు.

**1. పడిన వాన నీళ్లను సరైన దిశలో నడపాలి...**
**2. నడిచే నీళ్లను సరైన స్థలంలో ఆపాలి...**
**3. ఆగిన నీళ్లను పూర్తిగా భూమిలో ఇంకించాలి..**

ప్రతి నదికీ పరివాహక ప్రాంతం ఉంటుంది. ఆ ప్రాంతంలో పడ్డ వాన నీరంతా ఆ నదిలోకి చేరి ప్రవహిస్తుందన్న మాట. అలాగే పొలంలో నీరు ఎక్కడ కురుస్తోంది. ఏ మార్గంలో ప్రవహిస్తుందో తెలుసుకోవాలి. ఆ పరిజ్ఞానం రైతుకు ఉంటే చాలు నీటిని నిలువరించడం పెద్దకష్టమేం కాదంటారు రఘు. మొదట వీరు కూడా చాలాసార్లు ఆలోచించారు. సభ్యులతో కలిసి మేథోమధనం చేశారు. కళ్లముందు 110 ఎకరాల వ్యవసాయ క్షేత్రం. ఆ మూలన పడ్డ నీరు ఏమూలకు వెళుతుందో రైతులకు తెలియని పరిస్థితి. నీటి గమనాన్ని తెలుసుకునేందుకు వీరు పొలం మొత్తాన్ని జల్లెడపట్టారు. వర్షం కురిసే సమయంలో తడుస్తూనే సర్వే చేసేవారు. ఎక్కడి నుంచి నీరు ఎక్కడికి వెళుతుందో మ్యాప్‌లలో గుర్తించారు. దీనికోసం జీపీఎస్‌ను కూడా వాడుకున్నారు. నీటి వాలు తెలుసుకున్నాక వీరి కార్యాచరణకు రూపం ఇచ్చారు.

## నడక నేర్పారిలా...

సాధారణంగా వాన నీరు నేటిపై పడ్డాక శరవేగంగా వాలులోకి వెళ్లిపోతుంది. తర్వాత అదేమైపోతుందో ఎవరికీ అర్థం కాదు. ఇక్కడ నీటి గమన వేగాన్ని రైతే నిర్దేశించాలంటారు రఘు. దీనికోసం ఖేతి ఒక ప్రణాళికను అమలు చేసింది. నీటి ప్రవాహవేగం నియంత్రణలో ఉండేలా వాలును మలుచుకుంటూ కందకాలను తవ్వారు. వాటికి అవసరమైన చోట పైపులైన్లు ఉపయోగించారు ఆ కందకాల్లోకి చేరిన నీరు సహజవేగం కన్నా తక్కువ వేగంతో గమ్యం వైపు పయనమవుతుంది. అలా వెళ్లే క్రమంలోనే చాలా వరకు నీరు భూమిలోకి ఇంకిపోతుంది. అలా కొంతదూరం వెళ్లాక వాటిని చిన్న చిన్న బావులను ఏర్పాటు చేసి అందులోకి నింపారు. ఈ బావులు అక్కడక్కడ ఉండడం, చిన్నవిగా ఉండడం వల్ల ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. ఒక బావి నిండాక, మరోబావిలోకి నీరు కందకాల ద్వారా క్రమ పద్ధతిలో పయనమవుతుంది. ఇలా నలుమూలలా వీటిని ఏర్పాటు చేయడంతో పొలంచుట్టూ నీరు ఇంకింది. కొద్ది రోజుల్లోనే పొలం అంతర్భాగమంతా ఓ జలాశయంగా మారిపోయింది. పొలంలో ఉన్న బోర్లన్నీ పుష్కలంగా నీటిని వెదజల్లుతుండడంతో అసలు నీటి కరవనే మాటే లేకుండా పోయింది. ఖేతి వ్యవసాయక్షేత్రం పెద్దది కావడంతో బావుల సంఖ్య కూడా ఎక్కువ. ఇవి నిండాక ఆ నీటిని ఓ రెండెకరాల చెరువులోకి మళ్లిస్తున్నారు. ఇప్పుడా చెరువు ఖేతికే కాదు, చుట్టుపక్కలున్న రైతులకూ ఆయువు పట్టయింది. మండుటెండల్లో కూడా జీవజలాన్నిస్తోంది.



**కాస్మోస్ గ్రీన్ కిసాన్ మైత్రీ క్షేత్రంలో జరుగుతున్న జలయజ్ఞం ఆనోటా ఈనోటా విస్తృత ప్రచారం పొందింది. తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఎనిమిది వేల మంది రైతులు సందర్శించి వెళ్లారు.**

ఇదంతా చూసి భలే చేస్తున్నారే అనుకోవడం కాదు... మీరూ ఇదే పని చేయండి. ప్రతి అడుగు భూమికింద నీటి మడుగు ఉండేలా చూడండి అంటారు కాస్మోస్ సభ్యులు. మన రైతుల్లో చాలా మంది ఎలాంటి అంచనాలు లేకుండానే లక్షల రూపాయలు ఖర్చు చేసి బోర్లు తవ్విస్తుంటారు. అందులో నీళ్లు పడకపోతే ఖర్చు, శ్రమ అంతా వృథా. అదే నీటిని నిల్వ చేస్తే ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ఎకరం, అర ఎకరం పొలం ఉన్న రైతులు కూడా పమర్థంగా తమ పొలాల్లో అద్భుతమైన నీటి నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయొచ్చు... అదే మరింత మంది కలిస్తే మరిన్ని ప్రయోజనాలు ఖాయం అంటారు రఘు. దీనికి మహా అయితే ఒక ఎకరానికి రూ.20 వేలు ఖర్చవ్వచ్చు. కానీ అది అందించే ప్రయోజనాలతో పోల్చుకుంటే ఈ ఖర్చేపాటి అంటారాయన. మీరేమంటారు?

–గొర్లె శ్రీసత్యవాణి

# రహదారి భద్రత కోసం మిస్టర్... 11



**వారు 11 మంది. ఎవరి పని వారు చేసుకునే యువకులు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. కానీ వారిని ఓ లక్ష్యం కలిపింది. ఓ సుదీర్ఘ ప్రయాణానికి నాంది పలికింది. సరదాగా గడిపే సమయాన్ని ఓ ఆశయం కోసం వెచ్చించేలా చేసింది. ఆ లక్ష్యం 'రహదారి భద్రత'**

విశాఖపట్టణానికి చెందిన మళ్ల మధుశరత్, ఎస్.నిఖిల్‌కుమార్, శ్రీను నల్లపతి, బింగి యశ్వంత్‌రెడ్డి, కళ్యాణ్ సిరికి, శ్రీనివాస్ మల్లోతు, భగవాన్, ప్రశాంత్‌కుమార్, చెన్నుపాటి మారుతి, రాము హోటల్ వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. ఓ రోజు విశాఖ నగరంలో తన కళ్లముందు జరిగిన ఘోర ప్రమాదం మధుశరత్‌ను ఆలోచనలో పడేసింది. తన గ్రూప్‌లో ఉన్న స్నేహితుల ముందు ఈ విషయాన్ని ఉంచాడు. అంతే... ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా కదిలారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కలిగించాలని అనుకున్నారు. దీనికోసం దక్షిణభారతదేశం అంతా బైక్‌లపైనే పర్యటించాలని నిర్ణయించుకున్నారు. జూన్‌లో వారం పాటు విశాఖ నుంచి దక్షిణ భారత దేశంలోని తీర ప్రాంతం వెంట యాత్ర కొనసాగించారు. కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లోని ప్రముఖ నగరాలను సందర్శించారు. వివిధ వృత్తులకు చెందిన వారిని కలిసి రహదారి భద్రత గురించి వివరించారు. ముఖ్యంగా హెల్మెట్‌లు లేకుండా ప్రయాణించడం వల్ల జరుగుతున్న అనర్థాలపై కళాశాలల్లో అవగాహన కల్పించారు. కొన్నిచోట్ల పోలీసు అధికారులను కలిసి ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ఉద్దేశపూర్వకంగా నిబంధనలు మీరేవారికి జరిమానాలు వేయడం ద్వారా ఇతరుల ప్రాణాలమీదకు తీసుకురాకుండా చూడాలని సూచించారు.

–యద్దనపూడి ఛత్రపతి, విశాఖపట్నం

ఈనాడు సినిమా



సమంత, రానా, నందినిరెడ్డి, వివేక్ కూచిభొట్ల

# సమంత పిచ్చికి ఓ చిరునామా దొరికింది

"కొత్త తరహా సినిమా రావాలంటే అవాంతరాలు ఉంటాయి. వాటిని దాటుకుని నిలబడడం కష్టం. అలా నిలబడిన సినిమా 'ఓ బేబీ'. ఇలాంటి విజయాలు రాబోయే చిత్రాలకు స్ఫూర్తినిస్తాయ"న్నారు రానా. సమంత ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'ఓ బేబీ'. నందినిరెడ్డి దర్శకురాలు. సురేష్ బాబు, సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యూన్ హు, థామస్ కిమ్ నిర్మాతలు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. రానా మాట్లాడుత "సమంతకు మంచి సినిమాల్లో నటించాలనే పిచ్చి. తన పిచ్చికి ఈ సినిమాతో ఓ చిరునామా దొరికింది. సురేష్ ప్రొడక్షన్స్‌లో తను ఇక ఎన్ని సినిమాలైనా చేసుకోవచ్చు. అందరి హృదయానికీ హత్తుకున్న చిత్రమిది. కొరియన్ కథని తెలుగు సినిమాలా మార్చిన నందినికి హ్యాట్సాఫ్" అన్నారు. "ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. దానికి మించిన ప్రతిఫలం లభించింది. ఇక మీదట మరిన్ని మంచి కథలతో, మంచి పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నిస్తా" అంది సమంత. "ఈ జన్మకు ఇదే గొప్ప అనుభూతిలా అనిపిస్తోంది. ప్రేక్షకుల స్పందన చూస్తే కళ్లు చమరుస్తున్నాయి" అన్నారు నందిని రెడ్డి. "సమంత లక్ష్మి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశార"న్నారు మాటల రచయిత లక్ష్మీభూపాల్. "ఈ చిత్రంలో అన్నిరకాల భావోద్వేగాలూ ఉన్నందుకే ప్రేక్షకులు ఆదరిస్తున్నార"న్నారు వివేక్ కూచిభొట్ల. కార్యక్రమంలో తేజ, సునీత తదితరులు పాల్గొన్నారు.



విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, మహేంద్ర, శివాత్మిక, రాజశేఖర్, మధుర శ్రీధర్

# నా తమ్ముణ్ని చూసి గర్వపడుతున్నా

– విజయ్ దేవరకొండ

"ఇప్పటిదాకా మా తమ్ముడు సినిమా గురించి మాట్లాడలేదు. ఇక్కడ స్క్రిప్టు ఎంపిక చేసుకోవడం గురించి, థియేటర్‌కి వచ్చేవరకు ఎన్ని కష్టాలుంటాయో తెలియాలని వదిలేశా. తను అమెరికాకి వెళ్లి ఉద్యోగం చేస్తూ ఇంటికి డబ్బు పంపించి సాయం చేశాడు. అందుకే నేనిక్కడ ఉన్నా" అంటూ భావోద్వేగానికి గురయ్యారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన తమ్ముడు ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'దొరసాని'. రాజశేఖర్, జీవితల తనయ శివాత్మిక కథానాయికగా పరిచయమవుతోంది. మహేంద్ర దర్శకుడు. మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని నిర్మాతలు. ప్రశాంత్ విహారి స్వరాలు సమకూర్చారు. చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పుడూ వేదికపై తనదైన శైలిలో మాట్లాడే విజయ్ దేవరకొండ తన తమ్ముడితో ఉన్న అనుబంధాన్ని, ఆయన తొలి సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకొని కంట తడి పెట్టుకొన్నారు. "మా తమ్ముడు సినిమా చేస్తా అన్నప్పట్నుంచి నేను తనతో పెద్దగా మాట్లాడలేదు. నీ సినిమా నువ్వు చేసుకో, నేనేం సాయం చేయనని చెప్పా. కానీ తనే కథ విని సినిమా చేశాడు. చిన్నప్పుడు పుట్టపర్తిలో హాస్టల్‌లో ఉంటూ చదువుకొన్నా. నాలుగో తరగతి చదువుతున్నప్పుడు మా తమ్ముడు ఒకటో తరగతిలో చేరాడు. రెండో పీరియడ్‌లోనే మా క్లాస్ దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఆడుకుంటూ ప్రతి ఐదు నిమిషాలకోసారి నేనున్నానా అని చెక్ చేసేవాడు. వాడు మూడు రోజులు మా క్లాస్‌లోనే కూర్చున్నాడు. తను సినిమా చేస్తున్నాడని తెలిసి కూడా దాని గురించి ఎప్పుడూ ఆరా తీయలేదు. తనే కష్టపడుతూ క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకొన్నాడు. నన్ను ముందస్తు విడుదల వేడుకకి రమ్మని అడిగినప్పుడు కూడా సినిమా చూపించండని చెప్పా. సినిమా చూశాక ఒక మేజిక్ సృష్టించారనే అభిప్రాయం కలిగింది. నా తొలి సినిమాకి ఇలా చేయలేకపోయా అనిపించింది. శివాత్మిక అత్యుత్తమ నటి అనిపించుకొంటుంది. ఆనంద్ నటన చూసి ఆశ్చర్యపోయా, తన విషయంలో గర్వపడుతున్నా. మహేంద్ర నాకోసం కథ రాస్తున్నా అన్నారు. సిద్ధం కాగానే చేయమని చెప్పా" అన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, జీవిత, నందినిరెడ్డి, రామజోగయ్య శాస్త్రి, తరుణ్ భాస్కర్, గోరటి వెంకన్న, ప్రశాంత్ విహారి, సి.కల్యాణ్, వెంకట్ సిద్దారెడ్డి, రాహుల్ యాదవ్ నక్కా, లగడపాటి శ్రీధర్, తేజ, రాజ్ కందుకూరి, అనురాగ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



కాజల్

# భాష మారినా సినిమా మారదు!

తెలుగు చిత్రసీమలో పరభాషా కథానాయికల ప్రాబల్యం ఎక్కువ. వాళ్లే స్టార్లుగా చలామణీ అవుతున్నారు. దర్శకులు, నిర్మాతలు కూడా వాళ్ల వైపే మొగ్గు చూపిస్తున్నారు. అందువల్లే తెలుగమ్మాయిలకు స్థానం దక్కడం లేదు. 'ఈ మాట నిజమే కానీ ప్రతిభను ప్రాంతాలవారీగా విడగొట్టడం కష్టం' అంటోంది కాజల్. "సినిమా అనేది ఇప్పుడు ఒకే పరిశ్రమ. ప్రాంతాన్ని బట్టి భాష మారుతుందేమో? సినిమా మారదు. పరభాషా నటీనటులే కాదు, సాంకేతిక నిపుణులు కూడా ఎక్కువవుతున్నారు. ప్రతిభ ఎక్కడ ఉంటే అక్కడి నుంచి దిగుమతి చేసుకోవడం తప్పు కాదు. నేను పంజాబీ అమ్మాయిని. కాకపోతే ఇప్పుడు తెలుగమ్మాయిలా మారిపోయాను. పంజాబీ భాషనీ, అక్కడి సంస్కృతిని ఎంత గౌరవిస్తానో, తెలుగు సంప్రదాయాలకూ అంతే విలువ ఇస్తాను. తెలుగు భాష నాకు జీవనాధారం చూపించింది. అందుకే తెలుగునీ ప్రేమిస్తున్నాను. తెలుగిళ్లలో పండగలు, పెళ్లిళ్లు ఎలా చేసుకుంటారో నాకు బాగా తెలుసు. ఆ మాటకొస్తే కొన్ని పంజాబీ సంప్రదాయాల కంటే.. తెలుగు సంప్రదాయాలే నాకు గుర్తున్నాయి. నేనే కాదు.. ఎవ్వరైనా అంతే. తెలుగు నుంచి మరో ప్రాంతానికి వెళ్లి జీవనోపాధి సంపాదించిన వాళ్లు ఇలానే ఆలోచిస్తారు. భాష, ప్రాంతం సినిమాకి అతీతం. ఆ పరిధులు దాటి ఆలోచిస్తేనే మంచి సినిమాలొస్తాయి" అంటోంది కాజల్.

గుండెనే పలికించితే
కోటి పాటలు పలుకుతాయ్
మమతనే పండించితే
మణుల పంటలు దొరుకుతాయ్
బాధలను ప్రేమించు భాయీ
లేదు అంతకు మించి హాయి

గీతం: అల్లాయే దిగివచ్చి...
చిత్రం: నిప్పు లాంటి మనిషి
రచన: సి.నారాయణరెడ్డి

– పంపినవారు: టి.శ్రీనివాసులు, బెంగళూరు

గీతోపదేశం

# మంచి ఆకలితో ఉన్నప్పుడు రామ్ దొరికాడు: పూరి జగన్నాథ్



లేఖా ప్రజాపతి, నభా నటేష్, పూరి జగన్నాథ్, రామ్, ఛార్మి, నిధి అగర్వాల్

"రామ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. నభా నటేషా, నిధి అగర్వాల్ కథానాయికలు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ఆదివారం రాత్రి వరంగల్‌లో 'ఇస్మార్ట్ బోనాలు' పేరుతో ఓ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "హైదరాబాదీ ఇస్మార్ట్ రౌడీ బుర్రలో పోలీసోళ్లు సిమ్ కార్డు పెట్టారు. అదెందుకో సినిమా చూసి తెలుసుకోవాలి. వినోదాత్మక కథ ఇది. రామ్ నటనే ప్రధాన ఆకర్షణ. 'టెంపర్' తరవాత నాకు మంచి హిట్టు పడలేదు. మంచి ఆకలితో ఉన్నప్పుడు రామ్ దొరికాడు. వెజిటేరియన్ ముసుగులో ఉన్న నాన్ వెజిటేరియన్ రామ్. తను రామ్ పోతినేని కాదు.. రామ్ చిరుతపులి. రామ్‌కి సినిమా తప్ప మరో ధ్యాస లేదు. పార్టీలూ, ఫ్రెండ్స్ అంటూ ఉండవు. సహాయ దర్శకుడు పిలవకముందే షాట్లో దూకుతాడు. ప్రతి షాట్‌లో వంద శాతం ప్రతిభ చూపించాలనుకుంటాడు. మణిశర్మ మంచి పాటలు ఇచ్చారు. భాస్కరభట్ల, కాసర్ల శ్యామ్ మంచి సాహిత్యం అందించారు. బోనాల పాట మరింత హిట్టయ్యింది. బోనాల సమయంలోనే మా సినిమా విడుదల అవ్వడం ఆనందంగా ఉంది" అన్నారు. నభా నటేషా మాట్లాడుతూ "ఈ సినిమా పక్కా మాస్. ఎంత మాస్ అంటే రొమాన్స్‌లో కూడా యాక్షన్ ఉంటుంది. నాకోసం ఇంత మంచి పాత్ర రాసి, నమ్మకంగా నాకు ఇచ్చినందుకు పూరిసార్‌కి కృతజ్ఞతలు. రామ్ సహకారం మర్చిపోలేను" అంది. నిధి అగర్వాల్ మాట్లాడుతూ ''రామ్‌తో డ్యాన్స్ చేయడం కష్టం. రెండు రోజులు రిహార్సల్స్ చేసి మరీ డ్యాన్స్ చేయాల్సి వచ్చింద"న్నారు. ఛార్మి మాట్లాడుతూ "ఈనెల 18న ఈ చిత్రం విడుదల అవుతోంది. ట్రైలర్‌లో కొంచెమే చూపించాం. సినిమాలో చాలా ఉంది. థియేటర్లో విజిల్స్ పడతాయి. నవ్వుకుంటూ బయటకు వస్తారు. పూరి ఈ సినిమాలో చాలా మంచి డైలాగులు రాశార"న్నారు. రామ్ మాట్లాడుతూ "మణిశర్మ చాలా మంచి బాణీలిచ్చారు. ఏ పాట ఎక్కువ బాగుందో చెప్పలేకపోతున్నా. అన్ని సినిమాలకంటే ఈ సినిమాకి ఇంకొంచెం ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. కానీ ఆ కష్టం కూడా లేకుండా చేశారు ఛార్మి. డ్యాన్స్, ఫైట్లు, డైలాగులు, లుక్స్. ఇలా అన్నీ ఉండాలి, కానీ కొత్తగా ఉండాలి అనుకున్నప్పుడు పూరి గారిని కలిశాను. అప్పుడు వచ్చిన ఐడియా 'ఇస్మార్ట్ శంకర్'. పూరితో కలిసి పనిచేస్తే వచ్చే కిక్కే వేరు. చివరి రోజు షూటింగ్‌కి వెళ్లాలనిపించలేదు. వెళ్తే షూటింగ్ అయిపోతుందేమో అని బాధపడ్డా" అన్నారు. ఈ కార్యక్రమంలో లేఖా ప్రజాపతి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# హాలీవుడ్ చిత్రంలో



మంచు విష్ణు

మంచు విష్ణు మూడు చిత్రాల్ని, ఒక వెబ్ సిరీస్‌ని ఒకే రోజు మొదలు పెట్టారు. అందులో ఆయన హీరోగా నటిస్తున్నవి రెండు చిత్రాలు కాగా, నిర్మాతగా మరో చిత్రం చేస్తున్నారు. విష్ణు నటిస్తున్న చిత్రాల్లో ఒకటి హాలీవుడ్‌లో రూపొందుతుండడం విశేషం. జెఫ్రెచిన్ దర్శకుడు. విష్ణు సరసన కాజల్ నటిస్తోంది. విష్ణు భార్య వెరోనికా మంచు నిర్మాత. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో మరో ప్రముఖ హాలీవుడ్ నటుడు కీలక పాత్ర పోషించనున్నారు. చిత్రీకరణ జరుగుతోంది. దీంతోపాటు మరో చిత్రంలో కూడా విష్ణు, కాజల్ కలిసి నటిస్తున్నారు. భారతదేశంలోని ఐటీ రంగం నేపథ్యంలో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రూ.2800 కోట్ల దోపిడీ ఎలా జరిగిందన్నదే ఈ సినిమాలో కీలకాంశం.

## నిర్మాతగా 'మిరా రోడ్'

మంచు విష్ణు నిర్మాణంలో 'మిరా రోడ్' అనే చిత్రం రూపొందుతోంది. సుబ్బరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నిజ జీవిత సంఘటనలు ఆధారంగానే ఈ చిత్రం రూపొందుతోందని, స్టార్ నటీ నటులు కీలక పాత్రలు పోషిస్తారని సినిమా వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది చివరలో విడుదల చేయనున్నారు. దీంతో పాటు రాష్ట్ర విభజన జరగక ముందు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిస్థితుల ఆధారంగా తెరకెక్కనున్న వెబ్ సిరీస్‌ని నిర్మిస్తున్నారు విష్ణు. కథానాయకుడు శ్రీకాంత్ ఇందులో ప్రధాన పాత్రధారి. రాజ్ అనే కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పరుచూరి గోపాలకృష్ణ సంభాషణలు, స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు.

కొత్తపాట గురూ!

చిత్రం: కౌసల్య కృష్ణమూర్తి
రచన: రాంబాబు గోసాల
గానం: భీమనేని రోషితా సాయి, అనన్య నాయర్, రాహుల్ సిప్లిగంజ్
సంగీతం: దిబు నినన్ థామస్

తెలుగు చిత్రసీమలో యువ రచయితల జోరు కనిపిస్తోంది. కొత్త కలాలు సరికొత్త భావాల్ని, భావుకతని ఆవిష్కరించేందుకు పోటీ పడుతున్నాయి. నవతరం గీత రచయితలంటే ఎక్కువగా ప్రేమపాటలే రాస్తుంటారు. రాంబాబు గోసాల ప్రయాణం కూడా అలాగే మొదలైంది. 'ఉయ్యాలా జంపాలా', 'మజ్ను', 'అర్జున్‌రెడ్డి', 'మజిలీ' తదితర చిత్రాల్లో ఆయన రాసిన ప్రణయ గీతాలు శ్రోతల్ని అలరించాయి. ప్రేమ పాటలే కాదు అన్ని రకాల పాటలు రాయగలనని నిరూపించుకొనే ప్రయత్నంలో ఉన్నారాయన. ఇటీవల 'కౌసల్య కృష్ణమూర్తి'లో పల్లెటూరు, తండ్రి, తన ముద్దుల కూతురు నేపథ్యంలో సాగే ఆ పాట ప్రయాణం ఎలా సాగిందో రాంబాబు గోసాల 'ఈనాడు సినిమా'తో చెప్పుకొచ్చారు. ఆ విషయాలివీ...

# అల్లరి చేష్టల అమ్మాడీ ఆటల్లో గెలిచే కిల్లాడీ

పల్లవి: రాకాసి గడుసు పిల్లా
శివకాశీ సరుకీ పిల్లా
ఎవరిదీ ఎవరిదీ

అల్లరి చేష్టల అమ్మాడీ
ఆటల్లో గెలిచే కిల్లాడీ
జింకలా చంగున చిందాడి
జోరుగా వచ్చేస్తోంది
ఎవరిదీ ఎవరిదీ

మా ఇంటి దేవతా
మందార పూలతా
ఊరంతా నీ జత
రెండు జళ్ల చిన్ని సీత
బంగారు పిచ్చుక
చిన్నారి చంద్రిక
మా బుజ్జి గోపిక
సక్కంగున్న చిట్టి చిలకా

పెంకి పిల్లవే కొంటె పిల్లవే
అమ్మ పోలికే వచ్చినాదిలే
పొట్టి పిల్లవే గట్టి పిల్లవే
నాన్న కూచిలా పుట్టినావులే

చరణం: 1
నాన్న కన్న కల నిజమయ్యేలా
నీకున్న ఇష్టమే తీరేలా
కన్నమ్మా కలబడీ
ఈ ఆట నేర్చెయ్ వా

వెనకడుగు వేయని వ్యూహంలా
బరిలోకి నువ్వే దూకాలా
చిన్నమ్మా నిలబడీ
నీ చురుకు చూపెయ్ వా

బుల్లిపిట్ట బుజ్జిపిట్ట పసి పాలపిట్ట
చిరునవ్వులిట్ట కురిసే
పూలబుట్ట పైడిగుట్ట పుట్ట తేనెపట్టా
వెండివెన్నెలింట మేఘమల్లె
నువ్వు మెరిసే ॥ మా ఇంటి దేవతా॥

చరణం: 2
అల్లి బిల్లి జాబిలి నువ్వమ్మా
జాజిమల్లి కొమ్మకు చెల్లెమ్మా
చుర చురా చూడగా
సూర్యుడే పరుగమ్మా
కొండపల్లి బొమ్మే కొసిమ్మా
పల్లె గుండె సవ్వడి నువ్వమ్మా
పుడమికే రంగులే నీ లేత నవ్వులమ్మా

బుల్లి బుగ్గలున్న తల్లి చిన్న పాలవెల్లి
ఇంద్రధనుస్సుమల్లె విరిసే
పల్లె పైరగాలి కేళి చందనాల హోళి
చల్లగుండమంటు నిండు దీవెనల్లో ముంచే
॥ రాకాసి గడుసు పిల్లా॥
॥ మా ఇంటి దేవత ॥



'కౌసల్య కృష్ణమూర్తి'లో బేబీ చైత్ర, రాజేంద్రప్రసాద్

"ఇప్పటిదాకా 30 సినిమాలకి పాటలు రాసుంటాను. నా వయసుని చూసో లేదంటే, ప్రేమ పాటలే బాగా రాస్తాననో తెలియదు కానీ ఎక్కువగా అలాంటి అవకాశాలే లభించాయి. తొలిసారి 'కౌసల్య కృష్ణమూర్తి'తో భిన్నమైన నేపథ్యానికీ, సందర్భానికి పాట రాసే అవకాశాన్నిచ్చారు దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు. తమిళంలో విజయవంతమైన 'కణా'కి రీమేక్‌గా రూపొందిన చిత్రమిది. మాతృకలో శివకార్తికేయన్, ఆయన కూతురు కలిసి ఒక పాట పాడారు. ఆ పాటనే ఇక్కడ నన్ను రాయమని చెప్పారు. అక్కడ 125 మిలియన్ల వ్యూస్ సంపాదించిన పాట అది. అలాంటి పాటని రాయడమంటే ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న నాలాంటి రచయితకి పెద్ద సవాల్. పైగా ఇది భీమనేని శ్రీనివాసరావు సినిమా. ఆయన సినిమాల్లో పాటలు ప్రత్యేకంగా ఉంటాయి. నేను పల్లెటూరు నుంచి రావడం, అన్ని రకాల నేపథ్యం, భావాలతో కూడిన పాటలు రాయాలనే ఆసక్తి ఉండటంతో వెంటనే ఒప్పుకున్నా. తమిళంలో ఏం రాశారో పట్టించుకోకుండా పాట సందర్భాన్ని, పాత్రల్ని గుర్తు చేసుకొని కలం పట్టా. ఒక రైతు కుటుంబంలో పుట్టిన ఒక అమ్మాయి, ఆమె అల్లరి, కలల్ని జోడించి రాయాల్సిన పాట ఇది. ఆ పాప తండ్రి ఒక రైతు అయినా క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. నాన్న అభిరుచిని తెలుసుకొని తాను క్రికెటర్ కావాలనుకుంటుంది. అందుకోసం అబ్బాయిలు ఆడుతుంటే చూసి నేర్చుకుంటుంది. ఆమె అల్లరితో పాటు తపనని, తండ్రి ముచ్చట పాటలో వినిపించేలా 'రాకాసి గడుసు పిల్లా... శివకాశీ సరుకీ పిల్లా' అంటూ మొదలుపెట్టా. శివకాశీ అంటే శక్తిమంతమైన బాణాసంచానే గుర్తుకొస్తుంది. అమ్మాయిలో చురుకుదనం అంతలా ఉంటుందని చెప్పేందుకే ఆ పదం వాడా. 'మా ఇంటి దేవతా.. మందార పూలతా... ఊరంతా నీ జత..' అంటూ చిన్న చిన్న పదాలతో శబ్దానికి తగ్గట్టుగా పాట రాశా. 'నాన్న కన్న కల నిజమయ్యేలా... నీకున్న ఇష్టమే తీరేలా... కన్నమ్మా కలబడీ... ఈ ఆట నేర్చెయ్ వా...' అనే పంక్తులు అమ్మాయికి ఆటపై మక్కువని చాటుతాయి. రెండో చరణంలో 'పల్లె గుండె సవ్వడి నువ్వమ్మా... పుడమికే రంగులే నీ లేత నవ్వులమ్మా' అనే వాక్యాలు ఎంతో ఇష్టం. పల్లెటూరి నేపథ్యం నుంచి వచ్చిన వాణ్ని కావడంతో ఈ పాట రాయడం సులభమైంది. భీమనేని శ్రీనివాసరావు అమ్మాయి భీమనేని రోషితాసాయితోపాటు అనన్య నాయర్, రాహుల్ సిప్లిగంజ్ ఈ పాటని బాగా పాడారు. దిబు నినన్ థామస్ బాణీ తమిళంలో ఎంతగా అలరించిందో, తెలుగులోనూ అదే స్థాయిలో శ్రోతల మనసుల్ని తాకింది. పాట విడుదలైన వెంటనే చాలా మంచి స్పందన లభించింది. ఇప్పటిదాకా రాసిన పాటలు ఒకెత్తైతే, ఈ పాట మరో ఎత్తు. 'తేజ్ ఐ లవ్ యు' నుంచి నిర్మాత కె.ఎస్.రామారావు నన్నెంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఆయన ఈ పాటకి లభించిన స్పందనపై చాలా సంతోషం వ్యక్తం చేశారు. నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాట ఇది".



– రాంబాబు గోసాల



వారి కళ్లకు.... పొత్తిళ్లలోని పసిపాప మొదలుకొని అరవై ఏళ్ల అమ్మమ్మ వరకూ కామవాంఛతీర్చే వస్తువుల్లానే కనబడుతున్నారు. ఎవరు వారు? ఎక్కడుంటారు....అని అమాయకంగా అడగొద్దు!

పక్కింటి అన్నయ్య, ఎదురింటి బాబాయి, స్కూల్లో టీచరు, ఆటో అంకుల్...ఇలా ఎవరైనా కావొచ్చు. అమ్మాయి ఒంటరిగా కనిపిస్తే చాలు వావివరసలు మరిచి మృగాళ్లుగా మారిపోతున్నారు.

మానవత్వాన్ని వదిలేసి చూపులతో, చేష్టలతో విపరీతంగా ప్రవర్తిస్తూ పైశాచికానందం పొందుతున్నారు. హాజీపూర్‌లో హత్యాచారం, వరంగల్‌లో తొమ్మిదినెలల పసిపాపపై జరిగిన అకృత్యం, అది మరవక ముందే ఒంగోలులో టీనేజీ యువతిపై సామూహిక లైంగికదాడి... నిన్న బాసర ట్రిపుల్‌ఐటీలో మరో సంఘటన. ప్రాంతం, సందర్భం వేరు కావొచ్చు...అన్ని చోట్లా ఇదే దుస్థితి. దీనికి అడ్డుకట్ట వేసే దారి లేదా...! ఉంది అది మన ఇంటి నుంచే మొదలవ్వాలి...

# భద్రం తల్లీ

కొన్నేళ్ల క్రితం నిర్భయ ఘటన జరిగినప్పుడు, ఆ తరువాత గుడియా బలైనప్పుడు ఇలానే అయ్యో పాపం అనుకున్నాం. ఒకప్పుడు ఇలాంటి సంఘటనలు ఎక్కడో జరిగాయని వినేవాళ్లం. ఇప్పుడు అటువంటి దారుణాలెన్నో మన చుట్టూనే జరుగుతున్నాయి. ఆ క్షణాన ఆవేశంగా అసలు చట్టాలేం చెబుతున్నాయి. సమాజమేం చేస్తోంది... అని చాలా ప్రశ్నలే వేసుకుంటాం. కానీ ఆ మార్పు ముందు మన దగ్గరే మొదలవ్వాలని మాత్రం ఆలోచించం. ఇకనైనా ముందడుగు వేయకపోతే రేపు ఒకరు, ఎల్లుండి ఇంకొకరు బలవ్వొచ్చు.

## ఎక్కడ ఉంటారు...

ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు మీ ఇంట్లోనే ఉండొచ్చు... బస్సుల్లో, వీధిలో, స్కూల్లో ఎక్కడైనా ఎదురుకావొచ్చు. చాలావరకూ వీరిని గుర్తించడం కష్టం. వీరిలో కొందరు స్వతహాగానే నేర స్వభావంతో పెరిగి పెద్దయి ఉండొచ్చు. ఇంకొందరు చూడ్డానికి మృదు స్వభావులుగా కనిపిస్తూ... మంచి అనే ముసుగేసుకుని బతికేస్తుంటారు. అందుకే అనుమానం వచ్చిన ఎవరినీ తేలిగ్గా తీసుకోవద్దు. పసిపిల్లలకు రక్షణగా ఉండే వారిపైనా ఓ కన్నేయండి.

## ఎందుకు ఇలా మారతారు..!

వావివరసలు, వయసు తేడాలు వేటినీ లెక్కచేయకుండా పశు వాంఛలు తీర్చుకునే తెంపరితనం పెరగడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. అతిగారాబం, చెడుసావాసాలు, విచ్ఛిన్న కుటుంబాల్లో ప్రేమానుబంధాలు దూరంకావడం వంటివి కారణాలు కావొచ్చు. అలానే ఆయా వ్యక్తుల మెదడు పనితీరులో అసమానతలు, వ్యక్తిత్వలోపంతో వంటివాటికి అసంతృప్తికర వైవాహిక జీవితం, ఒంటరితనం, సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం, పోర్నోగ్రఫీ చూడటానికి అలవాటు పడటం వంటివన్నీ తోడై విపరీత లైంగిక కోరికలకు కారణం అవుతాయి.

## బాధితులెవరు?

చాలా అధ్యయనాల ప్రకారం ఆడ, మగ పిల్లలు ఇద్దరూ బాధితులేనట. మన చుట్టూ ఉన్నవారిలో చాలామంది ఏదో ఒక సందర్భంలో లైంగిక హింసకు గురయినవారేనని ఇవి వెల్లడిస్తున్నాయి. కొంతమంది పిల్లలు తమపై వేధింపులు జరిగాయన్న విషయాన్నీ గుర్తించలేరట. ఇక ఒంటరిగా ఉన్న మహిళలు, కష్టాల్లో ఉన్న అమ్మాయిలు, బలహీన వ్యక్తిత్వం ఉన్న స్త్రీలను లక్ష్యంగా చేసుకుని ఆయా వ్యక్తులు దురాగతాలకు పాల్పడుతున్నారు. అందుకే మనమంతా బాధితులమే.

## లైంగిక హింసకు గురైతే...!

ఒకవేళ ఎవరైనా లైంగిక దాడికి, హింసకు బాధితులైతే వారిని సకాలంలో గుర్తించి బయటకు తీసుకురావాలి. ఇందుకోసం పోలీసులు, వైద్యులు, మానసిక నిపుణుల సాయం తీసుకోవాలి. లేదంటే వారు భవిష్యత్తులో తీవ్ర ఉద్వేగాల బారినపడతారు. కుంగుబాటుకి గురై ఆత్మహత్యకు ప్రయత్నిస్తారు. తమని తాము హింసించుకోవడం లేదా ఇతరులని హింసించడం చేస్తుంటారు. మహిళలు లేదా పురుషుల్ని తీవ్రంగా ద్వేషించే ప్రమాదమూ ఉంది. ఇలా వేధింపులకు గురైన వారు... నలుగురిలోనూ కలవరు.

## అమ్మాయిలూ జాగ్రత్త!

■ ఆధునికత పేరుతో తీసుకునే చొరవ కొత్త సమస్యల్ని సృష్టించవచ్చు. స్నేహం, ప్రేమ ఏదైనా హద్దు మీరొద్దు.

■ ఇతరులపై ఆధారపడటం, సానుభూతి కోరుకోవడం వల్ల మీరు బలహీనులుగా మారే ప్రమాదం ఉంది. దాన్ని దుర్బుద్ధి ఉన్నవ్యక్తులు అవకాశంగా మలుచుకుంటారు.

■ అపరిచితులతో పరిచయాలు, సోషల్‌మీడియా ద్వారా స్నేహం, ప్రేమ వంటివాటిని నమ్మొద్దు. మీ వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దు. ఇంట్లో అయినా ఒంటరిగా ఉండాల్సి వస్తే... తప్పనిసరిగా అవసరమైన భద్రత ఏర్పాట్లు చేసుకోండి.

■ రాత్రిపూట ఒంటరిగా ప్రయాణాలు, పార్టీలు వద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చినా ఎవరో ఒకరి సాయం తీసుకోండి.

■ ర్యాగింగ్, టీజింగ్... ప్రేమ అంటూ ఎవరైనా వెంటపడుతున్నా, మీతో తప్పుగా ప్రవర్తిస్తున్నా, అసభ్యకరమైన సందేశాలు, మాటలు, చేష్టలతో విసిగిస్తున్నా...ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించొద్దు. ఇది ఏదో రోజు ముప్పు కలిగించొచ్చు. మీ పై అధికారులు, టీచర్లు లేదా కుటుంబ సభ్యులకు ఆ విషయం చెప్పి తగిన జాగ్రత్తలు తీసుకోండి.

## తల్లిదండ్రులూ...ఇవి ముఖ్యం!

■ చాలామంది తమ పిల్లలకు రక్షణ కల్పించడం ఒక్కటే విధి అనుకుంటారు. వాళ్లు ఫోనుల్లో ఏం చూస్తున్నారో, వారి స్నేహితులు ఎలాంటివారో గమనిస్తూ ఉండాలి. మానసికంగా ఏవైనా మార్పులు కనిపిస్తున్నప్పుడు చూసీ చూడనట్లు వదిలేయొద్దు. కౌమారంలోకి అడుగుపెట్టినప్పటి నుంచీ వారిలో కొత్త మార్పులు, కోరికలు...పక్కదారి పట్టించొచ్చు. పరిస్థితిని గమనించుకుని మానసిక నిపుణుల్ని కలవడం మంచిది.

■ చిన్నప్పటి నుంచే పిల్లలకు నైతిక ప్రవర్తన, నియమాలు అలవాటు చేయాలి. లైంగిక విద్యపై అవగాహన కల్పించాలి. అలానే ఆడపిల్లలకి మాత్రమే హద్దులు చెప్పడం సరిపోదు. అబ్బాయిలు అమ్మాయిలతో ఎలా మెలగాలో, వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీయకుండా ఉండేందుకు వారెలా మారాలో చెప్పాలి.

■ పిల్లలందరికీ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పాల్సిందే. లేదంటే వ్యక్తిగత, శరీర భాగాలపై చేతులు వేయడం, బలవంతం చేయడం, లైంగిక చర్యకు ప్రేరేపించడం, ప్రేమ పేరుతో లొంగదీసుకోవాలనుకోవడం వంటివన్నీ చేయొచ్చు. ఇలా చెప్పడం వల్ల వాటిని ముందే పసిగట్టి తప్పించుకోగలుగుతారు.

■ ఒంటరిగా పిల్లల్ని వదిలేయొద్దు. పిల్లల బాధ్యత ఎవరికి అప్పగించినా, వారు ఎంత దగ్గరివారైనా సరే! వారిపై ఓ కన్నేయాల్సిందే. అలానే ఎవరినైనా చూసి చిన్నారులు భయపడుతున్నా, చదువుల్లో వెనకబడినా, దేనికైనా ఆందోళన చెందుతున్నా... తీసిపడేయొద్దు.

■ పొరబాటున మన పిల్లలే బాధితులైతే వారిని కొట్టడం, తిట్టడం సరికాదు. ముందు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవాలి. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా సరే మీతో పంచుకునే చనువు వారికి మీరు ఇవ్వాలి.

■ పిల్లలకే కాదు...మహిళలందరికీ ఆత్మరక్షణ విద్యలు అవసరం. స్వీయ సంరక్షణా పద్ధతులు మిమ్మల్ని ఆపత్కాలంలో ఆదుకుంటాయి. పెప్పర్ స్ప్రే, ఇతర రక్షణ పరికరాలు వెంట ఉంచుకోండి.

### చికిత్స అవసరం



మెదడులో డోపమైన్ అనే రసాయనం, టెస్టోస్టిరాన్, ఇతర హార్మోన్ల అసమతుల్యత వల్ల కొందరిలో విపరీత ప్రవర్తనలు కనిపించొచ్చు. ఉదాహరణకు పారాఫీలియా సమస్య ఉన్నప్పుడు అసాధారణ లైంగిక కోరికలు కలిగి ఉంటారు. అలానే పీడోఫీలియాతో బాధపడే వ్యక్తులకు పసిపిల్లలపై లైంగిక కోరికలు ఉంటాయి. నెక్రోఫీలియా కలిగిన వారు చనిపోయిన శవాలపై లైంగిక వాంఛ కలిగి ఉంటారు. వీరికి మానసిక చికిత్స అవసరం.

*- డా॥ పూర్ణిమ నాగరాజ, సైకియాట్రిస్ట్*

### మనమే గుర్తించాలి



రోజు రోజుకీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. వాటి నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలి. ప్రతి ఆడపిల్లా ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి. ఎంత సొంతవారైనా సరే! గుడ్డిగా నమ్మొద్దు. ఎవరికైనా చెబితే ఏమవుతుందో అనే భయాన్ని వదిలి మీకున్న సందేహాలను సన్నిహితులతో పంచుకోండి. అప్పుడే మీరు ఆ సమస్యనుంచి బయటపడతారు.

*- మమతా రఘువీర్, సామాజిక కార్యకర్త*

# వసుంధర

?

మా బాబు వయసు ఆరేళ్లు. ఒక్కడే సంతానం. చాలా చురుగ్గా ఉంటాడు. ఇతరులతో ఎక్కువగా మాట్లాడడు. బయటకు తీసుకువెళ్లినప్పుడు మాట వినకపోవడం, మొండిగా ప్రవర్తించడం చేస్తుంటాడు. మేం గట్టిగా చెబితే అందరి ముందు మాతో పోట్లాడతాడు. ఎంత బుజ్జగించి చెప్పినా మాట వినడం లేదు. పిల్లలు ఈ వయసులో ఇలాగే ఉంటారా? లేక మా పెంపకంలో లోపం ఏమైనా ఉందా? సలహా ఇవ్వగలరు?

- ఓ సోదరి

## మాటకు మాట చెబుతున్నాడు



✔ ఒక్కడే సంతానం అంటున్నారు. మీకు తెలియకుండానే అతడిని ఎక్కువగా ముద్దు చేయడం, అతిగా శ్రద్ధ చూపడం చేస్తున్నారేమో అనిపిస్తోంది. మీ బాబు చురుగ్గానే ఉన్నాడంటున్నారు. అతడిని బయటకు తీసుకువెళ్లినప్పుడు 'అక్కడికి వెళ్లకు... ఇది ముట్టుకోకు...' అని ప్రతిదీ చెబుతూ తనని కట్టడి చేస్తున్నట్లున్నారు. ఇలా రక్షణ వలయాలు ఏర్పాటు చేసి, మీరెక్కువగా దృష్టిపెట్టడం వల్లే మొండిగా మారాడేమో గమనించండి. తోబుట్టువులు ఎవరూ లేకపోవడంతో అతడికి పోటీ లేదు. దాంతో నేనేం చేసినా చెల్లుతుంది అనుకోవచ్చు. మీరు ఏ సమయంలో ఎలా ఉంటున్నారో గమనించి దానికనుగుణంగా అతడు ప్రవర్తిస్తూ ఉండి ఉండొచ్చు. ఇతరుల ముందు తల్లిదండ్రులు ఏమీ అనరు అనే ధైర్యం కావొచ్చు. అందుకే ఆ సమయంలో తన డిమాండ్లను నెరవేర్చుకోవడం కోసం అలా చేస్తున్నాడేమోనని తెలుసుకోవాలి.

### ఏం చేయాలంటే...

అమ్మానాన్నలు, కుటుంబ సభ్యుల గారాబం వల్ల అతడు మిగతా వారితో కలవలేకపోతున్నాడు. మొండిగా ఉంటేనే మీరు అతడి మాట వింటారని అనుకుంటున్నాడు. బయటకు వెళ్లినప్పుడు అందరితో కలివిడిగా ఉండకపోయినా, మీ మాట వినకపోయినా అక్కడి నుంచి వెంటనే వెనక్కి తీసుకొచ్చేస్తామని ముందే చెప్పండి. ఎక్కడెక్కడ ఎలా ప్రవర్తించాలో ముందే వారికి అర్థమయ్యేలా చెప్పాలి. అలా చేయకపోతే ఎదురయ్యే పర్యవసానాలను వివరించాలి. అప్పటికీ తనలో మార్పు రాకపోతే నిజంగానే అలా వెనక్కి తీసుకొచ్చి చూపించండి. మాట వినకపోతే తనకు ఇష్టమైనవి చేసిపెట్టడం, కొనిపెట్టడం లాంటివి చేయడం కుదరదని దృఢంగా చెప్పాలి. ఇంట్లో వాళ్లందరూ ఒకేమాట మీద ఉండాలి. అప్పుడే క్రమశిక్షణ, బాధ్యత అలవడతాయి. అందరితో పాటు అతడూ అన్ని పనులు నేర్చుకునేలా నెమ్మదిగా చెప్పి అలవాటు చేయండి. క్రమంగా తన బాధ్యతల్ని తెలుసుకుంటాడు. పిల్లలపై చూపించే గారాబం ముద్దు చేయడానికే కానీ, మొండిగా మార్చడానికి కాదని పెద్దలు అర్థం చేసుకోవాలి. అప్పుడే మీరు కోరుకున్న మార్పు సాధ్యం అవుతుంది.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

## పనిపై క్రష్ ఉందా?

● ఉద్యోగం అనగానే ఆఫీసులో ఎన్నిగంటలు పనిచేశామన్నది లెక్కకాదు. మీరు చేసేపని మీకెలాంటి గుర్తింపు తెచ్చిపెడుతుంది అనేదీ ఆలోచించాలి. అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సవాళ్లను అందుకోవాలి. అది సాధ్యం కావాలంటే సృజనాత్మకత అలవరుచుకోవాలి. మీరు చేయలేని పనులేవైనా ఉంటే...వాటిని లక్ష్యంగా పెట్టుకోండి. అదనంగా కొంత సమయం తీసుకుని అందుకు అవసరమైన నైపుణ్యాలను అలవరుచుకోండి. పనితీరుని మెరుగుపరుచుకోండి. ఇది మీలోని ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇంకా సాధించాలనే తపననూ అందిస్తుంది.

● **వారానికి ప్రణాళిక:** ప్రతిరోజూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమూ ముఖ్యమే. ఉద్యోగం, కుటుంబం, వ్యక్తిగతం... ఇలా ఒక్కోదానికి ఎంత టైమ్ పెట్టుకుంటున్నారు. మూడింటినీ ఎలా సమన్వయం చేసుకుంటున్నారన్నదీ గమనించుకోవాలి. ఒకవేళ దేనికైనా సమ ప్రాధాన్యత ఇవ్వకపోతే...దాన్ని ఇప్పుడు సరిదిద్దుకోండి. దాన్ని వారానికీ అన్వయించుకోండి. ఆ ప్రకారం ఎప్పటి పనులు... అప్పుడే పూర్తిచేసుకోవాలి. అనుకున్నవేళకు పనులు పూర్తయితే ఒత్తిడి తగ్గుతుంది. ఇంకాస్త మెరుగ్గా పనిచేసేందుకు మిమ్మల్ని మీరు మలచుకునే అవకాశం మీ సొంతమవుతుంది.

● **అదే ప్రపంచం:** సాధారణంగా ప్రేమలో పడ్డవారు.. ఎప్పుడూ అదే ప్రపంచంలో ఉంటారు. పనిపై అలాంటి క్రష్ పెంచుకోవాలంటారు కెరీర్ నిపుణులు. ఆ ఇష్టం, ఆ పిచ్చి, ఆ ప్రేమ ఉంటే ఎలాంటి సవాళ్లనైనా తేలిగ్గా అధిగమిస్తారని, ఇష్టంగా పని చేస్తారని చెబుతారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ... నైపుణ్యాలు పెంచుకుంటే విజయాలు సాధించడం పెద్ద కష్టమేమీ కాదు.

## షరారా... మనసారా!

షరారా.... ఒకప్పటి బాలీవుడ్ స్టైల్. ఇప్పుడు అమ్మాయిల మనసు దోచుకుంటోన్న నయా ట్రెండ్. మోకాలి వరకూ బిగుతుగా ఉండి... అడుగున కుచ్చులతో వెడల్పుగా ఉండటమే ఈ బాటమ్ ప్రత్యేకత. ఎన్నెన్నో డిజైన్లు వీటిలో అందుబాటులో ఉన్నాయి. ఈ షరారాల్ని కుర్తీలు, షార్ట్‌టాప్‌లకు జతగా ఎంచుకుని క్యాజువల్‌గా కనికట్టు చేయొచ్చు. మ్యాచింగ్‌తో మెరిపించే సెట్‌లతో పార్టీల్లో ప్రత్యేకంగా కనిపించొచ్చు. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని.



### నజరానా

టేబుల్‌పై ఉండే ప్లాస్టిక్ పూలు మురికిగా అనిపిస్తే వాటిని ఓ పేపర్ కవర్‌లో ఉంచండి. చెంచా ఉప్పును అందులో వేసి దాన్ని పిన్ చేసి బాగా కదపాలి. ఇలా చేస్తే పూలన్నీ తాజాగా మారతాయి.

## స్వచ్ఛ రక్షణకు హసిరు దళం

చెత్త సేకరించే వారికి సమాజంలో కనీస గుర్తింపు ఉండదు.
ఎంత కష్టపడినా...చిన్న చూపే చూస్తారు.
అలాంటి వారి సంక్షేమం కోసమే బెంగళూరుకి చెందిన 'హసిరు దళ' పనిచేస్తోంది. ఆ వివరాలేంటంటే...



బెంగళూరుకు చెందిన నళినీ శేఖర్ ఎంఎస్సీ పూర్తి చేసి కొన్ని రోజులు అధ్యాపకురాలిగా పనిచేశారు. భర్త ఉద్యోగరీత్యా పుణెకు మారారు. అక్కడ చెత్త సేకరించే వారిని రోజూ గమనించేవారు. వారిలో ఎక్కువగా పిల్లలే ఉండేవారు. మురికి వాడల్లో నివసించే ఆ చిన్నారులపై పోలీసులు, వివిధ రకాల వ్యక్తుల నుంచి వేధింపులూ ఎక్కువే. అవన్నీ గమనించిన నళిని వారికోసం ఏదైనా చేయాలనుకున్నారు. అక్కడ తనకు పరిచయమైన లక్ష్మి, పూర్ణిమలతో ఈ విషయం పంచుకున్నారు. ఇలాంటి పిల్లల్ని గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి ప్రయత్నించారు. అది వారనుకున్నంత సులువుగా కాలేదు. కానీ ప్రయత్నించి ముందు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారందరినీ ఒప్పించి ఓ యూనియన్‌గా ఏర్పాటుచేసి దాన్ని అక్కడి స్వచ్ఛ కో-ఆపరేటివ్ సొసైటీతో అనుసంధానం చేశారు. అలా వారు సేకరించిన చెత్తను ఈ సంస్థకి విక్రయించేలా ఒప్పందం కుదిర్చారు. దానివల్ల వారి జీవితాలకు ఓ భద్రత ఏర్పడింది. ఆ తరువాత నళిని పదేళ్లపాటు అమెరికా వెళ్లిపోయారు. ఆ బాధ్యతల్ని లక్ష్మి, పూర్ణిమ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో చెత్త సేకరించే వారి యూనియన్లలో ఇదే పెద్దది.

### బెంగళూరులో ఇలా...

నళిని తిరిగి పదేళ్ల తరువాత బెంగళూరుకు వచ్చి స్థిరపడ్డారు. అప్పటికి ప్రభుత్వాలు, ప్రజల్లో వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెరిగింది. ఒకప్పుడు పుణెలో ఉన్న పరిస్థితులు బెంగళూరులోనూ ఉన్నాయని అర్థం చేసుకున్నారు. ఇక్కడ చెత్త సేకరించేవారి జీవితాలు మార్చాలనే ఉద్దేశంతో 'హసిరు దళ'(గ్రీన్ బ్రిగేడ్) అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేశారు. వారికి బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ) అధికారులను సంప్రదించి ఎనిమిదివేల మందికి గుర్తింపు కార్డులు వచ్చేలా కృషి చేశారు. వీరితో నగరంలో 33 పొడి చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. చెత్త సేకరించేవారందరికీ శిక్షణ ఇప్పిస్తున్నారు. వీరంతా ప్రతిరోజు 1,050 టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. తడిచెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల బీబీఎంపీపై చెత్త సేకరించే భారం చాలా వరకు తగ్గుతోంది. దీంతో నగర పాలికెకు ఏడాదికి సుమారుగా రూ.84 కోట్లు ఆదా అవుతున్నాయి. ఇలా చెత్త సేకరించేవారి సంక్షేమం కోసం పనిచేయడం కొందరు కాంట్రాక్టర్లకు నచ్చలేదు. వారికి పనితగ్గిపోతుందనే బాధతో నళినీని బెదిరించడం మొదలుపెట్టారు. అయినా ఆమె వెనుదిరగలేదు. ఆ కార్మికుల పిల్లలంతా ఇప్పుడు పాఠశాలలకు వెళ్తున్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.



# ఈ కోర్సులు దూరం కావు!



**ఆధునిక అవసరాలకు అనుగుణంగా విస్తృత స్థాయిలో కోర్సులను అందిస్తూ సార్వత్రిక విశ్వవిద్యాలయాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. సాంప్రదాయిక కోర్సులతో పాటు వైవిధ్యమైన కోర్సుల దిశగా వడివడిగా అడుగులేస్తుండటమే వీటి ప్రాచుర్యానికి కారణం. అందుబాటులో స్టడీ సెంటర్లు, నచ్చిన కోర్సు ఎంచుకునే స్వేచ్ఛ, నాణ్యమైన స్టడీ మెటీరియల్ ...ఇవన్నీ దూరవిద్యను దగ్గర చేశాయి. తాజాగాఇందిరాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలు సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటనలు వెలువరించాయి. వీటితోపాటు తెలుగు రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు ఎన్నో దూరవిద్య కోర్సులను అందిస్తున్నాయి.**




ఒక్కో విశ్వవిద్యాలయం ఒక్కో తరహా దూరవిద్యకు ప్రసిద్ధి చెందింది. కొన్నిచోట్ల ప్రత్యేకమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అర్హత పెంచుకోవడానికి ఉపయోగపడే కోర్సులు కొన్నైతే, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచుకోవడానికి పనికొచ్చేవి మరికొన్ని. ఇప్పటికే ఆయా విభాగాల్లో సేవలు అందిస్తోన్నవారికి నైపుణ్యాన్ని పెంచే చదువులు సైతం పలు సంస్థలు అందిస్తున్నాయి. అభ్యర్థులు తమ అవసరాలకు అనుగుణంగా కోర్సును ఎంచుకోవచ్చు. ప్రతి విద్యార్థికీ ఉపయోగపడే కోర్సు ఏదో ఒక విశ్వవిద్యాలయంలో తప్పక దొరుకుతుంది. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ... తదితర కోర్సులు దాదాపు అన్ని యూనివర్సిటీలూ అందిస్తున్నాయి. సర్టిఫికెట్, పీజీ డిప్లొమా కోర్సుల్లో మాత్రం ఆయా సంస్థలవారీ వైవిధ్యం కనిపిస్తోంది.

## ఇగ్నో...

దేశంలో అత్యధిక సంఖ్యలో దూరవిద్య కోర్సులు అందిస్తోన్న, విద్యార్థులు చేరుతోన్న విశ్వవిద్యాలయం ఇదే. దాదాపు అన్ని సబ్జెక్టులు/ విభాగాల్లోనూ ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అన్ని రకాల కోర్సులు అందిస్తోంది. ఏటా రెండు విడతల్లో ప్రవేశాలు లభిస్తాయి. కొన్ని కోర్సులను జనవరి, మరికొన్నింటిని జులై సెషన్లలో అందిస్తోంది. ప్రస్తుతం జులై సెషన్ ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఎంచుకున్న కోర్సు ప్రకారం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలు ఉంటాయి. సర్టిఫికెట్ కోర్సులకు జులై 15, మిగిలిన అన్ని కోర్సులకు జులై 31లోపు దరఖాస్తు చేసుకోవాలి.

**జులై సెషన్‌లో లభ్యమయ్యేవి**

**ఎమ్మెస్సీ:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ

**ఎంఏ:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఉమెన్ అండ్ జండర్ స్టడీస్

**పీజీ డిప్లొమా:** కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, అడల్ట్ ఎడ్యుకేషన్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, బుక్ పబ్లిషింగ్, ఉమెన్ అండ్ జండర్ స్టడీస్, మెంటల్ హెల్త్

**డిప్లొమా:** వాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ ఫ్రం ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్, డెయిరీ టెక్నాలజీ, మీట్ టెక్నాలజీ, ప్రొడక్షన్ ఆఫ్ వాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ ఫ్రం సిరీల్స్, పల్సెస్ అండ్ ఆయిల్ సీడ్స్, ఫిష్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, రిటైలింగ్

**సర్టిఫికెట్:** టీచింగ్ ఆఫ్ ప్రైమరీ స్కూల్ మ్యాథమేటిక్స్, జపనీస్ లాంగ్వేజ్, బీబీఏ (రిటైల్). ఈ జులై సెషన్ నుంచి కొత్తగా పీజీ సర్టిఫికెట్ ఇన్ క్లైమేట్ చేంజ్ కోర్సు అందిస్తున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

రెగ్యులర్‌గా అందించే బీఏ, బీకాం, ఎంఏ, ఎమ్మెస్సీ, సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులెన్నో ఈ సెషన్‌లో అందుబాటులో ఉన్నాయి. బీ కీపింగ్, సెరి కల్చర్, పౌల్ట్రీ ఫార్మింగ్.. తదితర స్వయం ఉపాధి కోర్సుల్లోనూ చేరవచ్చు.

## డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువమంది దూరవిద్య విధానంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందించే కోర్సుల్లో చేరుతున్నారు. తక్కువ ఫీజుతో కోర్సు పూర్తి కావడం, స్టడీ సెంటర్లు అందుబాటులో ఉండడం, మెటీరియల్ నాణ్యత...తదితర కారణాలతో విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం దగ్గరైంది. తెలుగు మీడియంలో పీజీ కోర్సులు అందించడం దీని ప్రత్యేకత.

**ఎంఏ:** ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ

**ఎమ్మెస్సీ:** మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, సైకాలజీ, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ

**పీజీ డిప్లొమా:** మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమెన్స్ స్టడీస్

**సర్టిఫికెట్ ప్రోగ్రాం:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్జీవో మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.

పీజీ డిప్లొమాల వ్యవధి ఏడాది. సర్టిఫికెట్ కోర్సులకు ఆరు నెలలు.

**యూజీలో ఎంచుకోవడానికి ఉన్న ఆప్షన్లు**

**కళలు (ఆర్ట్స్):** తెలుగు సాహిత్యం, ఆంగ్ల సాహిత్యం, హిందీ సాహిత్యం, ఉర్దూ సాహిత్యం

**సోషల్ సైన్సెస్ (సామాజిక శాస్త్రాలు):** అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, ప్రభుత్వ పాలనశాస్త్రం, సమాజశాస్త్రం, జర్నలిజం

**విజ్ఞానశాస్త్రాలు (సైన్స్):** వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, గణితశాస్త్రం, గణాంకశాస్త్రం, భూగర్భశాస్త్రం

**వాణిజ్యశాస్త్రం (కామర్స్).**

యూజీ కోర్సులకు ట్యూషన్ ఫీజు ఏడాదికి రూ. 2వేలు చొప్పున చెల్లించాలి. సైన్స్ కోర్సుల్లో చేరినవారు ల్యాబ్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ.1200 చొప్పున కట్టాలి. యూజీ కోర్సులను ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ విధానంలో నిర్వహిస్తున్నారు.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 16.
**రూ.200 ఆలస్య రుసుముతో:** ఆగస్టు 31.

## నైపుణ్యాభివృద్ధికీ తోడ్పాటు

దూరవిద్య అత్యాధునిక ధోరణులను అందిపుచ్చుకుంటోంది. ఇగ్నో విషయానికొస్తే... 'సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్'ను ఆరంభించి ప్రయోగాత్మకంగా ఎం.ఎ. హిందీని ప్రవేశపెట్టింది. డిస్టెన్స్ డిగ్రీలకు సంప్రదాయ డిగ్రీలతో సమానంగా గుర్తింపు ఉంది. ఈ డిగ్రీల ఆధారంగా వివిధ రంగాల్లో ఉద్యోగాల్లో ప్రవేశించి కొనసాగుతున్నవారు ఎందరో ఉన్నారు. అలాగే దూరవిద్యలో చదువుకుని, వాటి ఆధారంగా వివిధ విద్యాసంస్థల్లో ఉన్నతవిద్యా కోర్సుల్లో చేరవచ్చు. సాధారణ డిగ్రీలకే పరిమితం కాకుండా వివిధ కోర్సుల ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కూడా దూరవిద్య దోహదపడుతోంది.

**- డా. ఎస్. ఫయాజ్ అహ్మద్,** రీజనల్ డైరెక్టర్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, హైదరాబాద్



## అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ..

ఆంధ్ర, ఉస్మానియా, శ్రీవెంకటేశ్వర, ఆచార్య నాగార్జున, హెచ్‌సీయూ, ఎస్‌వీయూ- ఇలా తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలూ దూరవిద్య కోర్సు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశాలకు ప్రకటనలు జులై/ ఆగస్టుల్లో వెలువడతాయి.

ఈ వర్సిటీల ప్రత్యేక కోర్సుల వివరాలు... www.eenadupratibha.net లో చూడవచ్చు.

## నోటీస్ బోర్డు

### ఫెలోషిప్స్

**కేవీపీవై ఫెలోషిప్స్**

కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్స్-2019 ప్రకటన విడుదలైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. **ఆర్థిక ప్రోత్సాహం:** యూజీ స్థాయిలో నెలకు రూ.5000 చొప్పున, పీజీలో ప్రతి నెలా రూ.7000. **కాలవ్యవధి:** ప్రి పీహెచ్‌డీ స్థాయి వరకు లేదా ఐదేళ్లు. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ప్రస్తుతం (2019-20) ఇంటర్మీడియట్ ప్రథమ/ ద్వితీయ, డిగ్రీ/ ఇంటిగ్రేటెడ్ పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు. **ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
**పరీక్ష తేదీ:** నవంబరు 3 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 20
**వెబ్‌సైట్:** www.kvpy.iisc.ernet.in

### స్కాలర్‌షిప్స్

**సంతూర్ విమెన్స్ స్కాలర్‌షిప్స్**

విప్రో కన్జూమర్ కేర్, విప్రో కేర్... సంతూర్ విమెన్స్ స్కాలర్‌షిప్ కోసం ఔత్సాహిక బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్య చదవాలనుకునే బాలికలకు ఈ ఉపకారవేతనాలు సహాయపడతాయి.

**స్కాలర్‌షిప్‌ల సంఖ్య:** 900 **ఆర్థిక సహాయం:** ఏడాదికి రూ.24,000

**అర్హత:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు మాత్రమే అర్హులు. పదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రభుత్వ పాఠశాల/ కళాశాలలో చదివి ఉండాలి. ఇంటర్ 2018-19లో ఉత్తీర్ణులై ఉండాలి. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ (జులై 15 నుంచి ఆగస్టు 15 వరకు). **వెబ్‌సైట్:** www.santoorscholarships.com

### ప్రవేశాలు

**సీఐటీడీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) 2019-20 సంవత్సరానికిగానూ వివిధ పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. 1) పీజీ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ క్యాడ్/ క్యామ్ (ఏడాదిన్నర) - 60 సీట్లు 2) పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ (ఏడాది) - 60 సీట్లు **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో డిప్లొమా, బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత. **వయసు:** పీజీ డిప్లొమాకు 45 ఏళ్లు, పోస్ట్ డిప్లొమాకు 27 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేదీ:** ఆగస్టు 18 **దరఖాస్తు:** ఆఫ్‌లైన్
**చివరితేదీ:** ఆగస్టు 14 **వెబ్‌సైట్:** www.citdindia.org

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

## సబ్జెక్టు నిపుణులకు ఆహ్వానం

మౌలికాంశాలను మనసుకు హత్తుకునేలా చెప్పాలని.. పాఠాల సారాన్ని విద్యార్థులకు అందించాలని.. తపించే హైస్కూలు, ఇంటర్మీడియట్ సబ్జెక్టు నిపుణులకు 'ఈనాడు-ప్రతిభ' ఆహ్వానం పలుకుతోంది. నిత్యజీవిత ఉదాహరణలతో పాఠాలు, పరీక్షల కోణంలో ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు, బిట్‌బ్యాంక్‌లు, మోడల్ పేపర్లు రాయాలనే ఉత్సాహం ఉన్నవారు వెంటనే స్పందించండి. మీ వ్యక్తిగత, బోధన, రచనానుభవం వివరాలను ఈ కింది చిరునామాకు పంపండి. పాఠ్యభాగాన్ని బోధిస్తూ ఒక నమూనా ఆర్టికల్‌ను తెలుగు లేదా ఇంగ్లిష్ మాధ్యమాల్లో రాసి జతచేయండి.

**సబ్జెక్టు నిపుణులకు ఆహ్వానం, ప్రతిభ డెస్క్, ఈనాడు బిల్డింగ్, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501512**

**e-mail:** writers@eenadupratibha.net

## కళాశాల మారితే చిక్కులుంటాయా?



ఇంటర్ మొదటి సంవత్సరం ఒక కళాశాలలో పూర్తి చేశాను. రెండో సంవత్సరం ఇంకో కళాశాలలో చేరాల్సివచ్చింది. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ సమయంలో ఏమైనా సమస్యలుంటాయా?

**- కళ్యాణ్ గొల్లపల్లి**



ఇది సర్వసాధారణమైన విషయం. మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులు ఉద్యోగంలో బదిలీ అయినప్పుడో, చదువుతున్న కాలేజీ పట్ల అసంతృప్తి ఉండటం వల్లనో చాలామంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం ఒక కళాశాలలో చదివి రెండో సంవత్సరం మరో సంస్థలో చదువుతుంటారు. ఇలా కళాశాల మారినప్పుడు ఆ సంస్థ నుంచి బదిలీ సర్టిఫికెట్, స్టడీ, కాండక్ట్ సర్టిఫికెట్లు తీసుకుని తీసుకోవాల్సివుంటుంది. ఇలా చేస్తే ఉన్నతవిద్యలో గానీ, ఉద్యోగ సంబంధంగా గానీ ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

**- ప్రొ. బి.రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

## ప్రిలిమ్స్ నేర్పే పాఠాలేమిటి?

**ఈ ఏడాది జరిగిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ కీలక అంశాలు- బహుళ సమాధానాలు ఉన్న ప్రశ్నల సంఖ్య పెరగటం, సైన్స్ అండ్ టెక్నాలజీకి ప్రాధాన్యం. 'వడపోత పరీక్షే కదా, సులువుగానే నెగ్గేయొచ్చ'ని తేలిగ్గా తీసుకుంటే కష్టమని మరోసారి రుజువయింది. వచ్చే ఏడాది పరీక్ష రాయబోయేవారు సివిల్స్ ప్రశ్నల మౌలిక స్వభావంపై అవగాహన కోసం ఈ పరీక్షను విశ్లేషించుకోవాలి. ప్రశ్నపత్రం ఎలా ఇచ్చినా మెరుగ్గా రాసేలా సన్నద్ధం కావాలి!**




ఈ ఏడాది సివిల్ ప్రిలిమినరీ పరీక్ష ఇటీవల కాలంలో వచ్చిన కఠినమైన పేపర్లలో ఒకటి. అన్ని ఏరియాల నుంచీ ప్రశ్నలు వచ్చినప్పటికీ అవి జవాబు గుర్తించటానికి వీల్లేని విధంగా ఉన్నాయి. అభ్యర్థులు గమనించాల్సింది ఏమిటంటే... ప్రిలిమ్స్‌ను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సివిల్స్‌కు దరఖాస్తు చేసినవారిలో 45 శాతం మంది మాత్రమే పరీక్ష రాసేవారు. ఈ ఏడాది ఆ సంఖ్య పెరిగింది. హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, అనంతపురం, తిరుపతి, విజయవాడ పరీక్షా కేంద్రాలకు 79, 697 మంది దరఖాస్తు చేయగా, వీరిలో 40, 732 మంది (51.11 శాతం) పరీక్షకు హాజరయ్యారు. సివిల్స్‌పై పెరిగిన అవగాహన, ఆసక్తిని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

జనరల్‌స్టడీస్‌లోని వివిధ అంశాల నుంచి ఇచ్చే ప్రశ్నల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే పెద్దగా తేడా లేదు.

### కటాఫ్ మార్కులెన్ని?

సివిల్స్ రాసినవారికి ఉత్తీర్ణతకు కావాల్సిన కటాఫ్ మార్కుల గురించి ఆసక్తి ఉంటుంది. ఈ కటాఫ్ అనేది ప్రధానంగా ప్రశ్నపత్రం కఠినత్వం, పోటీ స్థాయి అనేవాటిపై ఆధారపడివుంటుంది. పైగా ఇది ఈడబ్ల్యూఎస్ కేటగిరీ రిజర్వేషన్ ప్రవేశపెట్టిన తొలి ఏడాది కూడా. ఒక అంచనా ప్రకారం...కటాఫ్ మార్కులు ఇలా ఉండొచ్చు-

**జనరల్:** 97-103, **ఈడబ్ల్యూఎస్:** 95-100
**ఓబీసీ:** 96-101, **ఎస్‌సీ:** 80-85, **ఎస్‌టీ:** 78-85

అయితే ప్రశ్నల తీరులో మార్పు కనిపించింది.

❍ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి ఎక్కువభాగం క్లిష్టమైనవే వచ్చాయి. అధిక ప్రశ్నలు బయోటెక్ నుంచీ, ఐటీ, కమ్యూనికేషన్ టెక్నాలజీల నుంచీ అడిగారు. ముఖ్యంగా ఇవన్నీ కరెంట్ అఫైర్స్‌తో సంబంధమున్నవే.

❍ పేపర్-1లో నేరుగా జవాబులుండే ప్రశ్నల కంటే బహుళ సమాధానాలున్న ప్రశ్నల సంఖ్య పెరిగింది. డైరెక్ట్ ఆన్సర్ ప్రశ్నల్లో సమాధానం తెలియకపోయినా సంబంధిత పరిజ్ఞానంతో జవాబును ఊహించవచ్చు. ఇక మల్టిపుల్ ఆన్సర్స్ ప్రశ్నల్లో ఊహించి రాస్తే జవాబు తప్పయినప్పుడు పెనాల్టీ మార్కుల ప్రమాదం ఉంటుంది. ఈ మైనస్ మార్కులే చాలా సందర్భాల్లో విజయానికీ, వైఫల్యానికీ కారణమవుతాయి. ఈ ఏడాది డైరెక్ట్ చాయిస్ ప్రశ్నలు 48 ఉండగా, మల్టిపుల్ చాయిస్‌లున్న ప్రశ్నలు 52 వచ్చాయి.

సివిల్స్ అభ్యర్థులు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను నిర్లక్ష్యం చేయకూడదు. అవి పరీక్షకు అవసరమైన చక్కని పునాదిని ఏర్పరుస్తాయి. కోర్ అర్థం కాకుండా వర్తమాన అంశాలనేమీ సరిగా అవగాహన చేసుకోలేమని మర్చిపోకూడదు. అలాగే మోడల్ పేపర్లకు జవాబులు రాయటం వల్ల రాసేవిధానం మెరుగుపడుతుంది. క్రమశిక్షణ అలవాటవుతుంది.

### ఇప్పుడేం చేయాలి?

ప్రిలిమినరీ బాగా రాసినవారు ఫలితం వచ్చేవరకూ వేచిచూడకుండా మెయిన్ సన్నద్ధతను మొదలుపెట్టాలి. ప్రిలిమ్స్ ఫలితం వచ్చేలోపే ఆప్షనల్, ఎథిక్స్ ముగించేలా చదవాలి. ❑ కటాఫ్ ర్యాంకు కంటే తక్కువ మార్కులు వచ్చేలా ఉండి, ఈ ఏడాది నెగ్గలేమనిపిస్తే... నిరాశపడకూడదు. తొలి ప్రయత్నంలో ఎక్కువమందికి ఇలాగే జరుగుతుంది. మీ ప్రిపరేషన్ కొనసాగించండి. అర్హత ఉన్న ఇతర పోటీ పరీక్షలన్నిటినీ రాయండి. ముఖ్యంగా గ్రూప్స్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఇవి రాయటం ఎంతో విలువైన అనుభవాన్నిస్తుంది. పోటీ పరీక్షల పరంగా సరైన దిశలో ఉన్నదీ లేనిదీ అర్థమవుతుంది. ❑ ఎక్కడ పొరపాట్లు చేశారో గుర్తించి సవరించే చర్యలు తీసుకోండి. ❑ ఇంకా ఏడాది వ్యవధి ఉంది కదా అని, ఏదో ఒక ఉద్యోగంలో ప్రవేశించటమో, వేరే వ్యాపకంలో పడిపోవటమో చేయవద్దు. ఇలాంటిది ఏదైనా మీ లక్ష్యం నుంచి దూరం చేస్తుంది.

**- వి. గోపాలకృష్ణ**

Inter/Degree/Engineering
Students, Pass / Fail....join our
JOB ORIENTED DIPLOMA
ANIMATION
VFX, DESIGN
MULTIMEDIA
with an option for higher studies in SINGAPORE.
For Admission Call
90198 85900
www.wiztoonz.com
WIZTOONZ
academy of media & design
WIZTOONZ ACADEMY OF MEDIA & DESIGN
# 26/42, 12th Main Road, 4th Block,
Jayanagar, BANGALORE -560011

Eenadu epaper

# ఈనాడు బిజినెస్

## 38870 దిగువన బలహీనం!




**సమీక్ష** : సాధారణ బడ్జెట్ నేపథ్యంలో గత వారం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న మార్కెట్లు, చివరకు నష్టాలతో ముగిశాయి. దేశీయంగా చూస్తే.. ఆర్థిక గణాంకాలు మిశ్రమంగా నమోదయ్యాయి. మేలో మౌలిక రంగం 5.1 శాతం వృద్ధి నమోదు చేసింది. అయితే జీఎస్‌టీ వసూళ్లు మాత్రం రూ.లక్ష కోట్ల దిగువకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7 శాతంగా నమోదు కావొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యం 3.3 శాతంగా పెట్టుకోవడం, ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల కేటాయింపులు, ఎన్‌బీఎఫ్‌సీ రంగం కోలుకోవడానికి చర్యలు ప్రకటించడం సానుకూలంగా మారాయి. అయితే నమోదిత కంపెనీల్లో కనీస ప్రజా వాటా 25 శాతం నుంచి 35 శాతానికి పెంచాలన్న ప్రతిపాదన మదుపర్లను మెప్పించలేదు. జులైలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత విధించొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్ల లాభాలు కొనసాగాయి. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు, ఒపెక్ దేశాలు ఉత్పత్తి కోతలు పొడిగించడంతో చమురు ధరలు పరుగులు తీశాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.3 శాతం నష్టంతో 39,513 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.2 శాతం తగ్గి 11,811 పాయింట్ల దగ్గర స్థిరపడింది. లోహ, మన్నికైన వినిమయ వస్తువుల షేర్లు డీలాపడగా, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ స్క్రిప్‌లు రాణించాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.594 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.712 కోట్లుగా నమోదయ్యాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:2గా నమోదు కావడం..**
**చిన్న, మధ్య శ్రేణి షేర్లలో బలహీనత కొనసాగడాన్ని సూచిస్తోంది.**

**ఈవారంపై అంచనా** } గత వారం కీలక నిరోధమైన 39,700 పాయింట్లను అధిగమించిన సెన్సెక్స్.. అదే జోరు కొనసాగిస్తూ 40,032 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం సెన్సెక్స్‌కు 38,870 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి కోల్పోతే.. స్వల్ప కాలంలో మరిన్ని నష్టాలు చవిచూడొచ్చు. 39,950 పాయింట్ల ఎగువన ముగిస్తే, సమీప కాలంలో లాభాలు కొనసాగొచ్చు. చిన్న, మధ్య స్థాయి షేర్ల బలహీనతలు కొనసాగొచ్చు. ఈ షేర్లు మెరుగుపడకపోతే.. సెన్సెక్స్ రికవరీ నిలబడకపోవచ్చు.

**ప్రభావిత అంశాలు** } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. మొదటి త్రైమాసిక ఫలితాలు స్వల్పకాలంలో మార్కెట్లకు కీలకం కానున్నాయి. ముడిచమురు కదలికలు సైతం కీలకం కానున్నాయి. ఉత్పత్తి కోతలను వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగించాలన్న ఒపెక్ నిర్ణయంపై మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మందగమనం ప్రభావం చూపొచ్చు. రుతుపవనాల పురోగతి, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపనున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఫెడ్ అధికారుల ప్రసంగాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. అమెరికా- చైనా వాణిజ్య చర్చలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. 12న వెలువడనున్న చైనా ఎగుమతులు, దిగుమతుల గణాంకాలపై మదుపర్లు ఓ కన్నేయొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 39,120, 38,570, 38,000;
**తక్షణ నిరోధ స్థాయిలు:** 39,732, 40,000, 40,160

**సెన్సెక్స్‌కు 38,870 స్థాయి వద్ద తక్షణ మద్దతు లభించొచ్చు.**
**ఈ స్థాయి కోల్పోతే మరిన్ని నష్టాలకు అవకాశం ఉంది.**

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



**కోడిగుడ్లు**

7న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 429 | వరంగల్ | 432 |
| చిల్లరగా (ఒక గుడ్డు) | 4.90 | విశాఖపట్నం | 444 |
| బెంగళూరు | 455 | చెన్నై | 475 |
| 8వ తేదీకి... | | చిత్తూరు | 468 |
| విజయవాడ/గోదావరి | 420 | నమక్కల్ | 465 |

# సూచీలకు బడ్జెట్ ప్రతికూలతలు

● ఆర్థిక ఫలితాలూ కీలకం ● మంగళవారం టీసీఎస్ గణాంకాలు ● బ్యాంకు షేర్లకు సానుకూలతలు

**స్టాక్ మార్కెట్ ఈ వారం**

**కేంద్ర బడ్జెట్‌లో ఆశించిన ప్రతిపాదనలేవీ లేకపోవడం వల్ల మదుపర్లు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ ప్రభావం సూచీలపై పడి.. అవి ప్రతికూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌కు దిశానిర్దేశం చేసే అవకాశం లేకపోలేదు. ఆదాయ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన విధానాలపై మదుపర్లకు పెద్దగా విశ్వాసం లేకపోవడం సెంటిమెంటుపై ప్రభావం చూపవచ్చని డీలర్లు అంటున్నారు. టీసీఎస్ తన ఆర్థిక ఫలితాలను మంగళవారం ప్రకటించనున్న నేపథ్యంలో మార్కెట్ దృష్టి అటు వైపు ఉండొచ్చు. నిఫ్టీ-50 11775-11910 శ్రేణిలో కదలాడొచ్చని విశ్లేషకులు అంటున్నారు. వివిధ రంగాలపై వారు ఏమంటున్నారంటే..**

- బడ్జెట్లో రూ.70,000 కోట్ల మూలధన సాయాన్ని ప్రకటించిన నేపథ్యంలో **బ్యాంకు** షేర్లు సానుకూల ధోరణితో కదలాడొచ్చు.
- ప్రభుత్వ రంగ **చమురు** కంపెనీలు తక్కువ శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలతో పోలిస్తే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు కాస్త బలంగా కనిపించవచ్చు.
- బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకోడానికి ఎటువంటి ప్రోత్సాహకాలు ప్రకటించని కారణంగా **వాహన** రంగ షేర్లు ప్రతికూలంగా కదలాడొచ్చు.
- **యంత్ర పరికరాల** షేర్లు ఈ వారం నష్టపోవచ్చు. బడ్జెట్‌లో ఎటువంటి స్పష్టమైన మార్గసూచీ లేకపోవడం మదుపర్లను నిరుత్సాహానికి గురి చేయవచ్చు.
- **ఔషధ** షేర్లు బలహీనంగా కొనసాగొచ్చు. నియంత్రణ సంస్థల చర్యలు ముఖ్యంగా యూఎస్ఎఫ్‌డీఏ నిర్ణయాల కారణంగా ఆందోళన చెందుతున్న మదుపర్లు ఈ రంగ షేర్లలో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గమనార్హం.
- బడ్జెట్‌లో వ్యవసాయ ఆందోళనలను తగ్గించే విధంగా ఎటువంటి ప్రకటనలూ లేకపోవడంతో **ఎఫ్ఎంసీజీ** షేర్లు నష్టపోవచ్చు. గ్రామీణ ఆదాయాన్ని పెంచి, వినియోగదార్ల గిరాకీని పుంజుకునేలా ప్రభుత్వం చేస్తుందన్న ఆశలు ఉండేవి. అయితే అలా జరగలేదు.
- జూన్ త్రైమాసికంలో లోహ కంపెనీల ఫలితాలూ స్తబ్దుగానే ఉండొచ్చన్న అంచనాల మధ్య **లోహ** షేర్లు నష్టాలను కొనసాగించవచ్చు. ఉక్కు కంపెనీల ఫలితాలు కూడా ఒత్తిడినే ప్రదర్శించవచ్చు. కోల్ ఇండియా, ఎన్ఎండీసీ మాత్రం రాణించే అవకాశం ఉంది. వేదాంతా షేర్లు వెలుగులోకి రావొచ్చు.
- రేపు ప్రకటితమయ్యే టీసీఎస్ ఫలితాల నుంచి **ఐటీ** కంపెనీల షేర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. ఇక ఇన్ఫోసిస్ ఫలితాలను శుక్రవారం ప్రకటించనుంది.
- **సిమెంటు** కంపెనీల షేర్లు లాభాలు అందుకోవచ్చు. వచ్చే అయిదేళ్లలో రూ.100 లక్షల కోట్లను మౌలిక రంగంపై పెట్టుబడులు పెట్టనున్నట్లు కేంద్ర బడ్జెట్లో ప్రకటించడం ఇందుకు నేపథ్యం.
- **టెలికాం** కంపెనీల షేర్లు స్తబ్దుగా కనిపించవచ్చు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఈ రంగానికి బడ్జెట్‌లో ఎటువంటి ఊరటా లభించకపోవడం ఒత్తిడిని పెంచవచ్చు. లైసెన్సు ఫీజుల విషయంలో ఏదైనా ఊరట ఉంటుందని భావించినా అలా జరగలేదు.

| ఎఫ్ఎంసీజీ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| బ్రిటానియా ఇండస్ట్రీస్ | 2824.85 | 2884.20 | 2782.20 |
| కోల్గేట్ పామోలివ్ | 1178.20 | 1214.10 | 1126.10 |
| డాబర్ ఇండియా | 407.30 | 415.40 | 399.60 |
| గోద్రేజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్ | 671.85 | 687.00 | 656.80 |
| హిందుస్థాన్ యునిలీవర్ | 1791.40 | 1827.80 | 1767.80 |
| ఐటీసీ | 279.45 | 290.30 | 262.60 |
| మారికో | 378.80 | 386.50 | 371.20 |
| **లోహ** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| హిండాల్కో | 198.90 | 210.00 | 192.40 |
| హిందుస్థాన్ కాపర్ | 39.45 | 41.00 | 38.60 |
| హిందుస్థాన్ జింక్ | 234.65 | 244.70 | 228.40 |
| జిందాల్ స్టీల్ | 134.10 | 146.30 | 127.00 |
| జేఎస్‌డబ్ల్యూ స్టీల్ | 266.65 | 283.80 | 256.50 |
| ఎన్ఎండీసీ | 110.60 | 119.10 | 105.30 |
| **ఐటీ** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| హెచ్‌సీఎల్ టెక్ | 1016.40 | 1062.40 | 989.70 |
| ఇన్ఫోసిస్ | 718.00 | 745.50 | 699.70 |
| ఎల్&టీ టెక్నాలజీ | 1700.55 | 1749.50 | 1657.60 |
| ఎల్&టీ ఇన్ఫోటెక్ | 1665.70 | 1715.10 | 1607.30 |
| టీసీఎస్ | 2163.10 | 2294.40 | 2074.40 |
| టెక్ మహీంద్రా | 681.10 | 712.20 | 662.80 |
| విప్రో | 271.85 | 289.40 | 262.30 |
| **సిమెంట్** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| ఏసీసీ | 1546.85 | 1632.90 | 1495.00 |
| అంబుజా సిమెంట్స్ | 210.20 | 222.40 | 203.30 |
| ఇండియా సిమెంట్స్ | 104.05 | 109.50 | 99.80 |
| శ్రీ సిమెంట్ | 21366.00 | 22181.60 | 20791.20 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 4522.05 | 4784.60 | 4366.90 |
| **ఫార్మా** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| అరబిందో ఫార్మా | 597.20 | 617.30 | 584.20 |
| బయోకాన్ | 240.10 | 254.60 | 231.60 |
| కేడిలా హెల్త్‌కేర్ | 228.70 | 242.10 | 220.20 |
| సిప్లా | 550.00 | 556.20 | 546.10 |
| డాక్టర్ రెడ్డీస్ | 2600.95 | 2630.60 | 2578.70 |
| జీఎస్‌కే ఫార్మా | 1181.35 | 1197.10 | 1167.10 |
| గ్లెన్‌మార్క్ ఫార్మా | 430.55 | 448.50 | 420.30 |

| బ్యాంకింగ్ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| యాక్సిస్ బ్యాంక్ | 806.10 | 818.40 | 795.10 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 2472.40 | 2510.70 | 2440.80 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 436.35 | 443.20 | 429.80 |
| ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ | 43.40 | 45.90 | 41.90 |
| ఇండస్ఇండ్ బ్యాంక్ | 1532.55 | 1574.60 | 1463.40 |
| కోటక్ బ్యాంక్ | 1517.20 | 1532.40 | 1492.50 |
| పీఎన్‌బీ | 81.80 | 84.60 | 79.50 |
| ఎస్‌బీఐ | 370.65 | 377.70 | 362.50 |
| యెస్ బ్యాంక్ | 88.15 | 100.30 | 81.40 |
| **చమురు** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| బీపీసీఎల్ | 370.05 | 390.10 | 350.70 |
| హెచ్‌పీసీఎల్ | 287.50 | 306.10 | 263.00 |
| ఐఓసీఎల్ | 152.20 | 161.40 | 144.30 |
| ఓఎన్‌జీసీ | 161.50 | 171.20 | 55.10 |
| ఆయిల్ ఇండియా | 173.50 | 180.20 | 169.10 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 1263.35 | 1301.80 | 1240.80 |
| **వాహన** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| అశోక్ లేలాండ్ | 87.05 | 92.00 | 84.10 |
| బజాజ్ ఆటో | 2842.55 | 2953.60 | 2771.50 |
| ఐషర్ మోటార్స్ | 19645.10 | 20220.50 | 19294.20 |
| హీరో మోటోకార్ప్ | 2512.30 | 2664.10 | 2424.10 |
| ఎం అండ్ ఎం | 642.05 | 688.80 | 615.20 |
| మారుతీ సుజుకీ | 6360.00 | 6692.00 | 6134.00 |
| టాటా మోటార్స్ | 160.20 | 169.70 | 154.80 |
| టీవీఎస్ మోటార్ | 424.30 | 447.40 | 409.40 |
| **యంత్రపరికరాలు** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| భెల్ | 70.15 | 74.90 | 67.40 |
| సీజీ పవర్ | 25.15 | 27.00 | 24.10 |
| ఎల్ అండ్ టీ | 1558.35 | 1611.30 | 1519.10 |
| థెర్మాక్స్ | 1044.25 | 1084.00 | 1015.20 |
| సీమెన్స్ | 1259.60 | 1407.00 | 1179.80 |
| **టెలికాం** | **ప్రస్తుత ధర** | **నిరోధం** | **మద్దతు** |
| భారతీ ఎయిర్‌టెల్ | 364.80 | 376.10 | 354.80 |
| ఆర్‌కామ్ | 1.55 | 1.60 | 1.40 |
| టాటా కమ్యూనికేషన్స్ | 461.35 | 473.10 | 454.20 |
| టాటా టెలీ సర్వీసెస్ | 3.90 | 4.30 | 3.70 |
| వొడాఫోన్ ఐడియా | 12.00 | 12.80 | 11.50 |

## వరుసగా అయిదో నెలా మారుతీ ఉత్పత్తిలో కోత

దిల్లీ: మారుతీ సుజుకీ గత నెలలోనూ వాహనాల ఉత్పత్తిని తగ్గించేసింది. దీంతో వరుసగా అయిదో నెలలోనూ ఉత్పత్తిని తగ్గించినట్లయ్యింది. గత ఏడాది జూన్‌లో మొత్తం 1,32,616 వాహనాలను ఉత్పత్తి చేయగా, ఈ ఏడాది జూన్‌లో 15.6% తగ్గించి 1,11,917 వాహనాలనే రూపొందించింది. ప్రయాణికుల వాహనాలు 2018 జూన్‌లో 1,31,068 ఉత్పత్తి చేయగా, గత నెలలో 16.34% తగ్గించి, 1,09,641 వాహనాలను మాత్రమే తయారు చేసింది. ఆల్టో వంటి చిన్న వాహనాల ఉత్పత్తిని ఏకంగా 48.2 శాతం తగ్గించింది. గత ఏడాది జూన్‌లో 29,131 వాహనాలను ఉత్పత్తి చేయగా, గత నెలలో 15,087 వాహనాలనే తయారు చేసింది. కాంపాక్ట్ విభాగ కార్లయిన వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, డిజైర్ వాహనాల ఉత్పత్తి మాత్రం 1.46 శాతమే తగ్గించింది. యుటిలిటీ వాహనాల ఉత్పత్తిలో 5.26%, వ్యాన్ల ఉత్పత్తిలో 27.87% మేర కోత విధించింది. ఇదిలా ఉంటే, ఈ ఏడాది మేలో 18%, ఏప్రిల్‌లో 10%, మార్చిలో 20.9%, ఫిబ్రవరిలో 8% మేర ఉత్పత్తిని మారుతీ తగ్గించిన విషయం తెలిసిందే.

# 5 యుద్ధనౌకలు @ 10 వేల కోట్లు

## హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు భారీ ఆర్డర్

**ఈనాడు, విశాఖపట్నం:** విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ (హెచ్ఎస్ఎల్) చరిత్రలోనే తొలిసారిగా రూ. 10 వేల కోట్ల విలువైన ఆర్డర్‌ను రక్షణ మంత్రిత్వశాఖ కేటాయించింది. ఈ ఆర్డర్‌లో భాగంగా ఐదు భారీ యుద్ధనౌకల్ని హెచ్ఎస్ఎల్ నిర్మించనుంది. 78 సంవత్సరాల చరిత్ర కలిగిన షిప్‌యార్డ్‌కు విస్తృత మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన మానవ వనరులున్నా, ఆర్డర్లు లేక విలవిల్లాడింది. ఇప్పుడు ఒక్కోటి 45 వేల టన్నుల బరువుండే, యుద్ధనౌకలను బహుళ ప్రయోజనాలకు అనువుగా నిర్మించనుంది. నేరుగా యుద్ధాల్లో పాల్గొనడం, యుద్ధాల్లో ఉన్న ఇతర నౌకలు, సిబ్బందికి అవసరమైన సామగ్రి, ఆహారాన్ని భారీఎత్తున అందించే మాతృనౌకల్లా (మదర్‌షిప్స్) కూడా అవి సేవలు అందించగలుగుతాయి. వీటిని అత్యున్నత




ప్రమాణాలతో నిర్ణీత సమయంలో తయారు చేయడం పెను సవాలు. మొదటి యుద్ధనౌకను నాలుగేళ్లలోపే నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. అధునాతన సాంకేతిక సహకారం కోసం టర్కీ దేశంలోని అన్నడోలు షిప్‌యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది. యుద్ధనౌకల డిజైన్లు, నిర్మాణానికి అవసరమైన పూర్తి సాంకేతిక పరిజ్ఞానాల్ని కూడా అన్నడోలు సంస్థ బదిలీ చేయనుంది.

**కీలక మైలురాయి**

రక్షణశాఖ ఆర్డర్ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు కేటాయించడం సంస్థ చరిత్రలో కీలక మైలురాయి. టర్కీ సంస్థ నుంచి ఎలాంటి డిజైన్, సాంకేతిక సహకారాలు పొందాలన్న అంశంపై అంగీకారానికి వచ్చాం. నిర్మాణం ప్రారంభమయ్యాక, ఆరేడేళ్ల వరకు ముమ్మరంగా పనులు సాగుతాయి. రక్షణశాఖ అధికారులు చట్టపరమైన ప్రక్రియలు పూర్తిచేశాక, నౌకల నిర్మాణానికి అనుమతులు ఇస్తారు.

– రియర్ అడ్మిరల్ ఎల్.వి.శరత్‌బాబు, సీఎండీ, హిందుస్తాన్ షిప్‌యార్డ్

## ఖజానాకు అదనంగా రూ.30,000 కోట్లు!

● రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే

**దిల్లీ:** తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన పన్ను ప్రతిపాదనలతో ప్రభుత్వానికి అదనంగా రూ.30,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వెల్లడించారు. అధికాదాయ (సూపర్ రిచ్) వర్గంపై సర్‌ఛార్జి పెంపు, పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకం, రోడ్డు సెస్సు పెంపుతో ఈ మొత్తం సమకూరుతుందని తెలిపారు. రూ.400 కోట్ల వరకు టర్నోవరు కలిగిన కంపెనీల కార్పొరేట్ పన్నును 25 శాతానికి పరిమితం చేయనున్నందున, రూ.4,000 కోట్ల వరకు ఆదాయం తగ్గుతుంది. ఇది పోగా అదనంగా రూ. 30,000 కోట్లు సమకూరుతాయని ఆయన వివరించారు.

✦ పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకం, రోడ్డు సెస్సు పెంపువల్ల ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో రూ.22,000 కోట్ల వరకు రావచ్చు.
✦ అధికాదాయ వర్గంపై సర్‌ఛార్జి పెంపు ద్వారా అదనంగా రూ.12,000-13,000 కోట్ల వరకు సమకూరవచ్చు.
✦ పసిడి, ఇతర విలువైన లోహాల మీద కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో మరో రూ.4,000 కోట్ల ఆదాయం రావచ్చు.

**మన దగ్గర పన్ను ఇప్పటికీ తక్కువే:** అమెరికా, చైనా, దక్షిణాఫ్రికా వంటి దేశాలతో పోలిస్తే ఇప్పటికీ మన దగ్గరే పన్ను రేటు తక్కువగా ఉందని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వివరించారు. అత్యధిక వ్యక్తిగత ఆదాయ పన్ను రేటు చైనా, దక్షిణాఫ్రికా, బ్రిటన్‌లో 45 శాతం, జపాన్‌లో 45.9 శాతం, అమెరికాలో 50.3 శాతం, కెనడాలో 54 శాతం, ఫ్రాన్స్‌లో 66 శాతం ఉన్నట్లు ఆయన తెలిపారు.

**విదేశీ బాండ్లతో నిధుల సమీకరణ: గార్గ్**

సార్వభౌమ బాండ్లు జారీ చేసి విదేశీ మార్కెట్ల నుంచి విదేశీ కరెన్సీలో నిధులు సమీకరిస్తామని ఆర్థిక శాఖ కార్యదర్శి సుభాశ్ చంద్ర గార్గ్ వెల్లడించారు. 'బాండ్లు ఎంత పరిమాణంలో విడుదల చేయాలి? అక్కడ ఎలాంటి పద్ధతులు అనుసరిస్తున్నారు.. వంటి వాటిని పరిశీలించి ప్రక్రియ ప్రారంభిస్తాం. బహుశా సెప్టెంబరు చివరి వారంలో బాండ్ల జారీ ఉండొచ్చ'ని గార్గ్ వెల్లడించారు.

## పరభాషా వీడియోలే చూస్తాం

● 72% ఆన్‌లైన్ వీక్షకుల మొగ్గు ● యూగవ్ నివేదిక



**ముంబయి:** తమకు మాట్లాడటం రాని, అర్థం కాని భాషల్లోని వీడియోలను సబ్‌టైటిల్స్ సాయంతో ఆన్‌లైన్‌లో చూడటానికి దాదాపు 72 శాతం మంది వీక్షకులు ఇష్టపడుతున్నారని ఒక నివేదిక పేర్కొంది. అధిక శాతం మంది వీక్షకులు విదేశీ, ప్రాంతీయ భాషల్లోని వినోద ప్రసారాలను సబ్‌టైటిల్స్ సాయంతో చూస్తున్నారని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే ఆన్‌లైన్ మార్కెట్ రీసెర్చ్, డేటా అనలిటిక్స్ సంస్థ యూగవ్ నివేదికలో తెలిపింది. దేశవ్యాప్తంగా 1000 మందికి పైగా వీక్షకుల నుంచి సేకరించిన వివరాలతో రూపొందించిన నివేదికలోని అంశాలు ఇలా..

✦ 88 శాతం మంది ప్రాంతీయ భాషల్లోని వినోదాన్ని, 55 శాతం మంది విదేశీ భాషల్లోని వీడియోలను వీక్షిస్తున్నారు.
✦ విదేశీ భాషల్లో వీడియోలను మూడొంతుల మంది యూట్యూబ్‌లో చూస్తున్నారు. స్థానిక భాషలకు సంబంధించిన వినోదాన్ని 73 శాతం మంది టీవీల్లో చూడటానికి ప్రాధాన్యమిస్తున్నారు.
✦ అన్ని ప్రాంతాల్లో చూస్తే 82% మంది దక్షిణాది భాషలను ఇష్టపడుతున్నారు.
✦ ఇంగ్లిష్‌లోకి అనువాదం చేసిన విదేశీ, ప్రాంతీయ భాషల్లోని వినోదాన్ని 71 శాతం మంది చూస్తున్నారు. 23 శాతంతో హిందీ రెండో స్థానంలో ఉంది. సొంత భాషలో అనువాదం చేస్తే చూడటానికి 7 శాతం మంది ఇష్టపడుతున్నారు. ఇందులో మలయాళం 14 శాతం, తమిళం 12 శాతంగా ఉన్నాయి.
✦ విదేశీ భాషలను చూస్తామని 82% మంది, మాతృభాషలో వీడియోలు ఉంటే విదేశీ వినోదాన్ని చూస్తామని 78% మంది చెబుతున్నారు. ఇంగ్లీష్ అనువాదాలకు కన్నడ మాట్లాడేవారు 88%, తెలుగు ప్రజలు 86% మేర మొగ్గుచూపుతున్నారు.

**కమొడిటీస్ ఈ వారం**

# రాగి.. సీసం బలహీనమే!

**● బంగారం, వెండి**



పసిడి ఆగస్టు ఫ్యూచర్ కాంట్రాక్టు గత వారం రూ.34,138 వద్ద నష్టాలతో ఆరంభమైంది. ఆ తర్వాత కూడా అదే ఒరవడి కొనసాగిస్తూ రూ. 33,620 స్థాయికి దిగివచ్చింది. ఇది వారం కనిష్ఠ స్థాయి. అనంతరం తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల దన్నుతో కాంట్రాక్టు కొద్ది మేర పుంజుకుంది. అయితే శుక్రవారం ఆర్థిక మంత్రి బడ్జెట్లో పసిడి దిగుమతులపై కస్టమ్స్ సుంకం పెంచడంతో ఒక్కసారి అమాంతం దూసుకెళ్లి రూ.35,100 వద్ద వారం గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 1.25% లాభంతో రూ.34,564 వద్ద ముగిసింది. పసిడి కాంట్రాక్టుకు ఇప్పటికే మోతాదుకు మించి కొనుగోళ్ల మద్దతు లభించినందున రూ.35,236 కంటే ఎగువకు వెళ్లకుంటే.. దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రూ.34,556 ఎగువన స్టాప్‌లాస్ పెట్టుకుని షార్ట్ సెల్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. ఈవారం అమెరికా కాంగ్రెస్ ఎదుట ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ చేసే ప్రసంగంపై ట్రేడర్లు దృష్టి సారిస్తారు. ముఖ్యంగా వడ్డీ రేట్ల కోతపై ఎలాంటి సంకేతాలు ఇస్తారోనని గమనించే అవకాశం ఉంది. వెండి సెప్టెంబరు కాంట్రాక్టుకు గతవారం ప్రారంభ ధర రూ.37,902. డాలరు బలపడటంతో ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై రూ. 37,462 స్థాయికి దిగివచ్చింది. పసిడికి మాదిరే కస్టమ్స్ సుంకం పెంపు ప్రభావంతో వెండి కాంట్రాక్టు కూడా సానుకూలంగా చలించి రూ.38,940 స్థాయిని చేరింది. చివర్లో మళ్లీ దిద్దుబాటుకు లోనుకావడంతో స్వల్పంగా 0.04% నష్టపోయి రూ.37,888 వద్ద ముగిసింది. ఈవారం వెండి కాంట్రాక్టు రూ.37,146- రూ.39,238 మధ్య చలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ. 37,502 స్థాయికి దిగువకు వచ్చినప్పుడు మరికొన్ని లాంగ్ పొజిషన్లు కూడా జతచేసుకోవడం మంచిదే.

**● ప్రాథమిక లోహాలు**



రాగి జులై కాంట్రాక్టు ఈవారం రూ.431.60కు దిగివచ్చే అవకాశం ఉంది. అయితే రూ.445.75 స్థాయికి స్టాప్‌లాస్‌ను సవరించుకోవాలి. సీసం జులై కాంట్రాక్టు ఈవారం కూడా బలహీనంగా కనిపిస్తోంది. రూ.157.75 స్థాయి వద్ద గట్టి నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమించకుంటే ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు. ఒకవేళ ఈ స్థాయి కంటే పైకి వెళితే మరింత ముందుకెళుతుందని భావించవచ్చు. అందువల్ల రూ.157.15 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని రూ.155.60 దరిదాపులో షార్ట్ సెల్ చేయొచ్చు. జింక్ జులై కాంట్రాక్టు ఈవారం రూ.190.15 దిగువకు రాకుంటే కొనుగోళ్ల వైపు మొగ్గు చూపొచ్చు. అదే సమయంలో ఈ రోజు రూ.190.15 కంటే కింద ముగిస్తే రూ.188.35 వరకు పడిపోవచ్చు. అల్యూమినియం జులై కాంట్రాక్టు ఈ రోజు రూ.140.85 కంటే కిందకు దిగిస్తే రూ.139.25 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.143.15 కంటే ఎగువన నిలదొక్కుకుంటే మరింత పైకి వెళ్లి రూ.145.45 స్థాయిని అందుకునే అవకాశం ఉంది. సాంకేతికంగా నికెల్ జులై కాంట్రాక్టుకు ఈవారం కూడా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది.

**● ఇంధన రంగం**



ముడి చమురు జులై కాంట్రాక్టు ఈవారం రూ. 4,048 కంటే పైన చలించకుంటే మరింత కిందకు దిగివచ్చే అవకాశం ఉంటుంది. రూ.3800; రూ. 3,736 వరకు పడిపోవచ్చు. రూ.4,048 ఎగువన స్టాప్‌లాస్ పెట్టుకుని రూ.4,007 దిగువన షార్ట్ సెల్ చేయొచ్చు. సహజ వాయువు జులై కాంట్రాక్టు ఈవారం రూ.154.60 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే పుంజుకునే అవకాశం ఉంటుంది. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జులై కాంట్రాక్టు ఈవారం కూడా మరింత కిందకు దిగివచ్చే అవకాశం ఉంది. అందువల్ల రూ.495 వరకు షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించొచ్చు. ఆ తర్వాత నుంచి లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది.

**గతవారం పొజిషన్లు ఇలా**

| కమొడిటీ | ప్రారంభం | ముగింపు | వృద్ధి/(క్షీణత) |
|---|---|---|---|
| | (రూ.లలో) | | (శాతంలో) |
| రాగి (జులై) | 447 | 438.50 | (1.90) |
| సీసం (జులై) | 156.15 | 152.15 | (2.56) |
| జింక్ (జులై) | 200.65 | 193.90 | (3.36) |
| అల్యూమినియం (జులై) | 143.50 | 141.95 | (1.08) |
| నికెల్ (జులై) | 904.70 | 885.50 | (2.12) |
| ముడి చమురు (జులై) | 4,123 | 3,928 | (4.73) |
| సహజ వాయువు (జులై) | 161.50 | 167.50 | 3.73 |
| సీపీఓ (జులై) | 517.10 | 500.30 | (3.25) |
| పసుపు(ఆగస్టు) | 6,702 | 6,620 | (1.22) |
| సోయాబీన్ (ఆగస్టు) | 3,650 | 3,632 | (0.49) |
| జీలకర్ర(ఆగస్టు) | 17,275 | 17,335 | 0.35 |

**● వ్యవసాయ ఉత్పత్తులు**



పసుపు ఆగస్టు కాంట్రాక్టు రానున్న రోజుల్లో రూ. 6,606; రూ.6,550 వరకు పడిపోవచ్చు. అయితే రూ. 6,550 వద్ద కాంట్రాక్టుకు తిరిగి మద్దతు లభించే అవకాశం ఉన్నందున అక్కడ నుంచి కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. సోయాబీన్ ఆగస్టు కాంట్రాక్టు ప్రతికూల ధోరణిని కొనసాగించే అవకాశం ఉంటుంది. సాంకేతికంగా కూడా రూ.3,675 కంటే పైన కదలాడకుంటే మరింత డీలాపడొచ్చు. జీలకర్ర ఆగస్టు కాంట్రాక్టు ఈవారం కూడా కిందకు దిగిరావచ్చు. అయితే రూ.16,888-17,111 దరిదాపులో మద్దతు లభించే అవకాశం ఉన్నందున ఈ స్థాయిల వద్ద తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

Eenadu epaper




# ఇక్కడ బ్యాటింగ్.. అక్కడ బౌలింగ్!

ఫోర్త్ అంపైర్

**ప్రపంచకప్‌లో లీగ్ దశ ముగిసింది. హోరాహోరీ పోరాటాలకు తెరపడింది. పాయింట్ల లెక్కలకు శుభంకార్డు పడింది. ఇక మిగిలినవి నాలుగే జట్లు. విశ్వపోరుకు ఆఖరి వారం. ప్రపంచకప్‌లో చివరి ఘట్టం. మంగళవారమే తొలి సెమీస్.. గురువారం రెండో సెమీస్.. ఆదివారం మెగా ఫైనల్! మరి నాకౌట్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే మైదానాలేవీ? ఏ పిచ్ ఎవరికి అనుకూలం? ఏ జట్లు ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తే బాగుంటుందో చూద్దాం!**




## తొలి సెమీస్ (మంగళవారం)

**భారత్ × న్యూజిలాండ్** వేదిక: ఓల్డ్ ట్రాఫోర్డ్

### ఈ ప్రపంచకప్‌లో..

ఈ స్టేడియంలో 4 మ్యాచ్‌లు జరగగా.. నాల్గింట్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్లదే విజయం. అందులో 2 టీమ్‌ఇండియా మ్యాచ్‌లే. రెండింట్లోనూ భారత్‌దే పైచేయి.

● భారత్ 89 పరుగుల ఆధిక్యంతో పాకిస్థాన్‌పై విజయం. రోహిత్ (140) సెంచరీతో సత్తాచాటగా.. రాహుల్ (57), విరాట్ కోహ్లి (77) అర్ధ సెంచరీలతో మెరిశారు. విజయ్ శంకర్ (2/22), హార్దిక్ (2/44), కుల్దీప్ (2/32) రెండేసి వికెట్లు తీశారు

● ఇంగ్లాండ్ 150 పరుగుల ఆధిక్యంతో అఫ్గానిస్థాన్‌పై గెలుపు ● న్యూజిలాండ్ 5 పరుగుల ఆధిక్యంతో వెస్టిండీస్‌పై విజయం. బ్యాటింగ్‌లో కేన్ విలియమ్సన్ (148), రాస్ టేలర్ (69).. బౌలింగ్‌లో బౌల్ట్ (4/30), ఫెర్గూసన్ (3/59) రాణించారు.

● భారత్ 125 పరుగుల ఆధిక్యంతో విండీస్‌పై గెలుపు. రాహుల్ (48), కోహ్లి (72), ధోని (56 నాటౌట్), హార్దిక్ (46) మెరిశారు. మహ్మద్ షమి (4/16), బుమ్రా (2/9), చాహల్ (2/39) సత్తా చాటారు.

### టీమ్‌ఇండియా రికార్డు

| | |
|---|---|
| 10 మ్యాచ్‌లాడగా.. ఐదింట్లో విజయం, ఐదింట్లో ఓటమి | ఓల్డ్ ట్రాఫోర్డ్ |
| మొత్తం వన్డేలు: 51 | |
| తొలుత బ్యాటింగ్: 22 | |
| ఛేదనలో విజయాలు: 27 | |
| ఫలితం తేలనివి: 2 | |
| అత్యధిక స్కోరు: 397/6. అఫ్గాన్‌పై ఇంగ్లాండ్ | |
| అత్యల్ప స్కోరు: 45 ఆలౌట్. ఇంగ్లాండ్‌పై కెనడా | |

### పరుగులే పరుగులు..

పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. బ్యాట్స్‌మెన్ క్రీజులో కుదురుకుంటే భారీస్కోరు సాధించొచ్చు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పిచ్‌పై బంతి ప్రభావం ఉండదు. మధ్యాహ్నం తర్వాత పిచ్ మందకొడిగా మారుతుంది. వాతావరణం చల్లబడ్డాక పిచ్ నుంచి బౌలర్లకు సహకారం లభిస్తుంది. లక్ష్య ఛేదన కష్టమవుతుంది.

### ఇలా చేస్తే...

టాస్ గెలిస్తే మొదట బ్యాటింగ్ చేయడం సరైన నిర్ణయం. తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు రెండు సార్లు 300 పైచిలుకు స్కోర్లు సాధించాయి. ఇంగ్లాండ్ దాదాపుగా 400 స్కోరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఓపెనర్ల పాత్ర కీలకమవుతుంది. 40 ఓవర్ల తర్వాత పరుగులు రాబట్టడం కష్టమవుతుంది. కాబట్టి ఓపెనర్లు చేసే పరుగులే జట్టు స్కోరును నిర్దేశిస్తాయి. మాంచెస్టర్‌లో పాకిస్థాన్‌పై రోహిత్ సెంచరీ సాధించాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న రోహిత్ మరో సెంచరీ చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. శ్రీలంకతో పోరులో సెంచరీతో జోరుమీదున్న కేఎల్ రాహుల్ మరో బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడితే భారత్ ఫైనల్ గడప తొక్కొచ్చు. ఇక మాంచెస్టర్‌లో కివీస్ 5 పరుగుల ఆధిక్యంతో వెస్టిండీస్‌పై నెగ్గింది. గేల్, బ్రాత్‌వైట్ వీర విహారం చేసిన ఈ పిచ్‌పై కివీస్ గొప్పగా ఏమీ గెలవలేదు. చివర్లో బ్రాత్‌వైట్ తొందరపాటు కివీస్‌కు కలిసొచ్చింది.

### 5+2+4

మాంచెస్టర్‌లో టీమ్‌ఇండియాకు 5+2+4 కూర్పుతో ఫలితం ఉండొచ్చు. ఐదుగురు బ్యాట్స్‌మెన్.. ఇద్దరు ఆల్‌రౌండర్లు.. నలుగురు బౌలర్లతో ఆడొచ్చు. రోహిత్, రాహుల్, కోహ్లి, పంత్, ధోని, పాండ్య, జడేజా, బుమ్రా, షమి, భువనేశ్వర్, కుల్దీప్ లేదా చాహల్‌తో బరిలో దిగొచ్చు. బ్యాటింగ్ పిచ్‌పై ఐదుగురు బ్యాట్స్‌మెన్‌తో పాటు పాండ్య, జడేజా లాంటి బ్యాటింగ్ ఆల్‌రౌండర్లు అవసరం. చివరి ఓవర్లలో వారి ప్రదర్శనే కీలకమవుతుంది. ఈ కప్‌లో మాంచెస్టర్‌లో జరిగిన 4 మ్యాచ్‌ల్లో పేసర్లే ప్రభావం చూపారు. కాబట్టి బుమ్రా, షమి, భువి, పాండ్యలతో కూడిన కూర్పే అత్యుత్తమం.





## రెండో సెమీస్ (గురువారం)

**ఇంగ్లాండ్ × ఆస్ట్రేలియా** వేదిక: ఎడ్జ్‌బాస్టన్

| | |
|---|---|
| మొత్తం వన్డేలు | : 62 |
| తొలుత బ్యాటింగ్ | : 26 |
| లక్ష్య ఛేదన | : 29 |
| టై/ఫలితం తేలనివి | : 7 |
| అత్యధిక స్కోరు | : 408/9. న్యూజిలాండ్‌పై ఇంగ్లాండ్ |
| అత్యల్ప స్కోరు | : 70 ఆలౌట్. ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియా |

### ఈ ప్రపంచ కప్‌లో..

ఎడ్జ్‌బాస్టన్‌లో 4 మ్యాచ్‌లు నిర్వహించగా.. రెండింట్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు.. రెండింట్లో లక్ష్యాన్ని ఛేదించిన జట్లు నెగ్గాయి. టీమ్‌ఇండియాను ఇంగ్లాండ్ ఓడించింది ఇక్కడే.

● న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం ● పాకిస్థాన్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపు ● ఇంగ్లాండ్ 31 పరుగుల ఆధిక్యంతో భారత్‌పై విజయం ● టీమ్‌ఇండియా 28 పరుగుల ఆధిక్యంతో బంగ్లాదేశ్‌పై గెలుపు.

### పిచ్

వర్షాలు పడి.. పిచ్ తేమగా ఉన్న సమయంలో వికెట్ బౌలర్లకు సహకరించింది. ఎండ బాగా ఉన్నప్పుడు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. ప్రపంచకప్‌లో జరిగిన 4 మ్యాచ్‌లే ఇందుకు నిదర్శనం. జూన్ 19, 26న జరిగిన తొలి 2 మ్యాచ్‌ల్లో లక్ష్య ఛేదన చేసిన జట్లే నెగ్గాయి. 2 మ్యాచ్‌ల్లో అత్యధిక స్కోరు 241 పరుగులే. జులై 2, 11న జరిగిన మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్లు గెలిచాయి. అప్పుడు వర్షాల ప్రభావం లేదు. రెండు మ్యాచ్‌ల్లో మూడు సార్లు 300 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి.

### వ్యూహం

బర్మింగ్‌హామ్‌లో ఒకవైపు బౌండరీ 59 మీటర్లే. భారత్‌తో పోరులో ఇంగ్లాండ్ ఈ బౌండరీని బాగా సద్వినియోగం చేసుకుంది. రాయ్, బెయిర్‌స్టో, స్టోక్స్ అటువైపే ఎక్కువగా పరుగులు రాబట్టారు. టీమ్‌ఇండియా బ్యాటింగ్‌కు వచ్చేసరికి దూరంగా ఉన్న బౌండరీ వైపు ఫీల్డర్లను మోహరించి అటువైపే బంతులు సంధించారు. ఆసీస్‌తో సెమీస్‌లోనూ ఇంగ్లాండ్ వ్యూహం అలాగే ఉండొచ్చు.

### కూర్పు

బర్మింగ్‌హామ్ పిచ్‌పై 6+1+4 కూర్పుతో ఫలితం ఉండొచ్చు. ఆరుగురు బ్యాట్స్‌మెన్.. ఒక ఆల్‌రౌండర్.. నలుగురు బౌలర్లతో బరిలో దిగొచ్చు. స్పిన్నర్ల ప్రభావం తక్కువే. చాహల్ బౌలింగ్‌లో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ ధారాళంగా పరుగులు పిండుకున్నారు. పేసర్లకు మంచి రికార్డుంది. పేసర్లు స్లో బంతులతో ప్రభావం చూపొచ్చు.

## ఫైనల్ (ఆదివారం)

వేదిక: లార్డ్స్



| | |
|---|---|
| మొత్తం వన్డేలు: 65 | |
| తొలుత బ్యాటింగ్: 30 | |
| లక్ష్య ఛేదన: 32 | |
| టై/ఫలితం తేలనివి: 3 | |
| అత్యధిక స్కోరు: 334/4. టీమ్‌ఇండియాపై ఇంగ్లాండ్ | |
| అత్యల్ప స్కోరు: 107 ఆలౌట్. ఇంగ్లాండ్‌పై దక్షిణాఫ్రికా | |

### ఈ ప్రపంచ కప్‌లో

లండన్‌లో 4 మ్యాచ్‌లు జరగగా.. నాల్గింట్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్లే నెగ్గాయి.

● పాకిస్థాన్ 49 పరుగుల ఆధిక్యంతో దక్షిణాఫ్రికాపై విజయం ● ఆస్ట్రేలియా 64 పరుగుల ఆధిక్యంతో ఇంగ్లాండ్‌పై గెలుపు ● ఆస్ట్రేలియా 86 పరుగుల ఆధిక్యంతో న్యూజిలాండ్‌పై విజయం ● పాకిస్థాన్ 94 పరుగుల ఆధిక్యంతో బంగ్లాదేశ్‌పై గెలుపు

### 6+1+4

6+1+4 కూర్పుతో ఫలితం ఉండొచ్చు. ఆరుగురు బ్యాట్స్‌మెన్.. ఒక ఆల్‌రౌండర్.. నలుగురు బౌలర్లను తీసుకోవచ్చు. మధ్య ఓవర్లలో స్పిన్నర్ పరుగులకు అడ్డుకట్ట వేయొచ్చు.

### పిచ్

బ్యాటింగ్, బౌలింగ్‌కు పిచ్ సమంగా సహకరిస్తుంది. 4 మ్యాచ్‌ల్లో రెండు సార్లు 300 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. 2 సార్లు 250లోపు.. ఒకసారి 160లోపు స్కోర్లకే పరిమితమయ్యాయి. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 157 పరుగులకే కుప్పకూలింది. మొత్తంగా ఈ పిచ్.. బ్యాటు, బంతి పోరుకు సరైన వేదిక.

### వ్యూహం

టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్‌కే మొగ్గు చూపొచ్చు. భారీస్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచొచ్చు. మధ్యాహ్నం తర్వాత వాతావరణం చల్లబడుతుంది కాబట్టి పేసర్లు ప్రభావం చూపిస్తారు.





## విరాట్ × కేన్

# కుర్రాళ్లే.. మొనగాళ్లై...

**అప్పుడు అండర్-19లో ఇప్పుడు వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో**

మాంచెస్టర్

**అది కౌలాలంపూర్‌లోని స్టేడియం. 2008 అండర్-19 ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య సెమీఫైనల్ పోరు. భారత్‌కు ఓ నూనూగు మీసాల కుర్రాడు.. కివీస్‌కు అసలు మీసాలే రానట్లుగా ఉన్న కుర్రాడు కెప్టెన్లు.**

**కాలచక్రం గిర్రున తిరిగింది.**

**పదకొండేళ్లు గడిచాయి. ఆ జట్లలో ఎంత మంది సీనియర్ క్రికెట్ ఆడారో తెలియదు. కానీ ఈ రోజు ప్రపంచం దృష్టంతా ఆ కుర్రాళ్లిద్దరిపైనే. ఎందుకంటే మేటి బ్యాట్స్‌మెన్‌గా ఎదిగిన వాళ్లు.. చరిత్రను పునరావృతం చేయబోతున్నారు. ప్రపంచకప్ సెమీఫైనల్లో మళ్లీ తమ జట్లకు సారథ్యం వహించనున్నారు. కాకపోతే ఈసారి సీనియర్ క్రికెట్లో.. వన్డే ప్రపంచకప్‌లో! ఆ కుర్ర హీరోలు కోహ్లి, విలియమ్సన్ అని వేరే చెప్పక్కర్లేదు.**

ఇన్నేళ్ల తర్వాత ప్రపంచకప్‌లో కోహ్లి, విలియమ్సన్‌లు ప్రపంచకప్ సెమీఫైనల్లో సారథులుగా తలపడుతుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇద్దరిదీ భిన్నమైన శైలి. కోహ్లి ఎప్పుడూ దూకుడుగా ఉంటే.. విలియమ్సన్ ప్రశాంతంగా సాగిపోతాడు. కానీ ఇద్దరు తమ జట్లను సమర్థంగానే నడిపిస్తున్నారు. బ్యాటింగ్‌లోనూ మూల స్తంబాలే. కోహ్లి 8 మ్యాచ్‌ల్లో 63.14 సగటుతో 442 పరుగులు చేస్తే.. కేన్ అన్నే మ్యాచ్‌ల్లో 96.20 సగటుతో 481 పరుగులు సాధించాడు. అయితే ఇప్పటివరకు ప్రదర్శన ఒక ఎత్తు.. ఇకపై చేయాల్సిన ప్రదర్శన ఒక ఎత్తు. నాకౌట్లో వీళ్లు తమ జట్లను ఎలా నడిపిస్తారన్నది ఆసక్తికరం. 2008లో అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌లో కోహ్లి జట్టు 3 వికెట్ల తేడాతో విలియమ్సన్ బృందాన్ని ఓడించి, ఆ తర్వాత ప్రపంచకప్‌నూ చేజిక్కించుకుంది. మరి కోహ్లి ఆ ఘనతను పునరావృతం చేస్తాడా? తేలేది రేపే! అప్పుడు కుర్రాళ్ల ప్రపంచకప్‌లో పోటీపడిన వాళ్లలో భారత్ తరపున జడేజా.. న్యూజిలాండ్ తరపున బౌల్ట్, సౌథీలు ఈసారి బరిలో ఉండటం విశేషం.

## లీగు వీరులు

**ప్రపంచకప్ లీగ్ దశలో మెరిసిన ఆటగాళ్లు..**

**అత్యధిక పరుగులు**

రోహిత్ (భారత్) 647
వార్నర్ (ఆస్ట్రేలియా) 638
షకిబ్ (బంగ్లాదేశ్) 606

**అత్యధిక స్కోరు**

వార్నర్ (ఆస్ట్రేలియా) 166
రాయ్ (ఇంగ్లాండ్) 153
ఫించ్ (ఆస్ట్రేలియా) 153

**అత్యధిక వికెట్లు**

స్టార్క్ (ఆస్ట్రేలియా) 26
ముస్తాఫిజుర్ (బంగ్లాదేశ్) 20
ఫెర్గుసన్ (న్యూజిలాండ్) 17

**ఉత్తమ ప్రదర్శన**

షాహీన్ (పాకిస్థాన్) 6/35
స్టార్క్ (ఆస్ట్రేలియా) 5/26
షకిబ్ (బంగ్లాదేశ్) 5/29

## పాయింట్ల పట్టిక

| జట్టు | మ్యా | గె | ఓ | టై/ర | పా | నె.రేట్ |
|---|---|---|---|---|---|---|
| భారత్ | 9 | 7 | 1 | 1 | 15 | +0.809 |
| ఆస్ట్రేలియా | 9 | 7 | 2 | 0 | 14 | +0.868 |
| ఇంగ్లాండ్ | 9 | 6 | 3 | 0 | 12 | +1.152 |
| న్యూజిలాండ్ | 9 | 5 | 3 | 1 | 11 | +0.175 |
| పాకిస్థాన్ | 9 | 5 | 3 | 1 | 11 | -0.430 |
| శ్రీలంక | 9 | 3 | 4 | 2 | 8 | -0.919 |
| దక్షిణాఫ్రికా | 9 | 3 | 5 | 1 | 7 | -0.030 |
| బంగ్లాదేశ్ | 9 | 3 | 5 | 1 | 7 | -0.410 |
| వెస్టిండీస్ | 9 | 2 | 6 | 1 | 5 | -0.225 |
| అఫ్గానిస్థాన్ | 9 | 0 | 9 | 0 | 0 | -1.322 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

### మనమే టాప్

ప్రపంచకప్ రౌండ్ రాబిన్ లీగ్ (45 మ్యాచ్‌లు) ముగిసింది. శనివారం రాత్రి ముగిసిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోవడంతో, భారత్ 15 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానం సాధించింది. దీంతో పట్టికలో నాలుగో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్ (11 పాయింట్లు)తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. లీగ్ దశలో కివీస్‌తో భారత్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. లీగ్ దశను రెండో స్థానం (14 పాయింట్లు)తో ముగించిన ఆస్ట్రేలియా.. మూడో స్థానంలో నిలిచిన ఇంగ్లాండ్ (12)తో గురువారం సెమీఫైనల్లో తలపడనుంది.

### వార్నర్, కేరీ మెరిసినా..

ఆఖరి మ్యాచ్ ఆస్ట్రేలియాకు షాకే. దక్షిణాఫ్రికాపై గెలిస్తే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంతో.. కాస్త బలహీనంగా కనిపిస్తోన్న న్యూజిలాండ్‌తో సెమీస్‌లో తలపడే అవకాశం ఆసీస్‌కు దక్కేది. కానీ ఓటమి కారణంగా బలమైన ఇంగ్లాండ్‌తో ఆడాల్సిన పరిస్థితి ఎదురైంది. శనివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 10 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. డుప్లెసిస్ (100), డసెన్ (95) మెరవడంతో మొదట దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 325 పరుగులు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో 54 పరుగులకే 4 వికెట్లు కోల్పోవడంతో ఆసీస్ చిత్తవడం ఖాయమనిపించింది. వార్నర్ (122), కేరీ (85) అద్భుతంగా పోరాడటంతో లక్ష్యానికి చేరువగా వచ్చింది. కానీ ఆఖరికి గెలుపు దక్షిణాఫ్రికాదే.

# సెమీస్ సగం.. సగం

ఈనాడు క్రీడావిభాగం

**సెమీఫైనల్.. పతాక పోరుకు అర్హత పొందేందుకు ఒక అడుగు దూరమిది.. తాజా ప్రపంచకప్‌కు ముందు భారత్ ఈ టోర్నీలో ఆరుసార్లు సెమీఫైనల్స్ చేరింది. ఈసారి న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా ఏడోసారి సెమీస్ సమరానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో టీమ్‌ఇండియా గత సెమీస్ ఫలితాలను ఒకసారి చూద్దామా..!**

### అమరనాథ్ అదరహో

1983
కెప్టెన్: కపిల్‌దేవ్
ప్రత్యర్థి: ఇంగ్లాండ్
ఫలితం: గెలుపు

**1983** ప్రపంచకప్‌లో తొలిసారి భారత్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. కపిల్‌దేవ్ సారథ్యంలోని టీమ్ ఇండియాపై ఎలాంటి అంచనాలు లేవు. ఇంగ్లాండ్‌తో సెమీస్ పోరులో మన జట్టు అనూహ్య ప్రదర్శన చేసింది. కపిల్ (3/35), రోజర్ బిన్నీ (2/43), అమర్‌నాథ్ (2/27) విజృంభించడంతో మొదట ఇంగ్లాండ్ 213 పరుగులకే ఆలౌటైంది. అమర్‌నాథ్ (46) ఆల్‌రౌండ్ ప్రదర్శనకు తోడు, సందీప్ పాటిల్ (51 నాటౌట్), యశ్‌పాల్ శర్మ (61) రాణించడంతో లక్ష్యాన్ని భారత్ 4 వికెట్లే కోల్పోయి ఛేదించింది.

### అజహర్ శ్రమ వృథా

1987
కెప్టెన్: కపిల్‌దేవ్
ప్రత్యర్థి: ఇంగ్లాండ్
ఫలితం: ఓటమి

**1987** ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ గెలిచే అవకాశాన్ని చేతులారా వదులుకుంది. మొదట ఇంగ్లాండ్ 254 పరుగులే చేసింది. ఛేదనలో అజహరుద్దీన్ (64), శ్రీకాంత్ (31), కపిల్‌దేవ్ (30) రాణించడంతో భారత్ ఒక దశలో 204/5తో లక్ష్యం దిశగా సాగింది. కానీ 15 పరుగుల తేడాతో 5 వికెట్లు చేజార్చుకున్న భారత్ 219 పరుగులకే ఆలౌటై అనూహ్య పరాజయం చవిచూసింది.

### సువర్ణావకాశం చేజారింది

1996
కెప్టెన్: అజహరుద్దీన్
ప్రత్యర్థి: శ్రీలంక
ఫలితం: ఓటమి

**1996** ప్రపంచకప్ సెమీస్‌లో మొదట శ్రీలంక 251 పరుగులు చేసింది. అరవింద డిసిల్వా (66), మహానామ (58) రాణించారు. ఛేదనలో సచిన్ (65) మెరవడంతో ఒక దశలో భారత్ 98/1తో పటిష్ఠంగా కనిపించింది. అయితే సచిన్ ఔటయ్యాక.. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన భారత్ 120/8తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ స్థితిలో స్టేడియంలో అభిమానులు ప్లకార్డులు కాల్చడం, నీళ్ల బాటిళ్లు మైదానంలోకి విసిరేయడంతో రిఫరీ మ్యాచ్‌ను ఆపేసి.. లంకను విజేతగా ప్రకటించాడు.

### కూనను ఆటాడించి..

2003
కెప్టెన్: గంగూలీ
ప్రత్యర్థి: కెన్యా
ఫలితం: గెలుపు

టెస్టు హోదా కూడా లేని కెన్యా.. 2003 ప్రపంచకప్‌లో సంచలన విజయాలతో సెమీస్ చేరింది. ఆ జట్టు ప్రత్యర్థి భారత్..! కూనను ఒక ఆటాడుకుంది టీమ్‌ఇండియా. గంగూలీ (111) సెంచరీకి తోడు సచిన్ (83) రాణించడంతో మొదట గంగూలీ సేన 270 పరుగులు చేయగా.. ఛేదనలో కెన్యా 179 పరుగులకే ఆలౌటైంది. జహీర్‌ఖాన్ (3/14), నెహ్రా (2/11), సచిన్ (2/28) ప్రత్యర్థి పని పట్టారు.

### దాయాదిని దంచేశారు

2011
కెప్టెన్: ధోని
ప్రత్యర్థి: పాకిస్థాన్
ఫలితం: గెలుపు

ప్రపంచకప్‌లో భారత్ ఆడిన అన్ని సెమీస్‌ల లోకెల్లా 2011 కప్ సెమీస్ చాలా ప్రత్యేకం. ఎందుకంటే ధోని సేన ప్రత్యర్థి పాకిస్థాన్ కాబట్టి. మొదట టీమ్‌ఇండియా 260 పరుగులు చేసింది. సచిన్ (85) టాప్ స్కోరర్. ఛేదనలో ఒక దశలో 41/0తో ఉన్న పాకిస్థాన్ 231 పరుగులకే ఆలౌటైంది. జహీర్, నెహ్రా, మునాఫ్ పాటిల్, హర్భజన్, యువరాజ్ తలా రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

### కంగారూ అడ్డు

2015
కెప్టెన్: ధోని
ప్రత్యర్థి: ఆస్ట్రేలియా
ఫలితం: ఓటమి

**2015** ప్రపంచకప్‌లో అజేయంగా సెమీస్ చేరిన భారత్‌ను ఆస్ట్రేలియా చిత్తు చేసింది. మొదట ఆస్ట్రేలియా 328 పరుగుల భారీ స్కోరు చేసింది. స్టీవ్ స్మిత్ (105) చేయగా, ఫించ్ (81) రాణించాడు. ఛేదనలో ఆసీస్ బౌలర్ల ధాటికి భారత్ 233 పరుగులకే ఆలౌటైంది. ధోని (65), రహానె (44), ధావన్ (45) పోరాడినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు.




'వివేక దీపిని'ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు. వేదికపై మఠాధిపతి శంకరభారతి స్వామి తదితరులు

## భూ చట్టాలను సరళీకృతం చేయాలి

### ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**ఈనాడు, దిల్లీ:** భూములకు సంబంధించిన చట్టాలను సరళీకృతం చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. భూముల వ్యవహారాలు పారదర్శకంగా ఉండేటట్టు చూడాలని, అవినీతిని తగ్గించాలని అన్నారు. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.కె.అగర్వాల్ ఆంగ్లంలో రచించిన 'భూముల రిజిస్ట్రేషన్, ప్రపంచ వ్యాప్త విధానాలు, భారత్‌కు పాఠాలు' అన్న పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ భూముల వ్యవహారాలకు సంబంధించిన పరిపాలనలో మార్పులు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, కానీ ఆ దిశగా తగిన కృషి జరగడం లేదని చెప్పారు.

★ ఆంగ్లంతో సహా తొమ్మిది భాషల్లో వెలువరించిన ఆదిశంకరుల రచనల సంగ్రహం 'వివేక దీపిని' గ్రంథాన్ని కూడా వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఉన్నతమైన భారతీయ ఆలోచన విధానాల పట్ల సామాన్యులకు సైతం అవగాహన కల్పించి, సనాతన జ్ఞానధారలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించేందుకు సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం అవసరమని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఇందుకు వేదాంత భారతి వంటి స్వచ్ఛంద సంస్థలతోపాటు పాఠశాలలు, కళాశాలలు చొరవ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యడథొర్ శ్రీ యోగానందేశ్వర సరస్వతి మఠాధిపతి శంకరభారతి స్వామి, వేదాంత భారతి సంచాలకుడు శ్రీధర్ భట్ తదితరులు పాల్గొన్నారు.

# పని కల్పించని డిగ్రీలెందుకు?

- ఉద్యోగం పొందే సామర్థ్యం చదువులోనే ఉండాలి
- సాధారణ డిగ్రీ కోర్సుల్లోనూ వృత్తి విద్య తప్పనిసరి
- నైపుణ్య విద్య దిశగా కేంద్రం యోచన

**దిల్లీ:** మన కళాశాలలు డిగ్రీల ఫ్యాక్టరీలుగా మారాయి. ఏటా వేలమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్ది బయటికి పంపిస్తున్నాయి. కళాశాలలో కష్టపడి చదివి పట్టా చేతపట్టుకుని 'విద్యార్థి' హోదా నుంచి.. సమాజంలోకి అడుగు పెడితే 'నిరుద్యోగి' కిరీటం ఎదురు చూస్తోంది. డిగ్రీ హోదా పట్టాకే పరిమితమవుతోంది.. చేతుల్లో మాత్రం చిన్నపాటి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యమూ ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితుల్ని మార్చాలని కేంద్ర సర్కారు భావిస్తోంది.

ప్రస్తుతం డిగ్రీ కోర్సుల్లో ఉద్యోగిత నైపుణ్యాలు కొరవడటంతో నిరుద్యోగుల సంఖ్య భారీగా పేరుకుపోతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. నైపుణ్యాలు, డిగ్రీ పట్టాదారుల మధ్య భారీ అంతరం ఉన్నట్లు 'విద్యా నాణ్యత ఉన్నతీకరణ, సమ్మిళిత కార్యక్రమం (ఎక్విప్)'లో భాగంగా రూపొందించిన నివేదిక స్పష్టం చేస్తోంది. దేశంలో ఉన్నత విద్యలో నాణ్యతను, కోర్సుల అందుబాటును మెరుగుపరచాలనే లక్ష్యంతో 'ఎక్విప్' కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు, విశ్లేషించేందుకు కేంద్ర ప్రభుత్వ హెచ్ఆర్‌డీ శాఖ పలువురు నిపుణుల్ని బృందాలుగా రంగంలోకి దించింది. కోర్సుల అందుబాటు, పాలనపరమైన సంస్కరణలు, బోధన, పరిశోధన, ఆర్థిక వెసులుబాటు తదితర కీలక అంశాలపై దృష్టిసారించిన ఈ బృందాలు పలు అంశాల్ని సూచించాయి. ఐదేళ్ల దార్శనిక ప్రణాళికతో రూపొందించిన ఎక్విప్ ప్రతిపాదనలు ప్రస్తుతం వివిధ శాఖల పరిశీలనలో ఉన్నాయి. ఆ తర్వాత కేంద్రమంత్రివర్గ ఆమోదానికి పంపనున్నారు. ఉన్నత విద్యలో పెద్ద ఎత్తున వృత్తి నైపుణ్య శిక్షణ అంశాల్ని చేర్చాల్సిన అవసరం ఉందని, బీఏ, బీఎస్సీ, బీకాం వంటి సాంకేతికేతర కోర్సుల్లో 20-35 శాతం ఒకేషనల్ అంశాలు ఉండాలని ఓ ఎక్విప్ బృందానికి నేతృత్వం వహిస్తున్న గుజరాత్ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ హస్ముఖ్ అధియా సూచించారు.



### ప్రపంచ ర్యాంకుల్లో మన వర్సిటీలు ముందుకెలా!

ప్రపంచవ్యాప్తంగా విద్యా సంస్థల స్థాయిని నిర్ధరించే ప్రఖ్యాత 'క్వాక్వరెల్లి సిమండ్స్ (క్యూఎస్)' ర్యాంకుల్లో భారత ప్రముఖ విశ్వవిద్యాలయాలు వెనకబాట పట్టడం వెనక కారణాలపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్‌డీ) మంత్రిత్వ ఆరా తీస్తోంది. జేఎన్‌యూ, హెచ్‌సీయూ వంటి వర్సిటీలకూ ఇందులో చోటు దక్కకపోవడంపై సమీక్షిస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు ఇటీవల ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. భారత అగ్రస్థాయి విశ్వవిద్యాలయాలు నాణ్యత, విశ్వసనీయత ప్రమాణాల్ని అందుకుంటున్నా, క్యూఎస్ ర్యాంకుల్లో సరైన స్థానాన్ని పొందడం లేదని సమావేశానికి నేతృత్వం వహించిన హెచ్ఆర్‌డీ మంత్రి రమేష్ పోఖ్రియాల్ పేర్కొన్నారు. దీనికిగల కారణాలను వెదకాలని, హాజరైన ఐఐటీల ఉన్నతాధికారులు, వర్సిటీల ఉపకులపతులు తదితరులకు సూచించారు. తాము నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సులపై సరైన దృష్టి సారించకపోవడం వల్ల క్యూఎస్ ర్యాంకుల్లో తాము స్థానం కోల్పోయినట్లు హెచ్‌సీయూ వీసీ అప్పారావు పొదిలె పేర్కొన్నారు. తమకు మంచి బోధకులు ఉన్నా, ర్యాంకుల విషయంలో విదేశీ బోధకుల్ని నియమించుకునే అంశానికి అధిక వెయిటేజీ ఉంటోందని దిల్లీ ఐఐటీ సంచాలకులు రామగోపాలరావు అభిప్రాయపడ్డారు. క్యూఎస్ న్యాయనిర్ణేతల బృందంలో భారతీయులూ ఉండాలని హెచ్ఆర్‌డీ అధికారులు సూచించారు.

### ఎక్విప్ బృందం సూచనలివీ..

- బీఏ, ఎంఏ పట్టాలు చైతన్యవంతులైన పౌరులను తయారు చేస్తున్నా.. ఆర్థిక వ్యవస్థ అవసరాలకు వారందించే భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంటోంది. ఫలితంగా గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ల సంఖ్య భారీ స్థాయిలో పెరిగిపోతోంది.
- తాము చదువుకున్న విద్య నుంచి ఆర్థిక పరమైన ప్రతిఫలాలు అందకపోవడంతో నిరుద్యోగుల్లో సామాజిక అసంతృప్తి పెరిగిపోతోంది. ఉన్నత విద్యా వ్యవస్థను ప్రస్తుత కాలపు యువత ఆర్థిక ఆకాంక్షలకు తగినట్లుగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దకపోతే ఫలితం ఉండదు. ప్రతి డిగ్రీ కోర్సులోనూ పెద్ద ఎత్తున వృత్తి, నైపుణ్య విద్యను చేర్చాల్సిన అవసరం ఉంది.
- సామాజికంగా వెనకబడిన తరగతులు ప్రయోజనం పొందేలా దేశంలో వొకేషనల్ విద్య పాఠ్యాంశాల్ని వికేంద్రీకరించాల్సిన అవసరం తీవ్రస్థాయిలో ఉంది.
- సాంకేతికేతర, వృత్తివిద్యేతర సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో 20-35 శాతం వరకు ఒకేషనల్ అంశాలు ఉండాలి.
- ఉన్నత విద్య, నైపుణ్యాల్ని పెంపొందించే వ్యవస్థ మధ్య సరైన అనుసంధానం అవసరం.
- భారీస్థాయిలో ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల్ని ప్రవేశపెట్టడం, స్థానికంగా చేతివృత్తి నిపుణుల సేవల్ని ఒప్పంద పద్ధతిలో స్వీకరించాలి.
- స్థానిక అవసరాలకు తగినట్లుగా వికేంద్రీకరించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నైపుణ్య విద్యను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలి.
- పాఠశాల స్థాయి నుంచే వృత్తివిద్యా కోర్సుల్ని ఎంచుకునే విద్యార్థులకు విశ్వవిద్యాలయ స్థాయిలోనూ అవి అందుబాటులో ఉండేలా రాష్ట్రాలు చర్యలు తీసుకొనేలా కేంద్రం కృషి చేయాలి.
- ప్రస్తుతమున్న కళాశాలలు, విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను గరిష్ఠంగా ఉపయోగించుకోవాలి.

## భారత సంతతి దంపతుల అప్పగింతకు బ్రిటన్ కోర్టు తిరస్కృతి

**లండన్:** దత్తత బాలుడి(11)ని హత్య చేయించి.. ఆ ఘాతుకాన్ని కళ్లారా చూసిన బాబు బంధువును కూడా చంపించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత సంతతి దంపతుల అప్పగింతకు బ్రిటన్ కోర్టు ఇటీవల తిరస్కరించింది. లండన్‌లో స్థిరపడిన భారత సంతతి దంపతులు ఆర్తి ధీర్, కావల్ రైజదాలిద్దరూ గుజరాత్‌కు చెందిన గోపాల్ సెజానీ అనే అనాథ బాలుడిని 2015 జులైలో దత్తత తీసుకున్నారు. ఆగస్టులో అతడిపై రూ. 1.3కోట్లకు జీవిత బీమా చేసి ప్రీమియం మొత్తాన్ని చెల్లించారు. తర్వాత 2017 ఫిబ్రవరి 11న రాజ్‌కోట్ సమీపంలో గోపాల్‌ను కొంతమంది అపహరించి.. దారుణంగా కత్తితో పొడిచారు. కొన్నాళ్లకు బాలుడు మరణించాడు. గోపాల్ అపహరణను అడ్డుకునేందుకు యత్నించిన బాబు సమీపబంధువుపైనా దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతను కూడా మరణించాడు. ఈ నేపథ్యంలో సమీపబంధువు ఇచ్చిన వాంగ్మూలం ద్వారా... గుజరాత్ పోలీసులు జరిపిన దర్యాప్తులో ధీర్, రైజదాలిద్దరి కుట్రకోణం వెలుగుచూసింది. బాలుడిపై చేసిన బీమా కోసమే వారిద్దరూ ఇదంతా చేయించారని తేలింది. ఈ కేసులో ధీర్, రైజదాల అప్పగింతకు భారత్ అభ్యర్థించగా.. మానవహక్కులపై ఐరోపా తీర్మానంలోని ఆర్టికల్ 3 ప్రాతిపదికన తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి ఎమ్మా ఆర్బత్‌నాట్ స్పష్టం చేశారు. ఈ దంపతులను అప్పగిస్తే వారికి యావజ్జీవఖైదు, దానిని పునఃసమీక్షించే హక్కులేకపోవడం వంటి సమస్య ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## పాక్ ఉగ్రవాదులకు అఫ్గాన్‌లో శిక్షణ

**దిల్లీ:** బాలాకోట్‌లోని జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద ముఠా శిబిరంపై భారత వైమానిక దళం దాడి చేసిన నేపథ్యంలో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చింది. జైష్, లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాద ముఠా క్యాడర్‌లను అఫ్గానిస్థాన్‌కు తరలించింది. అక్కడ శిక్షణ ఇప్పిస్తోంది. ఈ మేరకు భారత నిఘా సంస్థకు సమాచారం అందడంతో కాబూల్, కాందహార్‌లోని భారత దౌత్య కార్యాలయాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జైష్, లష్కరే ముఠాలు అఫ్గాన్ తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌తో చేతులు కలిపాయని నిఘా వర్గాలు గుర్తించాయి. కునార్, నాంగర్‌హార్, నూరిస్థాన్, కాందహార్ ప్రావిన్స్‌లకు పాక్ ఉగ్రవాద ముఠాలు తరలివెళ్లినట్లు తెలిపాయి. లష్కరే తొయిబా నాయకులు, ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్న ఐదు సంస్థలపై ఇటీవల పాక్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను భారత ప్రభుత్వం పెద్దగా పరిగణనలోకి తీసుకోకపోవడానికి ఇదే కారణమని భావిస్తున్నారు. కంటితుడుపు చర్యలు కాకుండా గట్టి కార్యాచరణ ఉండాలని భారత ప్రభుత్వం ఎప్పటి నుంచో స్పష్టంచేస్తోంది.

## ఎంపీ సుబ్రమణ్యస్వామిపై కేసు

### రాహుల్‌పై వివాదాస్పద వ్యాఖ్యలే కారణం

**జశ్‌పూర్/రాయపూర్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భాజపా రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామిపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాహుల్ గాంధీ కొకైన్ తీసుకుంటారంటూ సుబ్రమణ్యస్వామి ఆరోపించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జశ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పవన్ అగర్వాల్ స్థానిక ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై పత్యల్‌గావ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆ జిల్లా ఎస్పీ లాల్‌భగేల్ తెలిపారు.

## ఎస్సీల ఉపకార వేతనాల్లో కేంద్రం వాటా పెంపు!

**దిల్లీ:** షెడ్యూల్డు కులాల(ఎస్సీ) విద్యార్థుల ఉపకార వేతనాల్లో సరికొత్త నిధుల వాటా విధానాన్ని అమలు చేయాలనే దిశగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ యోచిస్తోంది. ఈ ఉపకార వేతనాల పథకంలో సింహభాగం ఆర్థిక భారాన్ని కేంద్రం భరించనుంది. ఈ మేరకు తాజా ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాలపై మంత్రివర్గ కమిటీకి సమర్పించారు. ఈ ప్రతిపాదన ప్రకారం ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల పథకంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు భరిస్తాయి.

## కలకత్తా హైకోర్టు స్వీయ జరిమానా

**కోల్‌కతా:** దిగువ కోర్టు జడ్జికి హైకోర్టు విధించిన తప్పనిసరి పదవీవిరమణ శిక్షను కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచి పక్కన పెట్టింది. అత్యంత అరుదుగా తనకు తానే లక్ష రూపాయల జరిమానా విధించుకుంది. సదరు జడ్జిని వెంటనే మళ్లీ ఉద్యోగంలో నియమించాలని జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్ సుబ్రా ఘోష్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. కక్షిదారుడికి హైకోర్టు లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశించింది. సీల్దా కోర్టులో రైల్వే మేజిస్ట్రేట్‌గా ఉన్న మింటూ మల్లిక్‌ను 2007లో సస్పెండ్ చేసి, 2013లో తప్పనిసరి పదవీవిరమణ శిక్ష విధించారు. సబర్బన్ రైలును తరచు ఆలస్యంగా నడుపుతున్నందుకు ఒక డ్రైవరును తప్పుబట్టినందుకు ఆయనకీ శిక్ష వేశారు. ఆయన అలా చేయడం ఒకవేళ తప్పే అయినా విధించిన శిక్ష చాలా ఎక్కువ, దిగ్భ్రాంతికరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## రాహుల్ బృందం రాజీనామా!

**దిల్లీ:** ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన సన్నిహిత బృందంగా పేరు పడ్డ యువనేతలు కూడా అదే బాటను అనుసరిస్తున్నారు. పార్టీ పదవులను వదులుకుంటున్నారు. ఆదివారం ప్రధాన కార్యదర్శి పదవికి జ్యోతిరాదిత్య సింధియా, ముంబయి ప్రాంత కమిటీ అధ్యక్ష పదవికి మిలింద్ దేవ్‌రా రాజీనామా చేశారు. ఇరువురు నేతలూ లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం గమనార్హం. పార్టీకి నూతన జవసత్వాలు ఇవ్వాలన్న ఉద్దేశంతో రాహుల్‌కు విశ్వాసపాత్రులుగా ఉన్న యువనేతలకు గతంలో కీలక పదవులు కట్టబెట్టారు. అయితే అధ్యక్షుడే రాజీనామా చేయడంతో వారంతా పదవుల నుంచి తప్పుకొంటున్నారు. శనివారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవ్ చంద్ యాదవ్, ఎస్సీ విభాగం ఛైర్మన్ నితిన్ రౌత్, అంతకుముందు గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు గిరీశ్ చోడోంకర్, ఇటీవలే దిల్లీ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షునిగా నియమితులైన రాజేశ్ లిలోథియాలు రాజీనామా చేశారు. రాహుల్ రాజీనామాతో పార్టీలో వీరి భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తాము దిక్సూచి లేనివారమయ్యామని, పరిస్థితులు ఎలా మారుతాయో వేచి చూడాలని ఓ యువ నాయకుడు అన్నారు. నూతన అధ్యక్షుని ఎన్నికలో జోక్యం చేసుకోబోమని ఇప్పటికే సోనియా గాంధీ, రాహుల్‌లు స్పష్టం చేశారు. ఈ విషయమై ఇప్పటికే సీనియర్ నాయకులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చర్చలు జరుపుతోంది. రాహుల్ బృందంగా ముద్రపడిన వారిలో హరియాణా పీసీసీ అధ్యక్షుడు అశోక్ తన్వర్‌లాంటివారు ఇంకా పదవుల్లో కొనసాగుతున్నారు. తన్వర్ రాజీనామా చేయాలని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా బహిరంగంగానే డిమాండు చేయడం గమనార్హం.

### జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా: మిలింద్

పార్టీని సుస్థిర పరచడానికి జాతీయ స్థాయిలో పాత్ర పోషిస్తానని మిలింద్ దేవ్‌రా అన్నారు. పార్టీ అవసరాల మేరకు ఎలాంటి బాధ్యతనైనా చేపడతానని చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్రంలో ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

## బ్రహ్మోస్ మరింత శక్తిమంతం

**దిల్లీ:** భారత్, రష్యాలు సంయుక్తంగా రూపొందించిన సూపర్‌సోనిక్ క్షిపణి బ్రహ్మోస్‌కు సంబంధించి మెరుగుపరచిన వెర్షన్‌ను సిద్ధం చేసినట్లు ఆ సంస్థ సీఈవో సుధీర్ మిశ్ర చెప్పారు. ఇది 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదని తెలిపారు. క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ వ్యవస్థ (ఎంటీసీఆర్)లో భారత్‌కు సభ్యత్వం లభించిన నేపథ్యంలో ఇది సాధ్యమైందన్నారు. బ్రహ్మోస్ క్షిపణులను యుద్ధవిమానాలకు అనుసంధానించామని చెప్పారు. తద్వారా దీర్ఘశ్రేణి అస్త్రాలను యుద్ధవిమానాలకు అమర్చిన ఏకైక దేశంగా భారత్ అవతరించిందన్నారు.

## 31 మంది మత్స్యకారుల గల్లంతు!

**కక్‌ద్వీప్/కోల్‌కతా:** రెండు పడవల్లో బయలుదేరిన 31 మంది మత్స్యకారులు బంగాళాఖాతంలో ఆదివారం గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సముద్రంలోకి వెళ్లవద్దన్న అధికారుల హెచ్చరికలను ఖాతరుచేయకుండా వారంతా నామ్‌ఖానా నుంచి రెండు పడవల్లో వెళ్లినట్లు మంత్రి ఒకరు వెల్లడించారు. మరో 13 మంది మత్స్యకారులు ప్రయాణిస్తున్న పడవ పాడైపోయి బంగ్లాదేశ్ సాగరజలాల్లోకి ప్రవేశించగా బంగ్లా-భారత తీరరక్షణ దళం సభ్యులు వారిని రక్షించారు.

## 'ప్రాక్సీ ఓటు' బిల్లు యోచన తాత్కాలికంగా విరమణ

**దిల్లీ:** ప్రవాస భారతీయులకు 'ప్రాతినిధ్య ఓటు' (ప్రాక్సీ ఓట్) వెసులుబాటును వర్తింపచేసేందుకు తాజా బిల్లును ప్రవేశపెట్టాలన్న యోచనను కేంద్రం ప్రస్తుతానికి విరమించుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో ఓటు హక్కు ఉన్న ప్రవాసులకు స్వదేశంలోనే తమ తరఫున ఓటేసేందుకు ఓ ప్రతినిధిని నియమించుకునే అవకాశాన్ని కల్పించాలన్నది ఈ బిల్లు ఉద్దేశంగా ఉంది. అయితే, ఈ ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో మరింత లోతుగా పరిశీలన ..అధ్యయనం జరిపేందుకు ప్రస్తుతానికి ఆ యోచనను విరమించుకున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జూన్ 24వ తేదీన ఈ ప్రతిపాదన కేంద్రంకేబినెట్ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినప్పటికీ లోతైన అధ్యయనం కోసమే నిలిపేసినట్లు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

## వాన నీటి పరిరక్షణకు ప్రత్యేక విభాగాలు

- స్థానిక సంస్థలకు కేంద్రం మార్గదర్శకాలు

**దిల్లీ:** వర్షపు నీటిని ఒడిసి పట్టే ప్రక్రియపై సమర్థ పర్యవేక్షణ కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను కోరింది. తమ పరిధిలో కనీసం ఒక్క చెరువునైనా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కూడా సూచించింది. ఈ మేరకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. జులై 1న ప్రారంభమైన 'జల్ శక్తి అభియాన్' తొలి దశ కింద వీటిని విడుదల చేసింది.

- పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లు వాన నీటి పరిరక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఆ నగరంలో వాన నీటి పరిరక్షణను అవి సమర్థంగా పర్యవేక్షించాలి.
- మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసే విభాగాలు తమ పరిధిలోని ప్రాంతంలో భూగర్భ జలాల వెలికితీత, రీఛార్జి తీరును పర్యవేక్షించాలి. ప్రజల అవగాహన కోసం ఈ వివరాలను ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలి.
- భవిష్యత్‌లో భవన నిర్మాణ అనుమతులకు వాన నీటి పరిరక్షణ నిర్మాణాలు తప్పనిసరి చేయాలి. భవన నిర్మాణం పూర్తయ్యాక దాన్ని తనిఖీ చేయాలి.
- దేశంలో చెరువులు, కుంటలు వంటి నీటి వనరులను పునరుద్ధరిస్తే అక్కడ నీటి నిల్వతోపాటు పరిసరాల్లో భూగర్భ జలాల రీఛార్జికి వీలు కలుగుతుంది. ఆ ప్రాంతానికి అదనపు విలువను తెస్తుంది. జల్ శక్తి అభియాన్ కింద కనీసం ఒక నీటి వనరునైనా పునరుద్ధరించేందుకు ప్రతి నగరమూ చర్యలు చేపట్టాలి.
- రోడ్డు పక్కన పాదచారుల మార్గం, పార్కుల్లో నడిచే మార్గాలు వంటి చోట్ల కాంక్రీటు విస్తృతి పెరిగిపోవడం వల్ల నీరు భూమిలోకి సరిగా ఇంకడంలేదు. యూఎల్‌బీలు ఈ అంశంపై చర్యలు చేపట్టాలి.

## జలమయమైన నాసిక్

**ముంబయి, న్యూస్‌టుడే:** మహారాష్ట్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాసిక్ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖాజీగడీ ప్రాంతంలో గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 250 కుటుంబాలను నాసిక్ మున్సిపల్ అధికారులు తాత్కాలిక సహాయ కేంద్రాలకు తరలించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. త్రయంబకేశ్వర్‌లోని ఉమా నుంచి నాసిక్ పట్టణం వరకు పరీవాహక ప్రాంతాల్లో అనేక ఆలయాలు జలమయమయ్యాయి. నాసిక్‌లో కురిసిన వర్షానికి గంగాపూర్, పల్‌ఖేడ్ ఆనకట్టల్లో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. గాడ్గే మహరాజ్ వంతెన సమీపంలో వాహనం వరదలో చిక్కుకోవడంతో జేసీబీ సాయంతో బయటకు తీసే ప్రయత్నం చేశారు. జిల్లాలో ఆదివారం ఉదయానికి 644 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



నాసిక్‌లో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

## ఆవుదూడను చంపినందుకు జైలు

**అహ్మదాబాద్:** ఆవుదూడను చంపాడనే ఆరోపణలు రుజువు కావడంతో గుజరాత్ రాజ్‌కోట్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష పడింది. రూ.1 లక్ష జరిమానా కూడా విధించారు. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి హెచ్‌కే దవే ఈ మేరకు తీర్పు ఇచ్చారు. సదరు నిందితుడు తన ఆవు దూడను దొంగిలించి, వధించాడని, అతని కుమార్తె వివాహ విందులో అతిథులకు వడ్డించాడని ఆరోపిస్తూ ఈ ఏడాది జనవరిలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ దాఖలైంది. గుజరాత్ జంతు పరిరక్షణ(సవరణ) చట్టం,2017 ఆధారంగా శిక్ష విధించారు. కొత్తగా సవరించిన ఈ చట్టం కింద పడిన తొలి శిక్ష ఇదే.

# ఛాంపియన్

## అమెరికాదే మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్

**పారిస్:** ఫిఫా మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికా నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో అమెరికా 2-0 గోల్స్‌తో నెదర్లాండ్స్‌ను ఓడించింది. రెండు జట్లు హోరాహోరీగా పోరాడడంతో తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. ద్వితీయార్ధంలో మెగాన్ (61వ ని), రోజ్ (69వ) కొట్టిన గోల్స్‌తో అమెరికా నెగ్గింది.

## సంధ్యకు రజతం

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** మెక్సికోలో జరిగిన ప్రపంచ మహిళల అమెచ్యూర్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన గోలి సంధ్య సత్తా చాటింది. ఈ టోర్నీలో ఆమె రజత పతకాన్ని కైవసం చేసుకుంది. బిలో-2300 రేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తలపడిన సంధ్య (1975) అరపాయింటు తేడాతో పసిడి పతకాన్ని కోల్పోయింది.

## స్వర్ణాలు గెలిచిన వినేశ్, దివ్య

**మాడ్రిడ్:** భారత అగ్రశ్రేణి రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మరో సారి అంతర్జాతీయ స్థాయిలో మెరిసింది. స్పెయిన్ గ్రాండ్ ప్రి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో వినేశ్ (53 కేజీ) పసిడి సొంతం చేసుకుంది. వినేశ్ ఫైనల్లో జెస్సికాపై గెలిచింది. దివ్య (68 కేజీలు) కూడా బంగారు పతకంతో సత్తాచాటింది.



## కూతురుతో కలిసి.. కేకు కోసి

**లీడ్స్:** టీమ్‌ఇండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోని ఆదివారం తన 38వ పుట్టినరోజు జరుపుకొన్నాడు. ప్రపంచకప్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న ధోని.. తన భార్య సాక్షి, కూతురు జివాతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. తన గారాల పట్టి జివాతో కలిసి కేకు కోశాడు. "ఎప్పటికి నువ్వే నా కెప్టెన్" అని కోహ్లి.. ధోనితో కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

## ప్రిక్వార్టర్స్‌లో కొంటా



**లండన్:** వింబుల్డన్‌లో బ్రిటన్ అమ్మాయి జోహానా కొంటా ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించింది. మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో కొంటా 3-6, 6-4, 6-1తో తొమ్మిదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)కు షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో సౌసా (పోర్చుగల్) ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్లో సౌసా 4-6, 6-4, 7-5, 4-6, 6-4తో ఇవెన్స్ (బ్రిటన్)ను ఓడించాడు.

### సెరెనా-ముర్రే శుభారంభం

మిక్స్‌డ్ డబుల్స్‌లో తొలిసారి జోడీ కట్టిన అమెరికా తార సెరెనా విలియమ్స్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే శుభారంభం చేశారు. తొలి రౌండ్లో ముర్రే-సెరెనా 6-4, 6-1తో మీస్ (జర్మనీ)-గరాచి (చిలీ)పై విజయం సాధించారు.

## అతడి శతకాలు ఎంతో ప్రత్యేకం

కుమార సంగక్కర

ప్రపంచకప్‌లో తన పరుగుల ప్రవాహాన్ని శ్రీలంకతో మ్యాచ్‌లోనూ రోహిత్ కొనసాగించాడు. రికార్డు స్థాయిలో ఐదు శతకాలతో చెలరేగిన అతను పాయింట్ల పట్టికలో జట్టును అగ్రస్థానంలో నిలపడంతో పాటు సెమీస్‌కు ముందు స్థైర్యాన్నందించాడు. తీవ్ర ఒత్తిడి ఉండే ప్రపంచకప్‌లో.. ఇంగ్లాండ్‌లోని పరిస్థితుల్లో వివిధ ప్రత్యర్థి జట్లపై శతకాలు సాధించడం ఎంతో ప్రత్యేకం. ఇదే జోరు కొనసాగించి మరిన్ని రికార్డులు బద్దలు కొట్టడానికి అతనికి అవకాశం ఉంది. అతను ఇలాగే రాణించి జట్టుకు కీలక పరుగులు అందిస్తే.. భారత్‌ను ఓడించడం ఏ జట్టుకైనా కష్టమే. నాకౌట్‌లో ఏ జట్టునూ ఫేవరేట్‌గా పేర్కొనలేం.






## రోహిత్ బ్యాటింగ్.. కదిలే కవిత్వం

వీవీఎస్ లక్ష్మణ్

ఒక సిరీస్‌లో ఒకే ప్రత్యర్థిపై ఐదు సెంచరీలు చేయడం కష్టం.. అలాంటిది ప్రపంచకప్ లాంటి టోర్నీలో.. భిన్నమైన ప్రత్యర్థులు, భిన్నమైన పరిస్థితుల్లో ఐదు సెంచరీలు చేయడం రోహిత్ పరుగుల దాహానికి నిదర్శనం. అతని బ్యాటింగ్ కదులుతున్న కవిత్వం లాంటిది. వరుసగా మూడు పరాజయాలు చవిచూసినా సెమీస్‌కు వచ్చిన కివీస్‌ను భారత్ తేలికగా చూడొద్దు. న్యూజిలాండ్ లక్షణం చివరి వరకు పోరాడడం. ఇదే కోహ్లి సేన కూడా అలవరుచుకోవాలి. సెమీస్‌లో భారత్ ఆరో బౌలింగ్ ప్రత్యామ్నాయంతో ఆడుతుందా.. కివీస్ పేస్ బౌలింగ్ బలాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు బ్యాట్స్‌మెన్‌ను బరిలో దించుతుందా అనేది ఆసక్తికరం.






## రిచర్డ్స్ గుర్తొస్తున్నాడు

కృష్ణమాచారి శ్రీకాంత్

పిచ్‌లపై పగుళ్లు వస్తున్న నేపథ్యంలో స్పిన్నర్ల ప్రాధాన్యం పెరగనుంది. ఇద్దరు ప్రపంచ స్థాయి స్పిన్నర్లు జట్టులో ఉండటం.. మూడో బౌలర్ అందుబాటులో ఉండటం టీమ్‌ఇండియాకు సానుకూలాంశం. కోహ్లి అత్యంత వేగంగా 20,000 పరుగులు రాబట్టి రికార్డు సృష్టించాడు. అతణ్ని చూస్తుంటే వివ్ రిచర్డ్స్ గుర్తొస్తున్నాడు. పరిస్థితులు అతడిపై ప్రభావం చూపలేవు. ఎలాంటి బౌలింగ్‌నైనా తుత్తునియలు చేయగలడు.




# బెజవాడలో వివాదం.. ఇక్కడ హత్య

- ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే వ్యాపారి రామ్‌ప్రసాద్ అంతం
- దారికాచి కత్తులతో దాడి చేసిన దుండగులు
- వ్యాపార భాగస్వామి కోగంటి సత్యం హస్తంపై అనుమానాలు
- సుపారీ హత్య కోణంలో దర్యాప్తు
- తనకు సంబంధం లేదన్న సత్యం

**ఈనాడు, హైదరాబాద్, అమరావతి, పంజాగుట్ట, న్యూస్‌టుడే:** వ్యాపారి తెల్లప్రోలు రామ్‌ప్రసాద్(49) హత్యోదంతం కీలక మలుపు తిరిగింది. హైదరాబాద్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆయన్ని దారుణంగా పొడిచి చంపడం వెనక ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలే కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ వివాదాల పరంపర విజయవాడ కేంద్రంగా జరిగిందని, ఈ దారుణం వెనక వ్యాపార భాగస్వామి కోగంటి సత్యం హస్తం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడలోని కామాక్షి స్టీల్ ట్రేడర్స్ సంస్థలో రామ్‌ప్రసాద్, కోగంటి సత్యం, విజయవాడకే చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు భాగస్వాములు. దశాబ్దం క్రితమే భాగస్వాముల మధ్య విభేదాలొచ్చాయి. ఆ కారణంగా రాజకీయ నాయకుడు సంస్థ నుంచి బయటికి వెళ్లిపోయాడు. మిగిలిన ఇద్దరి మధ్య కొంతకాలంగా వ్యాపార లావాదేవీల విషయంలో విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలోనే రామ్‌ప్రసాద్ కుటుంబంతో సహా రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఖాజాగూడలో ఉంటూ పరిగిలో అభిరామ స్టీల్ ట్రేడర్స్ సంస్థను నిర్వహిస్తున్నాడు. తన కార్యాలయాన్ని పంజాగుట్ట దుర్గానగర్ లోని ప్లాట్ నం.23లో ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతి శనివారం కార్యాలయం సమీపంలోనే ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేవాడు.

### పకడ్బందీ రెక్కీతో ఘాతుకం

ఆనవాయితీ ప్రకారం శనివారం రాత్రి ఆలయానికి వెళ్లి వస్తుండగా ముగ్గురు దుండగులు దారికాచి ఆయనపై కత్తులతో దాడికి తెగబడ్డారు. ఇష్టానుసారం పొడిచారు. కడుపులో కత్తిపోట్లు పడకుండా చేయి అడ్డం పెట్టుకోవడంతో రామ్‌ప్రసాద్ కుడి చేయి తెగి పడింది. తల, కుడి చెంప సహా ఏడు ప్రాంతాల్లో కత్తిపోట్లు పడ్డాయి. ఘటనాస్థలిలోనే బాధితుడు కుప్పకూలిపోయిన తర్వాత దుండగులు పారిపోయారు. క్షతగాత్రుడిని స్థానికులు సమీపంలోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన మృతిచెందాడు.

### ఆయనపైనే అనుమానాలు: మృతుని భార్య

గత నెల రోజులుగా కోగంటి సత్యం నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని మృతుని భార్య వైదేహి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ హత్య వెనక ఆయన హస్తమే ఉందని ఆరోపించారు. దర్యాప్తు ఆరంభించిన పోలీసులు దాడికి ముందు నిందితులు పకడ్బందీ రెక్కీ నిర్వహించినట్లు ప్రాథమికంగా తేల్చారు. ఇది సుపారీ హత్య అనే నిర్ధారణకు వచ్చారు. ప్రధాన నిందితుడు కోగంటి సత్యంతోపాటు, సుపారీ హంతకులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఘటనాస్థలిలో నిందితులు ఉపయోగించిన కత్తులు స్వాధీనం చేసుకుని, సమీపంలోని సీసీ కెమేరాలను విశ్లేషిస్తున్నామని పశ్చిమ మండలం డీసీపీ ఎ.ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నగరంలోని రహస్య ప్రదేశం నుంచి కోగంటి సత్యం పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూ ఇచ్చారు. హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



ఘటనా స్థలంలో నెత్తుటి మడుగులో రామ్‌ప్రసాద్ (అంతర చిత్రంలో) మృతుడు



నిందితుడు కోగంటి సత్యం

### అదుపులో నిందితుని అల్లుడు

దర్యాప్తులో భాగంగా పంజాగుట్ట పోలీసులు విజయవాడ వెళ్లారు. సత్యం ఇంట్లో ఉన్న ఆయన అల్లుడు కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా వారి న్యాయవాది అడ్డుకున్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాతే తీసుకెళ్లాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఆ మేరకు పోలీసులు నోటీసులు ఇచ్చి, విజయవాడ పటమట స్టేషన్‌లో పేరు నమోదు చేసిన అనంతరం అతన్ని హైదరాబాద్‌కు తరలించారు. అతనితోపాటు మరొకర్ని కూడా అదుపులోకి తీసుకున్నారు.

### మూడు నెలలుగా స్టేషన్‌కు రాని సత్యం

సత్యంపై గతంలో విజయవాడ కృష్ణలంక స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. దాన్ని ఇటీవల పటమట పోలీసుస్టేషన్‌కు మార్చారు. రౌడీషీట్ తెరిచిన పక్షంలో సదరు వ్యక్తి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అందుబాటులో ఉండాలని, సత్యం మూడు నెలలుగా అందుబాటులో లేడని స్థానిక పోలీసుల సమాచారం. శనివారం రాత్రి హత్యోదంతం వెలుగు చూసిన నేపథ్యంలో విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. భారతీనగర్‌లోని సత్యం ఇంటికివెళ్లి విచారించారు. "తాము కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్లామని, దైవ దర్శనం అనంతరం తాము ఇంటికి వచ్చామని, సత్యం అటునుంచి అటే హైదరాబాద్ వెళ్లాడని" కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.

### డీజీపీ మహేందర్‌రెడ్డి ఆరా

డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ నగర సీపీ అంజనీ కుమార్ ఆదివారం అర్ధరాత్రి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కేసు వివరాలు తెలుసుకున్నారు. దర్యాప్తు తీరును పర్యవేక్షించారు.

## వరల్డ్ కప్‌లో వాల్తేరు కుర్రాడు

### దివ్యాంగుల క్రికెట్ జట్టులో చోటు



దివ్యాంగుల క్రికెట్ వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టులో వాల్తేరు కుర్రాడు చోటుసాధించాడు. విశాఖపట్నానికి చెందిన రమేష్ సుబ్రహ్మణ్యం నాయుడు ప్రస్తుతం మద్రాస్ ఐఐటీలో ఎంటెక్ చదువుతున్నాడు. పుట్టుకతోనే రమేశ్ రెండు చేతులకు వేళ్లు లేవు. అయినప్పటికీ.. ఆత్మస్థైర్యంతో క్రమం తప్పకుండా సాధనచేసి క్రికెట్‌లో నైపుణ్యం సాధించాడు. బొటన వేలి సాయంతో అవలీలగా క్యాచ్‌లు పట్టగలడు. ఒక కాలికి పాదం లేకపోయినా ఇన్నింగ్స్‌లో 78 పరుగులు, 5 వికెట్లు తన ఖాతాలో వేసుకుని సత్తా చాటాడు. సెలక్టర్లను మెప్పించి ఆగస్టు 3 నుంచి ఇంగ్లండ్‌లో జరిగే మొదటి దివ్యాంగుల క్రికెట్ వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ.. "బాల్యం నుంచి క్రికెట్ ఆడుతున్నాను. వరల్డ్ కప్‌కు ఎన్నికవ్వడం నా కల. ఇందుకోసం చాలా కష్టపడ్డాను. కచ్చితంగా కప్ గెలవడానికి ప్రయత్నిస్తాను" అని తెలిపాడు. చదువు రీత్యా చెన్నైలో ఉంటున్న సుబ్రహ్మణ్యం నాయుడు తమిళనాడు నుంచే వరల్డ్ కప్ జట్టుకు ఎంపికయ్యాడు.

- ఈటీవీ భారత్




## 54 లక్షల కుటుంబాలకు 'రైతు భరోసా'

- రూ.8750 కోట్ల పెట్టుబడి సాయం
- బహిరంగ లేఖలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

**ఈనాడు, అమరావతి:** రైతు భరోసా పథకం కింద 54 లక్షల మంది రైతుల కుటుంబాలకు రూ.8750 కోట్లు పెట్టుబడి సాయం అందిస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీని ద్వారా 15.36 లక్షల మంది కౌలు రైతులు కూడా ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఈ పథకం కింద అక్టోబరు 15 నుంచి ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.12,500 చొప్పున అందిస్తామని అన్నారు. రైతుల అప్పు తీర్చుకోటానికి ఈ సొమ్మును బ్యాంకులు జమ చేసుకునే వీలు లేకుండా వారి చేతికే సొమ్ము ఇస్తామని చెప్పారు. 2020 మే నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నా, గత అయిదేళ్లలో రైతులు పడిన కష్టాలను దృష్టిలో పెట్టుకుని గడువు కంటే ముందే అమలు చేస్తున్నామని చెప్పారు. ఒకే విడతలో రైతుల చేతికి ఇంత మొత్తాన్ని అందించటం దేశ చరిత్రలోనే రికార్డని అన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రైతులకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ

- పీఆర్‌టీయూ రాష్ట్ర సమావేశంలో నేతలు

**ఈనాడు, హైదరాబాద్:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారం రోజుల్లో ఉన్నతస్థాయిలో అధికారులతో సమావేశం నిర్వహించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర నేతలు డిమాండు చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. పీఆర్‌టీయూ భవన్‌లో ఆదివారం సంఘం అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావులు పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61కి పెంచాలని, 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, వేదికపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు

## భాజపాలో జనసేనను కలపం

- ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టీకరణ
- కమలదళంతో వ్యక్తిగత గొడవల్లేవని వెల్లడి
- రామ్‌మాధవ్‌తో భేటీపై సమాధానం దాటవేత



**ఈనాడు, అమరావతి:** గతంలో తాను భాజపాతో కలిసి పనిచేశానని...ఆ పార్టీతో వ్యక్తిగత గొడవలేమీ లేవని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, ఇతర అంశాలపై స్పష్టతివ్వమని కోరుతున్నానే తప్ప... వ్యక్తిగతంగా భాజపాతో తనకు సమస్య లేదని వ్యాఖ్యానించారు. తానా సభల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన ఆదివారం ఓ తెలుగు వార్తాఛానల్‌తో మాట్లాడారు. "భాజపా ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా జనసేనను ఆ పార్టీలో విలీనం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయటకదా" అని ఆ విలేకరి అడగ్గా.. అలాంటిదేమీ లేదని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. "భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌తో మీరు భేటీ అయ్యారని ప్రచారం జరుగుతోంది" అన్న మరోప్రశ్నకు.."అవునా! అలా అంటున్నారా?" అంటూ ఎదురు ప్రశ్నించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ప్రత్యేక హోదా కావాలని బలమైన కోరిక ఉంటే ప్రస్తుత ప్రభుత్వం సహా ఎవరైనా సరే దాని కోసం పోరాడాల్సిందే. అమెరికా, ఐరోపా, గల్ఫ్ దేశాల్లో త్వరలో పర్యటిస్తా. అక్కడ తెలుగువారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటా. భారత్‌కు వెళ్లిన తర్వాత పార్లమెంటు నియోజకవర్గాలవారీగా పార్టీసమీక్షలు నిర్వహిస్తాం" అని పవన్ అన్నారు.

## లైంగిక వేధింపుల వ్యవహారంలో హెచ్‌వోడీపై వేటు

విధుల నుంచి శాశ్వత తొలగింపు

**బాసర, న్యూస్‌టుడే:** నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన అధ్యాపకుడు రవి వరాలను విద్యాలయం నుంచి తొలగించారు. పత్రికల్లో వచ్చిన కథనాలు, విద్యాలయ అంతర్గత విచారణ కమిటీ నివేదికల మేరకు రసాయనశాస్త్ర విభాగాధిపతి రవి వరాలను విద్యాలయం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉపకులపతి అశోక్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసే వారు విద్యాలయ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, విద్యాలయాన్ని అప్రతిష్ఠపాలుచేసే వ్యక్తులను, శక్తులను ఉపేక్షించబోమని ఉపకులపతి పేర్కొన్నారు.

## టీచకుడు

- సందేహాల నివృత్తి పేరిట వేధింపులు
- అధ్యాపకుడిని అరెస్టు చేసిన వరంగల్ షీ బృందం

**వరంగల్ క్రైం, న్యూస్‌టుడే:** విద్యార్థినులకు అసభ్య సందేశాలు పంపుతూ వేధిస్తున్న అధ్యాపకుడిని వరంగల్ షీ బృందం పోలీసులు అరెస్టు చేశారు. షీ బృందం ఏసీపీ బాబురావు వెల్లడించిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఇంచర్ల గ్రామానికి చెందిన తొంబురపు రంజిత్‌కుమార్ హన్మకొండలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తానని మధ్యపెట్టి సెల్‌ఫోన్ నంబర్ ఇచ్చాడు. సందేహాల కోసం ఫోన్ చేసిన విద్యార్థినులతో మాటలు కలిపి.. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా అసభ్యకర సందేశాలతోపాటు చిత్రాలను పోస్ట్ చేయడంతోపాటు లైంగికంగా వేధింపులకు గురి చేశాడు. బాధిత విద్యార్థినులలో ఒకరు అధ్యాపకుడి వ్యవహార శైలిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో వారు కమిషనరేట్ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు షీ బృందం ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి ఆ అధ్యాపకుడు పనిచేస్తున్న కళాశాల వద్దకు వెళ్లారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విషయం నిర్ధారణ కావడంతో హన్మకొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి అధ్యాపకుడిని అరెస్టు చేశారు. మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడితే వాట్సాప్ నంబర్ 94910-89257కు సమాచారమివ్వాలన్నారు.




## దిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మరోసారి విజయసాయిరెడ్డి

**ఈనాడు, అమరావతి:** దిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా విజయసాయిరెడ్డిని మరోసారి నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 22నే విజయసాయిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించింది. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న ఆయన లాభదాయక పదవి చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని గమనించి ఈ నెల 4న ఆ ఉత్తర్వును రద్దు చేశారు. ప్రస్తుతం ఈ పదవితో జీతభత్యాలు, ఎలాంటి హోదా లేకుండా ఆర్డినెన్స్ జారీ చేస్తూ తిరిగి ఆయనను ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు.

## ఏపీలో ఆస్తుల పంపిణీలో స్టాంపు డ్యూటీ తగ్గింపు!

**ఈనాడు, అమరావతి:** కుటుంబ సభ్యుల మధ్య ఆస్తుల పంపిణీలో స్టాంపు డ్యూటీ భారం తగ్గించాలని ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ యోచిస్తోంది. ఆస్తుల విలువల ప్రకారం ఏపీ స్టాంపు డ్యూటీ కింద గరిష్ఠంగా రూ.20వేలు చెల్లించేలా చేస్తే రికార్డుల్లో వాస్తవ వివరాలు నమోదై పొరపాట్లు తగ్గుతాయని రిజిస్ట్రేషన్ శాఖ ఆలోచిస్తోంది. తాజా ప్రతిపాదన ప్రకారం వారసత్వంగా వచ్చిన ఓ ఆస్తి విలువ రూ.లక్ష. దీన్ని నలుగురు పంచుకుంటే, అత్యధిక వాటా మొత్తాన్ని మినహాయించి మిగిలిన సొమ్ముపై ఒక శాతం మొత్తాన్ని స్టాంపు డ్యూటీ కింద వసూలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో గరిష్ఠ మొత్తాన్ని 20వేల రూపాయలుగా నిర్ణయించేలా ప్రతిపాదనలు తయారయ్యాయి.

## బీసీలకు క్రిమీలేయర్ ఎత్తివేయాలి: వీహెచ్

**ఈనాడు, దిల్లీ:** బీసీలకు క్రిమీలేయర్ ఎత్తివేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్ చేశారు. 1993లో ఓబీసీ కమిటీ ఏర్పడినా.. ఉద్యోగాల్లో 9శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు బీసీలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు క్రిమీలేయర్ ఎత్తివేయాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసి మూడేళ్లవుతున్నా పట్టించుకోలేదన్నారు. తెలంగాణలో సోమవారం జస్టిస్ రోహిణీ కమిటీ పర్యటించనుందని, బీసీల్లో ఎన్ని కులాలను కలిపినా అభ్యంతరం లేదని చెప్పారు. క్రిమీలేయర్ ఎత్తివేయకపోతే భవిష్యత్తులో బీసీ విద్యార్థులు బిచ్చగాళ్లు అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.




Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper